అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 16-6-2023

www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 166 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు | వెల : 6.50

బ్రిజ్ భూషణ్‌పై ఛార్జ్‌షీట్

ఆధారాలు లభించలేదు... పోక్సో కేసు ఎత్తివేయాలి

- ఢిల్లీ కోర్టులో దాఖలు చేసిన పోలీసులు





న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు గురువారం ఛార్జిషీటు దాఖలు చేశారు. రెజ్లర్లను ఆయన లైంగికంగా వేధించినట్టు నమోదైన కేసులో పాటియాలా హౌస్ కోర్టులో ఈ ఛార్జిషీటును దాఖలు చేశారు. దాడి, లైంగిక వేధింపులకు సంబంధించిన వ్యాఖ్యలు చేయడం, వెంబడించడం వంటి అభియోగాలపై బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, ఆయన సహాయకుడు వినోద్ తోమర్‌పై స్థానిక కోర్టులో 1,082 పేజీల ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. సింగ్‌పై ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) సెక్షన్ 354 (దౌర్జన్యం చేసే ఉద్దేశ్యంతో దాడి, నేరపూరిత బెదిరింపు), 354ఏ (లైంగిక వేధింపులతో కూడిన వ్యాఖ్యలు చేయడం), 354డీ (వెంబడించడం) కింద అభియోగాలు మోపినట్టు న్యూఢిల్లీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ ప్రణవ్ తాయల్ తెలిపారు. తోమర్‌పై ఐపీసీ సెక్షన్లు 109, 354, 354ఏ కింద అభియోగాలు మోపారు. ఇద్దరిని అరెస్టు చేయడం తప్పనిసరి కాదని తయాల్ అన్నారు. నిందితులకు వ్యతిరేకంగా దర్యాప్తు అధికారులు సాక్ష్యాలను కనుగొన్నారనీ తెలిపారు. ఓవర్సీస్ రెజ్లింగ్ ఫెడరేషన్ల నుంచి కోరిన వివరాలు ఇంకా అందలేదు కాబట్టి, నిందితులపై అనుబంధ... 5లో

తెలంగాణకు జన్మనిచ్చిన సిద్దిపేట

ప్రతి నియోజకవర్గం సిద్దిపేటలా మారినప్పుడే బంగారు తెలంగాణ : మంత్రి కేటీఆర్

- మిషన్ భగీరథకు పునాది ఇక్కడే
- 2014లో ఐటీ ఎగుమతులు రూ.56వేల కోట్లు..తొమ్మిదేండ్లలో 2.41 లక్షల కోట్లకు
- హరీశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

వివరాలు 2లో



బాసర ఆర్జీయూకేటీలో మరో విషాదం

రెండ్రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు మృతి

- కుటుంబాన్ని ఆదుకుంటామని వైస్ ఛాన్సలర్ హామీ

నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో విషాదం నెలకొంది. రెండ్రోజుల వ్యవధిలో యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు మృతిచెందడం కలకలం రేపుతోంది. దీపిక ఆత్మహత్య ఘటన నుంచి తేరుకోకముందే బుధవారం అర్ధరాత్రి సమయంలో సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన బూర లిఖిత హాస్టల్‌లోని నాల్గవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెందింది. కింద అపస్మారక స్థితిలో ఉన్న విద్యార్థినిని గమనించిన ... 5లో



(ఫైల్)

లక్ష్యం లేని దిశగా భారత్

ఈ పరిస్థితి చూస్తే నాకు భయమేస్తోంది : సీఎం కేసీఆర్



- నాగ్‌పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం
- త్వరలోనే మహారాష్ట్రలో పరివర్తన వస్తుంది..
- అది దేశమంతా పాకుతుందంటూ వ్యాఖ్యలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ఒక గమ్యం.. లక్ష్యం లేని దిశగా భారతదేశం పయనిస్తోందని ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి చూస్తే తనకు భయమేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో గురువారం ఆయన బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలోనూ, ఆ తర్వాత మీడియాతోనూ కేసీఆర్ మాట్లాడారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవడమే కొందరికి లక్ష్యంగా మారిందనీ, ఈ రాజకీయ తంత్రంలో దేశం చిక్కుకుపోయిందని వాపోయారు. ప్రతీ ఎన్నికల్లోనూ నేతలు కాదు.. జనం గెలవాలని అన్నారు. ఎన్నికల్లో జనం గెలిస్తే సమాజమే మారుతుందని చెప్పారు. ప్రజలు చంద్రుడు, నక్షత్రాలను కోరట్లేదనీ, నీళ్ల ఇవ్వమని మాత్రమే వారు కోరుతున్నారని తెలిపారు. ఔరంగాబాద్‌లో ఎనిమిది రోజులకు ఒకసారి తాగునీరు వస్తోందంటూ అక్కడి ప్రజలు చెబుతున్నారని గుర్తు చేశారు. గంగా, యమునా డెల్టా ప్రాంతమైన ఢిల్లీలోనూ ఇదే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రమని తెలిపారు. ఇక్కడి నుంచి వివిధ పార్టీలకు చెందిన వారు ఎంతో గొప్ప నేతలుగా ఎదిగారనీ, సీఎంలు అయ్యారని చెప్పారు. కానీ ప్రజల జీవితాల్లో, రాష్ట్ర పరిస్థితుల్లో మాత్రం మార్పు రాలేదని గుర్తు చేశారు. ఇటీవల కర్నాటక ఎన్నికల్లో బీజేపీ ఓడింది.. కాంగ్రెస్ గెలిచిందని గుర్తు చేశారు. కానీ పరిస్థితుల్లో మార్పు రానప్పుడు ఎవరు ... 2లో

కనబడుట లేదు

ప్రధానికి వ్యతిరేకంగా మణిపూర్‌లో పోస్టర్లు

- ఆయన మౌనంపై నిరసనకారుల ఆగ్రహం
- ఇంఫాల్‌లో హింసాత్మక వాతావరణం
- అనేక ఇండ్లకు నిప్పు పెట్టిన అల్లరి మూక





"మణిపూర్ అగ్నిగుండమై మండుతోంది. ప్రధాని మోడీ ఎక్కడ?" అంటూ వెలసిన పోస్టర్లు ఆ రాష్ట్ర ప్రజల ఆవేదనకు అద్దం పడుతున్నాయి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉంటే ఏ రాష్ట్రమైనా అభివృద్ధిపథంలో దూసుకెళ్తుందన్నది బీజేపీ నినాదం! కానీ వాస్తవం వేరుగా ఉంది. కేంద్రంలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నా మణిపూర్ అభివృద్ధికి నోచుకోకపోగా నేడు మంటల్లో మాడిపోతోంది... బీజేపీ రేపిన మతచిచ్చు చల్లారటంలేదు... ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా, వారి ఆస్తులు ధ్వంసం అవుతున్నా ప్రధాని స్పందించడంలేదు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించుకున్న చందంగా ఉన్న ప్రధాని తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రహెూంమంత్రి అమిత్‌షా ఆ రాష్ట్రంలో పర్యటించినా పరిష్కారం లభించింది లేదు. ఇంకెంత మంది అమాయకులు బలికావాలంటూ స్థానిక ప్రజల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. వాటి ఫలితమే "మణిపూర్ మంటల్లో కాలిపోతుంటే ప్రధాని మోడీ కనబడటం లేద"ంటూ వెలసిన ఈ పోస్టర్లు. బీజేపీ విద్వేషరాజకీయాలను, వాటిపట్ల మణిపూర్ ప్రజల నిరసనను ప్రతిబింబిస్తున్న ఈ పోస్టర్లు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.

ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై మోడీ మౌనం అక్కడి ప్రజలు, ఆందోళనకారుల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పిస్తున్నది. రాష్ట్రంలో ఇంత జరిగినా ఆయన నోటి నుంచి ఒక్క మాట కూడా రాకపోవటం వారి కోపానికి కారణమవుతున్నది. ఇందులో భాగంగా మోడీ కనబడటం లేదంటూ ఆందోళనకారులు మణిపూర్‌లో మోడీకి వ్యతిరేకంగా పోస్టర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. 'ఈయనను(మోడీ) మీరు చూశారా?' అని మోడీ పేరు ఆయన చిత్రంతో ఉన్న పోస్టర్లు రాష్ట్రంలో దర్శనమిస్తున్నాయి. ఆయన ఎత్తు ఐదు అడుగుల ఆరు అంగుళాలనీ, ఛాతి 56 ఇంచులు అని ఆ పోస్టర్లలో రాసి ఉన్నది. అంధుడు, చెవిటి వాడనీ, ఆయనను ... 2లో

గుజరాత్ తీరాన్ని తాకిన తుపాను

అల్లాడుతున్న కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలు

- తీర ప్రాంతాల్లో ప్రచండ గాలులు, కుంభవృష్టి
- ఆరు మీటర్ల ఎత్తున ఎగిసిపడుతున్న అలలు
- పల్లపు ప్రాంతాల్లోకి చొచ్చుకు వచ్చిన సముద్రం
- ముంబయిలో సముద్రం అల్లకల్లోలం
- 20గ్రామాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు
- సన్నద్ధంగా వున్న సైన్యం, నేవీ దళాలు

వివరాలు 5లో





ప్రజలను చైతన్యం చేయాలి

గ్రామాల్లో ఓయూ విద్యార్థులు పర్యటించాలి

- ఉస్మానియాలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని కల్పించాలి
- 'సేవ్ యూనివర్సిటీ' రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

వివరాలు 2లో

మా పేర్లనూ తీసేయండి...

ఎన్‌సీఈఆర్‌టీకి 33 మంది విద్యావేత్తల లేఖ

- పాఠ్యాంశాల తొలగింపుతో ప్రమాదంలో సృజనాత్మకత

న్యూఢిల్లీ : పాఠ్యాంశాలు తొలగించిన పాఠ్యపుస్తకాల నుంచి తమ పేర్లను తీసివేయాలని మరో 33 మంది విద్యావేత్తలు ఎన్‌సీఈఆర్‌టీని కోరారు. ఇప్పటికే ఇద్దరు మాజీ ఎన్‌సీఈఆర్‌టీ సలహాదారులు యోగేంద్ర యాదవ్, సుహాస్ పల్షికర్ పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకాల నుంచి తమ పేర్లను



తొలగించాలని కోరిన విషయం తెలిసిందే. ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేష్ ప్రసాద్ సక్లానీకి లేఖ రాసిన వారిలో అశోక విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్స్‌లర్, రాజకీయ శాస్త్రవేత్త ప్రతాప్ భాను మెహతా, ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన రాధికా మీనన్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నివేదిత మీనన్, కాంతి ప్రసాద్ బాజ్‌పాయ్, నేషనల్ ... 2లో

వైన్ గ్రూప్ పేరుతో

సైబర్ మోసాలు

రోజుకో తీరులో రెచ్చిపోతున్న నేరస్థులు

- గతంలో మోసపోయిన వారే అధికం
- డబ్బు రాబట్టుకోవాలని వారే ఇంకొకరిని మోసం చేస్తున్న వైనం



నవతెలంగాణ- సిటీబ్యూరో


సైబర్ నేరస్థులు రోజుకో తీరులో రెచ్చిపోతున్నారు. లక్కీ డ్రాలు, బ్యాంక్ వివరాలు అప్‌డేట్ చేస్తామని, కేవైసీ, ఆధార్ అప్‌డేట్, డెబిట్, క్రెడిట్ కార్డుల లిమిట్ పెంచుతామని, బిట్ కాయిన్ వ్యాపారం పేరుతో కొందరు మోసాలకు పాల్పడుతుంటే, మరికొందరు ఉద్యోగాలు, రుణాలు, వీసాలు ఇప్పిస్తామంటూ అందినకాడికి దండుకుంటున్నారు. తాజాగా వైన్ గ్రూప్ పేరుతో అమాయకులకు వల వేస్తున్న నేరస్థులు లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న విషయం వెలుగుచూసింది.

బాధితులతోనే వ్యాపారం

వైన్ గ్రూప్‌తో మోసపోయిన బాధితులతోనే పెట్టుబడులు, సభ్యులను చేర్చుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇది ఒక గొలుసు కట్టు విధానం అని తెలియక అమాయకులు రూ.లక్షలు చెల్లిస్తున్నారు. టెలిగ్రామ్ ... 5లో

కష్టపడందే ఏదీ రాదు

సైబర్‌క్రైమ్స్ ఏసీపీ, కేవీఎం ప్రసాద్



ఎవరికైనా కష్టపడందే ఏదీ సులువుగా రాదని సైబర్‌క్రైమ్ ఏసీపీ, కేవీఎం ప్రసాద్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులను నమ్మొద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఎవరో తెలియని వ్యక్తులు చెప్పే మాటలు విని, కొందరు వాట్సాప్ గ్రూప్‌లలో అమాయకులను చేర్పించి, వారికి లాభాల ఆశ చూపి బుట్టలో వేస్తున్నారని తెలిపారు. వైన్ గ్రూప్ నిర్వహించే వారు సైతం ఒకప్పుడు బాధితులేనని, వారి డబ్బులు రాబట్టుకోవడం కోసం వారు ... 5లో

మండుతున్న కూరగాయలు

అకాల వడగండ్ల వానలతో తగ్గిన దిగుబడులు

'కూలీనాలి చేసుకుని పొట్టపోసుకుంటున్నం. అన్నింటి ధరలు మండిపోతున్నయి. చికెన్ దుకాణంకు పోవడమే బంద్దైంది. ఇప్పుడు కూరగాయల ధరలూ మండిపోతున్నయి. పావు కిలో కొనాలన్నా పైసలు చాలట్లేదు. వంద రూపాయలు పెడితే నాలుగు రకాల కూరగాయలొచ్చేవి. ఇప్పుడు ఏదడిగినా పావుకిలో సరుకుకు కిలో ధర చెబుతుండ్రు. మా గరీబోళ్లకు కాయగూరల తిండి కూడా కరువైంది. ఇబ్బడిముబ్బడిగా పెరిగే ధరలతో మాలాంటి వాళ్లకు పూట గడవడమే గగనమైంది. వానల్లేక పంటల్లేవంటున్నరు. మార్కెట్‌లో వ్యాపారులు ధరల్ని పెంచి అమ్ముతున్నరు. ఏం చేస్తం... ఉన్నంతలో సర్దుకుపోతున్నం' ఇదీ..! సంగారెడ్డికి చెందిన అనుసూజ ఆవేదన.

- కొత్త పంట వచ్చే వరకు ఇదే పరిస్థితి
- కిలో ధర రూ.80 నుంచి రూ.100 పైనే
- కూరగాయల తిండి కూడా తినలేని దైన్యస్థితి
- రెండు నెలలుగా మండుతున్న చికెన్ ధరలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో తగ్గిన కూరగాయల సాగు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'పంట బాగా పండినప్పుడు ధరరాలే. ఇప్పుడు పంటలేదు. అయినా ధరలు పెరిగాయి. అతివృష్టి.. అనావృష్టి. బెండకాయ, గోరుచిక్కుడు, తురాయి, బుడమకాయ సాగు చేసిన. వర్షాల్లేక పంట దిగుబడి తగ్గింది. ఉన్న కొద్దిపాటి తెంపి మార్కెట్‌కు తెచ్చిన. ధర బాగానే ఉంది. కానీ..! పిరంగున్నయని జనం కొనడంలేదు. కిలో బదులు పావుకిలో కొంటున్నరు. వర్షాలు పడితే పంట దిగుబడులు పెరిగుతయి. కొత్త పంట వచ్చే వరకు రెండు నెలల వరకు ధరలు ఇలానే పెరిగొచ్చు" ఇదీ..! నర్సాపూర్‌కు చెందిన రైతు దేవదాస్ అభిప్రాయం. "సరుకురాట్లేదు. తెల్లవారజాము బోయినపల్లి మార్కెట్‌కెళ్లినం. కూరగాయలు దొరకలే. కొద్దిపాటి సరుకే పోసింద్రు. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నయి. వర్షాల్లేక కొంత ఇబ్బందిగా మారింది. కొత్త పంట వస్తే గానీ..! కూరగాయల ధరలు తగ్గవు. బైపాస్ మార్కెట్‌లో ఒక రోజు రెండు ... 5లో



దేశానికి ఆదర్శంగా తెలంగాణ పట్టణాలు

పట్టణీకరణలో దేశంలోనే రెండో స్థానం

- పట్టణాల్లోనే 47.6 శాతం జనాభా
- జాతీయ సగటు కంటే 12 .5 శాతం అధికం
- మూడు పట్టణాలకు ఇండియన్ స్వచ్ఛత లీగ్ - 2022 అవార్డులు
- ప్రపంచస్థాయిలో హైదరాబాద్‌కు గుర్తింపు


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ పట్టణాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలో 47.6 శాతం ప్రజలు పట్టణాల్లోనే నివసిస్తున్నారు. ఇది జాతీయ సగటు కంటే 12.5 శాతం అధికం. పట్టణాల సమగ్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కలిపిస్తూ నివాసయోగ్య వాతావరణాన్ని కలిపించాలని 2020లో పట్టణ ప్రగతి పేరిట వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర సర్కారు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ మహానగరంతో పాటు అన్ని నగరాలు, పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సీఎం కేసీఆర్ దిశానిర్దేశంలో, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు నేతృత్వంలో తొమ్మిదేండ్లలోనే తెలంగాణ పట్టణాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించి పురోగమిస్తున్నాయి. కేంద్రం నుంచి 23 పట్టణ స్థానిక సంస్థలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు, 3 పట్టణ స్థానిక సంస్థలకు ఇండియన్ స్వచ్ఛత లీగ్ అవార్డులు లభించాయి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే పట్టణ ప్రగతికి సంబంధించి రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

పట్టణీకరణలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఆసియా పసిఫిక్ స్థిరత్వ సూచిక 2021 ప్రకారం హైదరాబాద్ ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని మొదటి 20 స్థానాలలో స్థిరమైన నగరంగా పేర్కొన్నది. అదేవిధంగా భారతీయ నగరాల్లో మూడో స్థానంలో ఉంది. ఐక్యరాజ్య సమితిలోని ఆర్బర్ డే ఫౌండేషన్, ఆహార, ఏఎంపీబీ వ్యవసాయ సంస్థ వరుసగా రెండేండ్లు హైదరాబాద్‌ను ప్రపంచ వృక్ష నగరం-2021గా గుర్తించింది. దక్షిణ కొరియాలోని జెజులో నిర్వహించిన అంతర్జాతీయ ఉద్యానవన ఉత్పత్తుల సంఘం హైదరాబాద్‌కు ప్రపంచ హరిత నగరం-2022 అవార్డును ప్రకటించింది.

రాష్ట్రంలో 129 మున్సిపాలిటీలున్నాయి. 12 కార్పొరేషన్లు, జీహెచ్ఎంసీతో కలిపి మొత్తం 142 పట్టణ ప్రాంతాల్లోని 3618 వార్డులలో కోటి నలభై నాలుగు లక్షల జనాభా నివసిస్తోంది. పట్టణ ప్రగతి కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా అభివృద్ధి కోసం రూ.4537 .79 కోట్లు విడుదల చేయగా ఇప్పటికే రూ.4138 .84 కోట్ల నిధులని ఖర్చు చేశారు. సకాలంలో నిధులు విడుదల, అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పట్టణాలు విరాజిల్లుతున్నాయి. ఏ ఆసరా లేని అనాధలకు ఆశ్రయం కల్పించేందుకు 30 షెల్టర్లను ఏర్పాటు చేసింది. విద్యుత్ ఆదా చేసే ప్రయత్నంలో 9,11,234 ఎల్ఈడి వీధి దీపాలను ఏర్పాటు చేసి ఏడాదికి రూ.128 కోట్ల విద్యుత్ బిల్లులను ప్రభుత్వం ఆదా చేసింది.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. చెత్త రవాణాకు 4713 వాహనాలు ఏర్పాటు చేసి రోజుకు 4356 టన్నుల చెత్తను తరలిస్తున్నది. ఇందుకు వివధ ప్రాంతాలలో 1233 .27 ఎకరాలలో 141 డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. ఘన వ్యర్థ పదార్థాల నిర్వాహణకు 229 కంపోస్ట్ షెడ్స్‌ను ఏర్పాటు చేసి ఎరువు తయారు చేయిస్తున్నది. 100శాతం చెత్తను సేకరిస్తున్న రాష్ట్రంగా తెలంగాణను కేంద్రం ప్రకటించింది. .141 పట్టణ స్థానిక సంస్థలలో రూ.428 .02 కోట్లతో 139 మానవ వ్యర్థాల ట్రీట్మెంట్ ప్లాంట్స్ ను ఏర్పాటు చేసారు, మరో 14 నిర్మాణంలో ఉన్నాయి.

హరితహారం కార్యక్రమం కింద 3618 వార్డులలో 1612 నర్సరీలను ఏర్పాటు చేసారు. ఈ ఏడాది 214,91 లక్షల మొక్కల లక్ష్యం కాగా ఇప్పటికే నర్సరీలలో 248.38 లక్షల మొక్కలను పెంచుతున్నారు. గత ఏడాద నిర్దేశించుకున్న 251 .60 మొక్కల లక్ష్యానికి మించి 252 .27 మొక్కలను 141 పట్టణ స్థానిక సంస్థలలో నాటి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసారు. 2818 పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా ఈ ఏడాది మార్చి చివరి నాటికి రోడ్లకు ఇరువైపులా 1208.52 కిలోమీటర్ల మేర 19.98 లక్షల మొక్కలను నాటారు. 2020 -21 నుండి 2023 -21 వరకు మొత్తం రూ.778 .33 కోట్ల గ్రీన్ బడ్జెట్ ను కేటాయించారు. ఉద్యోగులు , వ్యాపారాలు గత ఏడాది రూ.143.25 లక్షలు హరిత నిధికి జమ చేసారు.

ఆహ్లాదం ఆరోగ్యం కోసం...

రాష్ట్రంలో పట్టణాల్లో ఆరోగ్యం, ఆహ్లాదానికి పార్క్‌లతో పాటు 368 ఓపెన్ జిమ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదేవిధంగా 1273 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసింది. పలు పట్టణాల్లో ప్రత్యేకంగా సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు.

వెజ్ నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు

ప్రజలకు అనుకూలంగా ఒకే చోటు కూరగాయలు పండ్లు, పూలు, మాసం, చేపలు లభించాలనే ఉద్దేశంతో రూ.500 కోట్ల బడ్జెట్ ను కేటాయించి సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. 25 వేల కన్నా ఎక్కువ జనాభా ఉన్న 57 పట్టణాల్లో ఒక్కోటి రెండు కోట్లతో, 25 వేల కన్నా అధికంగా ఉన్న 81 పట్టణాల్లో రూ.4.50 కోట్లతో ఈ మార్కెట్లను నిర్మిస్తున్నారు.

వైకుంఠధామాలు

రాష్ట్రంలోని 141 పట్టణ స్థానిక సంస్థలలో 453 లక్ష్యంగా కాగా.. ఇప్పటికే 304 వైకుంఠధామాలు నిర్మించారు. 176 వైకుంఠ రథాలను ఏర్పాటు చేసారు. రాష్ట్రంలో పురపాలికల్లో చేస్తున్న అభివృద్ధి పనులు దేశ వ్యాప్తంగా ఆకట్టుకుంటున్నాయి. ఇతర రాష్ట్రాల బృందాలు అధ్యయనం చేసేందుకు రాష్ట్రానికి వచ్చే స్థాయికి తెలంగాణ పట్టణాలు ఎదిగి అభివృద్ధికి చిహ్నాలుగా మారాయి.

గ్రామీణ వికాసంలో తెలంగాణ నెంబర్ వన్

- మంత్రులు జగదీష్ రెడ్డి, దయాకర్ రావు
- గ్రామీణ వాతావరణంలో పల్లె ప్రగతి పండుగ



నవతెలంగాణ-కల్చరల్

గ్రామీణ వికాసంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ అని విద్యుత్ శాఖమంత్రి జగదీష్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ 30 విభాగాల్లో గ్రామ అభివృద్ధికి ప్రతి ఏటా అందించే బహుమతుల్లో 13 తెలంగాణకు రావటం సీఎం కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మక పంచాయతీ రాజ్ సంస్కరణలే కారణమని అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం పంచాయతీ రాజ్ శాఖ నిర్వహణలో పల్లె ప్రగతి ఉత్సవాలు, గ్రామీణ నృత్య సంప్రదాయ సందడి మధ్య జరిగిన ఉత్సవాలకు మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు హాజరై మాట్లాడారు. దశాబ్ది ఉత్సావాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కేంద్రం ప్రకటించిన 13 అవార్డుల్లో ఏడు మహిళా సర్పంచ్‌లు ఉన్న గ్రామాలకే వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్రామ వికాసం అభివృద్ధి పథకాలు తెలంగాణతో పోల్చుకోవాలని హితవు చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టి కృషితో గ్రామ ప్రాంతాలు ప్రగతి సాధిస్తున్నాయని కొనియాడారు. మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కండ్లు, చెవులు మూసుకున్న ప్రతిపక్ష నాయకులకు గ్రామాల్లోని అభివృద్ధి తెలియదన్నారు. నేడు సర్పంచులు, గ్రామాధికారులు వారి హయాంలో అభివృద్ధి జరుగుతున్నందుకు గొప్ప అనుభూతి పొందుతారన్నారు. సీఎస్ శాంతి కుమారి మట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు, వచ్చిన తర్వాత తేడా చూడాలన్నారు. ముఖ్యమంత్రి ముందు చూపుతో పంచాయతీ రాజ్ చట్టం 2018 తీసుకురావడంతో గ్రామాల్లో ప్రగతి సాధ్యమైనదని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సందీప్ సుల్తానియా, ఇతర అధికారులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కనబడుట లేదు

(మొదటిపేజీ తరువాయి)

చివరిసారి మణిపూర్ ఎన్నికల ర్యాలీలో చూశా మని అందులో పేర్కొన్నారు. మణిపూర్ విషయంలో మోడీ ఇప్పటికీ మౌనంగానే ఎందుకున్నారని కుకీ, మెయిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు, స్కాలర్లు ప్రశ్నిస్తున్నారు. ఇటు ప్రతిపక్ష కాంగ్రెస్ సైతం మోడీ తీరును తప్పుబడుతున్నది. ప్రధాని తన మౌనాన్ని వీడాలనీ, రాష్ట్రంలో శాంతికి పిలుపునివ్వాలని సూచించింది. సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘా ల నాయకులు సైతం మోడీ మౌనాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రధాని మౌనానికి రాష్ట్ర ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో అల్లర్ల వేడి ఏ మాత్రం చల్లారటం లేదు. అక్కడ అవే ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి కాంగ్పోక్పి జిల్లాలో కాల్పులు చోటు చేసుకోవటం, ఇండ్లకు నిప్పు పెట్టటం వంటి ఘటనలతో తొమ్మిది మంది తమ ప్రాణాలను కోల్పోయిన విషయం తెలిసిందే. ఇది జరిగి ఒక రోజు గడవక ముందే ఇంఫాల్‌లో మళ్లీ హింసాత్మక పరిస్థితులు నెల కొన్నాయి. ఆందోళన కారులు అనేక ఇండ్లకు నిప్పు పెట్టటంతో అక్కడ భయానక వాతావరణం ఏర్పడింది. అయితే, అల్లరి మూకను చెదరగొట్టటానికి పోలీసులు టియర్ గ్యాస్ షెల్‌లను ప్రయోగించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో హింసాత్మక పరిస్థితులు కొనసాగుతుండ టంతో కేంద్ర బలగాలైన ఆర్మీ అస్సాం రైఫిల్స్ రంగం లోకి దిగాయి. అయినప్పటికీ రాష్ట్రంలో హింస తగ్గు ముఖం పట్టకపోవటం గమనార్హం. దాదాపు నెల క్రితం మొదలైన అలర్లు ఇప్పటికీ కొనసాగుతుండ టంతో మణిపూర్‌లోని బీజేపీ సర్కారు వైఫల్యాన్ని సామాజికవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు తీవ్రం గా విమర్శిస్తున్నారు. ఇటు కేంద్రంలోని మోడీ సర్కా రు సైతం అల్లర్లను కట్టడి చేయటంలో విఫలమైం దని ఆరోపించారు. సాక్షాత్తూ కేంద్ర హోం శాఖ మంత్రి రంగంలోకి దిగి రాష్ట్రంలో పర్యటించినా పరిస్థితులు అదుపులోకి రాకపోవటం మోడీ సర్కారు అచేతన స్థితికి నిదర్శనమన్నారు. కాగా మణిపూర్ అంశం అమిత్ షాకు తీవ్ర తల నొప్పిగా పరిణమించిందని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. ఎస్టీ హోదా కల్పించాలన్న డిమాండ్‌పై మెయిటీ, కుకీ వర్గాల మధ్య వివాదం చెలరేగి అది ప్రస్తుత హింసాత్మక పరిస్థితులకు దారి తీసిన విషయం విదితమే. రాష్ట్రంలో చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు అధికార బీజేపీకి ఊపిరి ఆడనివ్వటం లేదు. ముఖ్యంగా ఆ పార్టీకి చెందిన నాయకులకు ఆందోళనకారుల నుంచి ప్రతిఘటనలు ఎదురవుతున్నాయి. బుధవారం చోటు చేసుకున్న హింసలో ఇంఫాల్‌లోని ఆ రాష్ట్ర మంత్రి నెమ్చా కిప్గెన్ అధికార నివాసానికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. భద్రతా బలగాల నుంచి తస్కరించిన ఆయుధాలను తిరిగి ఇచ్చేయాలంటూ మరొక మంత్రి లీషన్గ్తెమ్ సుసింద్రో మెయిటీ తన ఇంటి బయట ఒక డ్రాప్ బాక్స్‌ను ఉంచారు.

మా స్థలాలు మాకిప్పించండి

- బండి సంజయ్‌కు జేఎన్‌జేహెచ్ జర్నలిస్టుల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలో పాతికేండ్లుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్నాం. 17 ఏండ్ల కింద 1100 మందిమి కలిసి సొసైటీగా ఏర్పడ్డాం. అప్పటి ప్రభుత్వం నిజాంపేట, పేట్ బషీరాబాద్‌లలో 70 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఒక్కో జర్నలిస్టు అప్పులు చేసి, పుస్తెలతాడులు అమ్ముకుని రూ.2 లక్షల చొప్పున అప్పటి మార్కెట్ రేటు ప్రకారం రాష్ట్ర సర్కారుకు రూ.12 కోట్లను చెల్లించాం. ఆ స్థలాన్ని జర్నలిస్టులకు ఇవ్వాలని సుప్రీం కోర్టు కూడా తీర్పు ఇచ్చింది. తీర్పు వచ్చి 9 నెలలు అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు కూడా చర్యలు తీసుకోలేదు. మంత్రులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఇప్పటికే సొసైటీలోని 60 మంది జర్నలిస్టులు చనిపోయారు. మీరైనా దయచేసి మా స్థలాలను మాకు ఇప్పించండి' అంటూ జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటీ జర్నలిస్టులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కి విన్నవించారు. ఆ సొసైటీ సభ్యులు అశోక్‌రెడ్డి, బి.శ్రీనివాసరావు, లక్ష్మణ్, తదితరులు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ..జర్నలిస్టులకు న్యాయం జరిగేదాకా అండగా ఉంటాననీ, అవసరమైన న్యాయ, సహాయసహకారాలు అందిస్తామని హామీనిచ్చారు.

కుల సంఘాలకు భూకేటాయింపు రాజ్యాంగ విరుద్ధం :హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుల రహిత సమాజ స్థాపన కావాలని కాక్షించే 21 శతాబ్దంలో, హైటెక్ వ్యవస్థలో కుల సంఘాల కమ్యూనిటీ హాళ్లకు ప్రభుత్వం కారుచౌకగా భూములు కేటాయించడంపై హైకోర్టు విస్మయాన్ని వ్యక్తం చేసింది. ఆయా భూముల కేటాయింపు దారుణమని వ్యాఖ్యానించింది. కులసంఘాలకు భూములు ఇవ్వడం ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. 21వ శతాబ్దంలో కూడా కులాల ఆధారిత విభజన ఉండేలా భూముల కేటాయింపులు ఉన్నాయనివ్యాఖ్యానించింది. మనం ఎటు వెళుతున్నామని ప్రశ్నించింది. ప్రభుత్వాలు ఇలా చేయడం ఆమోదయోగ్యం కాదని చెప్పింది. రంగారెడ్డి జిల్లా హైటెక్ సిటీకి దగ్గరలో కమ్మ, వెలమ కులాలకు 5 ఎకరాల చొప్పున ప్రభుత్వ భూములు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ ప్రొఫెసర్ ఎ.వినాయక్‌రెడ్డి వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. అనంతరం విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాజేంద్రనగర్‌లో రాజబహదూర్ వెంకట రామ్‌రెడ్డి విద్యా సంస్థలకు 5 ఎకరాలను 2018లో ప్రభుత్వం కేటాయించడంపై దాఖలైన పిల్‌ను కూడా బెంచ్ విచారించింది. ఆ సొసైటీకి ప్రభుత్వం భూమి కేటాయిస్తే ఇప్పుడు ఎందుకు పిల్ దాఖలు చేయాల్సి వచ్చిందని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలనీ, అదే విధంగా ఆ భూమిలో నిర్మాణాలు జరిగిందీ లేనిదీ కూడా చెప్పాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను జూన్ 23కు వాయిదా వేసింది. శారదా పీఠం, జీయర్ వేదిక్ అకాడమీలకు ప్రభుత్వం హైదరాబాద్‌లో భూములు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన వీరాచారి దాఖలు చేసిన పిల్ విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. దర్శకుడు ఎన్.శంకర్‌కు రంగారెడ్డి జిల్లాలో భూమి కేటాయింపును సవాల్ చేసిన పిల్ విచారణను జులై 5కి వాయిదా వేసింది. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్, మెంబర్లను రెండేండ్లుగా ప్రభుత్వం నియమించలేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి వేసిన పిల్ చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆధ్వర్యంలోని బెంచ్ గురువారం విచారించింది.

ప్రజలను చైతన్యం చేయాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయాలి. గ్రామ గ్రామాన కాలుకు బలపం కట్టుకుని తిరగాలి. రాష్ట్రంలో జరుగుతున్న అప్రజాస్వామిక చర్యలను ప్రజలకు వివరించాలి. తెలంగాణ ఉద్యమ అకాంక్షలు నెరవేరే వరకు పోరాడాలి. తెలంగాణలోనూ, ఉస్మానియా యూనివర్సిటీలోనూ ప్రజాస్వామిక వాతావరణాన్ని కల్పించాలి' అని పలువురు వ్యక్తులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ అధ్యక్షతన 'సేవ్ ఉస్మానియా యూనివర్సిటీ' అంశంపై గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కర్నాటక ఎన్నికలకు ముందు ఆరునెలల పాటు 122 సంస్థలు సంయుక్తంగా గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయడానికి అనేక కార్యక్రమాలు నిర్వహించాయని తెలిపారు.ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు ప్రచారం చేసినా ఆ ఎన్నికల్లో బీజేపీ గెలవలేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయాలని, అందుకు ప్రజా, సామాజిక, విద్యార్థి, యువజన, పౌరసంస్థలు ఏకతాటిపై కొచ్చి పాలకపార్టీలు గుర్తించేవిధంగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ చైతన్య కార్యక్రమాలు ఎన్నికలపై తీవ్రప్రభావం చూపే అవకాశముందన్నారు. ఒకప్పుడు తెలంగాణ విద్యార్థులంటే ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గౌరవం ఉండేదని, ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. తెలంగాణ కోసం అన్ని వర్గాల ప్రజలు ఎంతో పోరాటం చేశారని, ఆ స్ఫూర్తి తెలంగాణ వచ్చిన తర్వాత కనబడలేదని అన్నారు. తెలంగాణ పోరాటంలో కీలకంగా పనిచేసిన విద్యార్థులను అణిచిపెట్టడానికి యూనివర్సిటీలకు ఐపీఎస్ అధికారులను వీసీలుగా నియమించాలని కేసీఆర్ ప్రయత్నించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడం, విధ్వంసం చేయడాన్ని ఎవరూ ఊహించ లేదన్నారు. విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తం గా కార్యక్రమాలు చేస్తే ఒక్క ఓయూలోని ప్రొఫెసర్లు మాత్రం స్పందించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. విశ్వవిద్యాల యాలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, ఓయూకు పూర్వవైభవం తీసుకురావడానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆకునూరి మాట్లాడుతూ యూనివర్సిటీల్లో విద్యార్థులకు ఏలాంటి సౌకర్యాలు ఉండాల్లో విదేశాల్లో విద్యనభ్యసించిన మంత్రి కేటీఆర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు.

విశ్వవిద్యాలయాలను సీఎం కేసీఆర్ ఎందుకు సందర్శించడంలేదన్నారు. ఓయూలో ఫీజులు పెంచడానికి వీసీ ఎవరని? నిలదీశారు. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోదండరామ్ మాట్లాడుతూ ఓయూలో 2007నుంచి నియామ కాలు జరగలేదని, 800లకుపైగా ప్రొఫెసర్ పోస్టు లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రొఫె సర్లు పూర్తి స్థాయిలో ఉంటేనే గ్రాంట్లు వస్తాయని వివరిం చారు. కాని ఖాళీలను భర్తీచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదన్నారు. నిధుల్లేకపోవడంతో విద్యార్థులకు సరైన సౌకర్యాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు విమలక్క మాట్లాడుతూ ప్రపంచంలోనే ఉస్మానియా యూనివర్సిటీ తలమానికం గా ఉందని, అలాంటి సంస్థను పరిరక్షించాలని సమావేశం నిర్వహించడం దౌర్భాగ్యమని అన్నారు. తెలంగాణ కోసం కాలుకు గజ్జకట్టి, పాట పాడినం, ఆట ఆడినం, పోరాటం చేసి కేసులపాలయ్యామని గుర్తుచేశారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యారంగానికి కొఠారీ కమిషన్ సిపార్సుల మేరకు బడ్జెట్‌లో 20శాతం నిధులను కేటాయించాలని, కానీ నేడు 6.5శాతం కేటాయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ యూని వర్సిటీలను ధ్వంసం చేసి ప్రయివేటు యూనివర్సిటీలను ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పాలమ్మిన మల్లారెడ్డి నేడు విద్యావేత్తగా మారాడని తెలిపారు. క్రమంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్యను అందకుండా చేస్తున్నారని, అందులో భాగంగానే ఓయూలో పీహెచ్‌డీ విద్యార్థులకు భారీగా ఫీజులు పెంచారని గుర్తుచేశారు. ఓయూ రీసెర్చ్ స్కాలర్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ ఓయూలో వీసీ మనుధర్మశాస్త్రాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. ఒక పక్క సీఎం కేసీఆర్ కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మరోపక్క ఓయూలో వీసీ మాత్రం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. డాక్టర్ పృథ్వీరాజు మాట్లాడుతూ సేవ్ తెలంగాణ, సేవ్ ఉస్మానియా యూనివర్సిటీ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్లు మహ్మద్ అన్సారీ, ఖలీదాపర్వీన్, రమామెల్కోటే మాట్లాడారు. పీహెచ్‌డీ ఫీజుల పెంపు, మెస్‌చార్జీల పెంపు, ఓయూలోని సౌకర్యాలు, ఇబ్బందుల గురించి విద్యార్థులు ఆజాద్, దయాకర్, మహేష్, అఖిల్, సలీంపాషా వివరించారు. అనంతరం పలువురు తీర్మానాలు చేశారు.

తెలంగాణకు జన్మనిచ్చిన సిద్దిపేట

- ప్రతి నియోజకవర్గం సిద్దిపేటలా మారినప్పుడే బంగారు తెలంగాణ :ఐటీ టవర్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-కొండపాక

తెలంగాణ రాష్ట్రానికి సిద్దిపేట జన్మనిచ్చి ఒక నాయకున్ని ఇచ్చిందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామ శివారులో బొగ్గులోని బండలో నిర్మించిన ఐటీ టవర్‌ను మంత్రి హరీశ్ రావుతో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సిద్దిపేటను చూసి అసూయపడేలా మంత్రి హరీశ్‌రావు అభివృద్ధి చేస్తున్నారని, ప్రతి నియోజకవర్గం సిద్దిపేటలా అభివృద్ధి చెందినప్పుడే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణ మోడల్ అంటే సమగ్ర, సమీకృత, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి అని, ఓ వైపు పంచాయతీ అవార్డులు.. మరోవైపు పట్టణ ప్రగతి అవార్డులు జాతీయ స్థాయిలో మనకు వస్తున్నాయని తెలిపారు. సిద్దిపేట స్ఫూర్తితో ప్రతి జిల్లాలో స్వచ్ఛబడి ఏర్పాటు చేస్తామని తెలిపారు. 1980లో సిద్దిపేట అభివృద్ధి మొదలైందని, మిషన్ భగీరథకు పునాది పడ్డది కూడా సిద్దిపేటలోనే అని తెలిపారు. మిషన్ భగీరథ పథకాన్ని కేంద్రం హర్ ఘర్ జల్ అని కాపీ కొట్టిందన్నారు. రాబోయే ఎన్నికల్లో హరీశ్ రావుని లక్షా 50 వేల మెజార్టీతో గెలిపించాలన్నారు. ఐటీ హబ్‌ను ఇంకా విస్తరిస్తామని, టాస్క్‌తో యువతకి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పిస్తామని తెలిపారు. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు ఐటీ ఎగుమతులు రూ.56 వేల కోట్లు ఉంటే ఈ తొమ్మిదేండ్లలో రూ.2.41 లక్షల కోట్లు ఉందన్నారు. ప్రపంచంలో ఏ ప్రభుత్వమైనా అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉండదని, కానీ తెలంగాణలో 6.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. యువతకు ప్రయివేట్ ఉద్యోగం సృష్టించడం కోసం ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కలలో కూడా సిద్దిపేటకి ఐటీ టవర్ వస్తుందని అనుకోలేదని, ఇదంతా సీఎం కేసీఆరే చలవేనని తెలిపారు. సిద్దిపేటలో చదివిన బిడ్డలు సిద్దిపేటలోనే ఐటీ ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మంత్రి కేటీఆర్ సహకారంతో మరికొన్ని పరిశ్రమలు తెస్తామన్నారు. దేశ విదేశాల్లో పర్యటించి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, శాంతిభద్రతల గురించి తెలియజేసి ఎన్నో అంతర్జాతీయ ఐటీ కంపెనీలు, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు తీసుకొచ్చారని తెలిపారు. కేటీఆర్ లాంటి ఐటీ మినిస్టర్ ఇతర రాష్ట్రాల్లో కావాలని యువత కోరుకుంటోందన్నారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో పరిశ్రమలకు పవర్ హాలీడే ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సతీష్ కుమార్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, ఫరూక్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, టీఎస్ఐఐసీ ఛైర్మెన్ గ్యాదరి బాలమల్లు, ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, జెడ్పీ ఛైర్మెన్ రోజా రాధాకృష్ణ శర్మ టీఎస్ఐఐసీ ఎండీ నరసింహారెడ్డి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రితో ఎన్టీపీసీ ఒప్పందం

- సీఎస్ఆర్ కింద సాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా జనరల్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీతో ఎన్టీపీసీ సదర్న్ రీజియన్ హెడ్ క్వార్టర్స్ ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై ఎన్టీపీసీ లిమిటెడ్ సదర్న్ రీజియన్ హెడ్ క్వార్టర్స్ హెచ్ఆర్ డీజీఎం సవ్యసాచి పతి, సొసైటీ కన్వీనర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ సంతకాలు చేశారు.

మా పేర్లనూ తీసేయండి...

(మొదటిపేజీ తరువాయి)

యూనివర్సిటీ సింగపూర్ వైస్-డీన్, జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్ రాజీవ్ భార్గవ తదితరులు ఉన్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈ ఆర్‌టీ) పాఠ్యపుస్తకాల్లో మార్పుపై ఆందోళన వ్యక్తం చేస్తూ పాఠ్యపుస్తకాల అభివృద్ధి కమిటీలో భాగమైన 33 మంది విద్యావేత్తలు తమ పేర్లను ప్రస్తుత పాఠ్యపుస్తకాల నుంచి తొలగించాలని కౌన్సిల్‌ను కోరారు. నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) 2005 వెర్షన్ ఆధారంగా 2006-07లో రూపొందించిన పుస్తకాల కోసం పాఠ్యపుస్తకాల అభివృద్ధి కమిటీ లో వీరు సభ్యులు గా ఉన్నారు. ఎన్‌సీ ఈఆర్టీ పాఠ్యాంశాల తొలగింపు సృజనాత్మకత సామూహిక ప్రయత్నాన్ని ప్రమాదంలో పడేసింది అని పేర్కొన్నారు. 'ఎన్‌సీఈఆర్‌టీ ఇప్పుడు పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేస్తున్నది. కొన్ని విభాగాలను (చాప్టర్‌లు కూడా) తీసివేయడం, ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటివి ఉన్నాయి. ఏది ఉంచాలో, ఏది తీసివేయాలో నిర్ణయిం చేది ఎవరు అనేది పారదర్శకంగా లేదు. విద్యా విషయక జ్ఞాన ఉత్పత్తికి ఆధారమని మేం విశ్వసిస్తున్నాము' అని పేర్కొన్నారు. 'అసలు పాఠ్య పుస్త కాల్లో అనేక ముఖ్యమైన పునర్విమర్శ లున్నందున, వాటిని వివిధ పుస్తకాలు గా రూపొందిస్తున్నందున, ఇవి మేం తయారు చేసిన పుస్తకాలు అని చెప్పుకోవడం, వాటితో మా పేర్లను అనుబంధించడం మాకు కష్టంగా ఉంది' అని విద్యావేత్తలు పేర్కొన్నారు. ఈ సృజనాత్మక సమిష్టి కృషి ప్రమాదంలో పడిందని మేం విశ్వసిస్తు న్నాం. ఈ మార్పు పట్ల చాలా విచారం వ్యక్తం చేస్తూ, ఎన్‌సీఈఆర్‌టీ రాజ కీయశాస్త్ర పాఠ్యపుస్తకాల నుంచి పాఠ్య పుస్తక అభివృద్ధి కమిటీ సభ్యులుగా మా పేర్లను తొలగించమని మేం మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాం' అని లేఖలో పేర్కొన్నారు. వివిధ కోణాలు, సైద్ధాం తిక నేపథ్యాల నుంచి రాజకీయ శాస్త్ర వేత్తల మధ్య విస్తృతమైన చర్చలు, సహకారాల ఫలితంగా పాఠ్యపుస్తకాలు వచ్చాయనీ, భారతదేశ స్వాతంత్ర్య పోరాట ఆదర్శాలు, రాజ్యాంగ సభ ఆకాంక్షలు, సూత్రాల గురించి జ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి ఉద్దేశించబడ్డాయని 33 మంది విద్యావేత్తలు తమ లేఖలో పేర్కొన్నారు. మన రాజ్యాంగ క్రమం, నాయకులు, ఉద్యమాల పాత్ర, మన సమాఖ్య వ్యవస్థ స్వభావం, భారత ప్రజాస్వామ్య గణతంత్రం, చైతన్యవంతమైన లక్షణాలు ఉన్నాయని తెలిపారు.

లక్ష్యం లేని దిశగా భారత్

(మొదటిపేజీ తరువాయి)

గెలిచి ఏం ప్రయోజనమంటూ ప్రశ్నించారు.

దేశంలో దళితులు, ఆదివాసీల పరిస్థితి దారుణంగా ఉందని సీఎం ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల పరిస్థితులు మారనంత కాలం దేశం అభివద్ధి చెందబోదని అన్నారు. అందువల్ల దేశం మారాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. అనేక రాష్ట్రాల్లో వేల టీఎంసీల నీరు వథాగా సముద్రంలో కలుస్తోందనీ, ప్రపంచంలోనే అత్యధికంగా మన దగ్గరే ఎక్కువశాతం సాగుకు యోగ్యమైన భూమి ఉందని చెప్పారు. మనం తలుచుకుంటే దేశంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు ఇవ్వొచ్చని తెలిపారు. ఎన్నో వనరులు సమద్ధిగా ఉన్నా... ప్రజలకు ఎందుకీ కష్టాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్, ఉచిత నీరుతో తెలంగాణలో సాగును పండుగలా మార్చామని వివరిం చారు. ఇప్పుడు తెలంగాణ వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను దాటే సిందనీ, రాష్ట్రంలో పండిన పంటంతా ప్రభుత్వమే కొంటో ందని చెప్పారు. పంట సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీరు అందిస్తున్నామని కేసీఆర్ చెప్పుకొచ్చారు. తాగునీటి కోసం బిందెలు పట్టుకుని తిరిగే పరిస్థితి ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడా లేదని సీఎం వివరించారు. రెవెన్యూ వ్యవస్థలోని అవినీతిని పారద్రోలాలా..? వద్దా? అంటూ ప్రశ్నించారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను డిజిటలైజ్ చేయటం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేశామన్నారు. గతంలో తెలంగాణలో మహారాష్ట్ర కంటే ఎక్కువగా రైతు ఆత్మహత్యలు జరిగేవని తెలిపారు. ఇప్పుడు సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ లభిస్తోందని చెప్పారు. దీంతో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గిపోయాయని స్పష్టం చేశారు. తెలంగాణాలో మాదిరిగా పథకాలు అమలు చేస్తే మహారాష్ట్ర దివాలా తీస్తుందంటూత కొందరు మరాఠా నేతలు అంటున్నారనీ, అలా చేస్తే ఆయా నేతలే దివాలా తీస్తారు..తప్ప ప్రజలు కాదని వ్యాఖ్యానించారు. తమ పథకా లను అమలు చేస్తే మహారాష్ట్ర ప్రజలు దీపావళి జరుపు కుంటారని చెప్పారు.

మహారాష్ట్రకే వెళ్తున్నారు.. మా మధ్య ప్రదేశ్‌కు రావట్లేదంటూ అక్కడి ప్రజలు మమ్మల్ని అడుగుతున్నారని తెలిపారు. మహారాష్ట్రలో తెలంగాణ నమూనా పాలన వచ్చే వరకూ బీఆర్ఎస్ పోరాడుతోందని తెలిపార. ఆ రాష్ట్రం నుంచి అనేక మంది నేతలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు.. త్వరలోనే లక్షల సంఖ్యలో సభ్యత్వాలు నమోదవుతాయంటూ ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో త్వర లోనే పరివర్తన వస్తుంది.. అది దేశమంతా పాకుతుం దని పేర్కొన్నారు. త్వరలో పుణె, ఔరంగబాద్‌లో కూడా బీఆర్ఎస్ ఆఫీసులను ఏర్పాటు చేస్తామని కేసీఆర్ తెలిపారు.

ఏనిమిదేండ్లవుతున్నా 'ఉస్మానియా'ను ఎందుకు నిర్మించలేదు

సీఎం కేసీఆర్‌కు టీడీపీ ప్రశ్న

నవతెలంగాణ-హైదరాబాద్

2014కు ముందర ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణాన్ని అప్పటి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని కేసీఆర్ దొంగ ఏడుపులు ఎందుకు ఏడ్చారనీ, ఇప్పుడెందుకు నిర్మించడం లేదని తెలుగుదేశం ప్రశ్నించింది. 2015 జూలై 22వ తేదీన కేసీఆర్ ఉస్మానియాను సందర్శించి. దవాఖానాను వారంలోగా ఖాళీ చేస్తాం... ఏడాదిన్నరలో కొత్త భవనాన్ని నిర్మిస్తాం.. ఎన్ని కోట్లయినా ఖర్చు పెడతాం... ఉస్మానియా ప్రతిష్ట నిలబెట్టేలా ట్విన్ టవర్లను నిర్మిస్తామని చెప్పి దాదాపు ఎనిమిదేండ్ల వుతున్నా పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న గురువారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. తొమ్మి దేండ్ల తెలంగాణ రాష్ట ప్రస్థానంలో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట వేడుకలను జరుపు తున్నదన్నారు. బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్స్ దశాబ్ది బ్లాకుకు శంకుస్థాపన చేశారు. సంతోషం..కానీ పేదోడికి వైద్యం అందించే ఉస్మానియా ఆస్పత్రి ఎక్కడికి పోయింది ? ఎందుకు ముఖ్యమంత్రి ఉస్మాని యా ఆస్పత్రి పేరును కూడా మాట్లాడడానికి ఇష్టపడటం లేదని వ్యాఖ్యా నించారు. 1168 పడకల సామర్థ్యం గల ఉస్మానియాలో మొత్తం 21 విభా గాలు ఉన్నాయి. 1300 మంది ఇన్‌పేషంట్లకు వసతి కల్పించగల సామర్థ్యం ఉన్న ఉస్మానియా ఆస్పత్రిపై ముఖ్యమంత్రికి ఎందుకు శీత కన్ను..? రెండు వేల మంది పేషెంట్లకు ఓపి సేవలు అందించగల సామర్థ్యం ఉన్నప్పటికీ మీరు ఎందుకు ఉపయోగించక పోవడం లేదని ప్రశ్నించారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- సంక్లిష్ట స్థితిలో కార్మికోద్యమాలు
- ప్రపంచవ్యాప్తంగా పెరిగిన వైషమ్యాలు
- శ్రామిక ఐక్యతకు విఘాతం : సీఐటీయూ ఖమ్మం జిల్లా కార్యాలయ శంకుస్థాపనలో ఖమ్మం మాజీ ఎంపీ తమ్మినేని, సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర ఉద్యమాలు సంక్లిష్ట స్థితిలో ఉన్నాయని, కార్మిక ఉద్యమాలు ప్రమాదంలో పడ్డాయని ఖమ్మం మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు కార్మిక హక్కులను హరించి వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న స్థితిలో ఉన్నామన్నారు. ఖమ్మం గట్టయ్య సెంటర్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టిన బీటీ రణదీవే సీఐటీయూ జిల్లా కార్యాలయం శంకుస్థాపన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర ఉద్యమాల మనుగడ ప్రమాదకర స్థితిలో పడ్డాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా అంతరాలు పెరుగుతున్నాయని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ క్షీణించిందని, జీవించే హక్కునూ లాగేసుకుంటున్నారని చెప్పారు. దాంతో శ్రామికవర్గ ఐక్యత ప్రమాదంలో పడిందని తెలిపారు.

అనంతరం సాయిబాబు మాట్లాడుతూ.. కార్మిక వర్గం ఐక్యతకు సీఐటీయూ కేంద్ర బిందువుగా నిలుస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి కార్మిక వర్గాన్ని తిరిగి బానిసత్వంలోకి నెట్టేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా భారతదేశంలో కార్మిక వర్గం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికవర్గ ఐక్యతని విచ్ఛిన్నం చేసే కుట్రలను కార్మికులు ఎప్పటికప్పుడూ గమనిస్తూ మరింత ఐక్య పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ఖమ్మంలో సీఐటీయూ కార్యాలయం కార్మిక వర్గ ఐక్యతకు ఉపయోగపడుతుందని, కార్మికుల అందరి కార్యాలయంగా అందరి భాగస్వామ్యంతో త్వరలో ఇది ప్రారంభానికి సిద్ధం కావాలని ఆకాంక్షించారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల అందరి దగ్గరికి వెళ్లి.. కలిసికట్టుగా కార్మిక శక్తితో ఈ భవనం రూపుదిద్దుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మా విష్ణువర్ధన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సభలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం నాయకులు నున్నా నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.రాజారావు, రాష్ట్ర కార్యదర్శులు ఏ.జె.రమేష్, బి. మధు, జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ . కోటంరాజు, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు సాంబశివరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి, రైతు సంఘం జిల్లా నాయకులు బండి రమేష్ , సీఐటీయూ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయం..జ్ఞాన సముపార్జనం





- ప్రకృతి రమణీయంతో మానసికోల్లాసం
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అనుమతి
- సీనియర్ సిటిజన్లు, పిల్లలకు అందుబాటులో ఈ-కార్ట్ వాహనం
- టికెట్ ధర రూ.50 మాత్రమే : రాష్ట్రపతి భవన్ పీఆర్వో కుమార్ సమ్రేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం జ్ఞాన సముపార్జన కేంద్రం అని రాష్ట్రపతి భవన్(న్యూఢిల్లీ) పీఆర్వో కుమార్ సమ్రేశ్ అన్నారు. ఎటు చూసినా పచ్చదనం, ప్రకృతి రమణీయతను అస్వాదిస్తూ మానసికోల్లాసం పొందొచ్చునని చెప్పారు. గురువారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రపతి నిలయం మేనేజర్ కె.రజిని ప్రియ, ముఖ్య అధికారి చంద్రశేఖర్ నాయుడుతో కలిసి మాట్లాడారు. రాష్ట్రపతి నిలయం చరిత్రను, అందులోని గార్డెన్ల విశిష్టతను, నాలెడ్జ్ గ్యాలరీ ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్రపతి విడిది, ప్రతి సోమవారం తప్ప మిగతా అన్ని రోజుల్లోనూ సందర్శకులను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వీక్షించే అవకాశాన్ని ఇప్పటికే కల్పిస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లు, చిన్న పిల్లలకు నిలయంలో సందర్శించేందుకు ఈకార్ట్ వాహనాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. నిలయంలోని విశిష్టతలను వివరించేందుకు హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో ప్రావీణ్యం ఉండి ప్రత్యేక శిక్షణ పొందిన 20 మంది గైడ్లను నియమించామని తెలిపారు. కిచెన్ నుంచి డైనింగ్ హాల్ వరకు ఉన్న టన్నెల్‌ను గ్రామీణ జీవనం ఉట్టిపడేలా, బాగా చదువుకుని మహిళలు ఎదుగుతున్న క్రమాన్ని వివరించే చేర్యాల ఆర్ట్ ద్వారా ఆకట్టుకునేలా బొమ్మలను గీయించామన్నారు. ఫ్లాగ్ పోస్ట్‌పాయింట్, జైహింద్ ర్యాంపు, నిజాం సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేస్తూ సైన్యం-నిజాం పాలకుల మధ్య జరిగిన ఒప్పందపత్రాలు అందజేసిన ప్రాంతాలను ప్రతి ఒక్కరూ చూసి చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకోవాలన్నారు. నాలెడ్జ్ సెంటర్‌ను పునరుద్ధరించామనీ, అందులో రాష్ట్రపతులకు ఆయా దేశాల నేతలు ఇచ్చిన గిఫ్టులు, చేతిరాతతో రాసిన రాజ్యాంగ ప్రతి, దేశంలో ఇచ్చే అత్యున్నత పురస్కారాల నమూనాలు, రాష్ట్రపతులు వాడిన గుర్రపు బగ్గీ, బుల్లెట్ ప్రూఫ్ కారులను అందులో పొందుపర్చామని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం తెలంగాణలో జరిగిన పోరాటం, రైతాంగ పోరాట వీరుల ఫొటోలను అందులో ఉంచామని తెలిపారు. రాక్, హెర్బల్, బటర్‌ఫ్లై, నక్షత్రాల గార్డెన్‌ల గురించి, అందులో ఉన్న చెట్ల ప్రాముఖ్యత గురించి వివరించారు. మాజీ గార్డెన్, చిల్డ్రన్ పార్కులను కొత్తగా నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది మార్చి 22 నుంచి సందర్శకులకు అన్ని రోజులూ అందుబాటులో ఉండేలా వర్చువల్ పద్ధతిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించాలనుకునేవారు http://visit.rashtrapatibhavan.gov.in వెబ్‌సైట్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవాలనీ, డైరెక్టుగా కూడా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. స్వదేశీ సందర్శకులకు రూ.50, విదేశీ సందర్శకులకు రూ.250 టిక్కెట్ ధర ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు స్కూల్ తరఫున బుక్ చేసుకుంటే ఉచిత సందర్శనకు అవకాశం కల్పిస్తామన్నారు. గ్రూపుగా 30 మంది సందర్శనకు వస్తే టికెట్ ధరపై 20 శాతం రాయితీ ఇస్తామని చెప్పారు. రాష్ట్రపతి నిలయంలో ఆయా ప్రదేశాల గురించి వివరించేందుకు గైడ్లను నియమించామనీ, ఫ్రీ పార్కింగ్, వృద్ధుల కోసం వీల్‌చైర్లు, రెస్ట్‌రూమ్, ఫస్ట్‌ఎయిడ్, క్యూరియోషాప్, తదితర సౌకర్యాలను కల్పించామని తెలిపారు. రాష్ట్రపతి నిలయంలోని ముఖ్యమైన ప్రాంతాలను మీడియా ప్రతినిధులకు చూపెట్టి వివరించారు.

దేశంలోనే ఉత్తమ పంచాయతీగా జగన్నాథపురం

- 17న ఢిల్లీలో ప్రదానం చేయనున్న ఉపరాష్ట్రపతి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ మంచినీటి వనరుల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జగన్నాథపురం దేశంలోనే ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును పొందిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నట్టు పేర్కొన్నారు.

అవార్డు పొందిన జగన్నాథపురం గ్రామ పంచాయతీ కి, పాలకవర్గం, సిబ్బంది, అధికారులకు అభినందనలు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 11 కేటగిరీలలో 41 మంది విజేతలను ప్రకటించిందనీ, అందులో ఉత్తమ రాష్ట్రంగా మధ్యప్రదేశ్, ఉత్తమ జిల్లాగా ఒడిశాలోని గంజాం, ఉత్తమ గ్రామ పంచాయతీగా జగన్నాథపురం నిలిచాయని వివరించారు. ఈ నెల 17 ఢిల్లీలో గల విజ్ఞాన్ భవన్‌లోని ప్లీనరీ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందచేస్తారు. అవార్డు విజేతలకు ప్రశంసా పత్రం మరియు ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందిస్తారని చెప్పారు. సీఎం కేసీఆర్ దార్శనికత వల్ల రూపొందించి, అమలు చేస్తున్న పల్లె ప్రగతి, ప్రగతి ఫలాలు ఈ రూపంలో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

సంపాదకీయం

కార్పొరేట్లకు ఒక మంచి యుద్ధం!

ఉక్రెయిన్ సంక్షోభం 477వ రోజులో ప్రవేశించింది. అది ఇంకా కొనసాగాలని కోరుకుంటున్నాయి కార్పొరేట్ శక్తులు. ఎందుకు అంటే యుద్ధం వలన లబ్దిపొందేది ఎక్కువగా ఆయుధ కంపెనీలే అన్నది తెలిసిందే. ఈ సంక్షోభంలో కొంపాగోడు వదలి ఇతర ఐరోపా దేశాల్లో

> ఒక వైపు ఉమ్మడిగా రష్యాను దెబ్బతీసేందుకు చూస్తూ మరోవైపు ఆయుధమార్కెట్ కోసం అమెరికాతో ఐరోపా ధనిక దేశాలు తెగేదాకా లాగుతాయా, వైరుధ్యాలు ఆ స్థాయికి పెరుగుతాయా అన్నది చెప్పలేం. అదే జరిగితే ప్రపంచంలో రాజకీయంగా అవి మరింత బలహీనపడతాయి. ఇప్పటికే తమతో నిమిత్తం లేకుండా ప్రపంచ పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు సామ్రాజ్యవాద శక్తులు ఆందోళన చెందుతున్నందున అంతర్గత దెబ్బలాటలకు బదులు సర్దుబాటుకే పూనుకోవచ్చు.

తలదాచుకుంటున్న 80లక్షల మంది ఉక్రేనియన్లు కూడా ఐరోపా దేశాల కార్పొరేట్లకు వరంగా మారినట్లు తాజా పరిశోధన వెల్లడించింది. కాందిశీకులుగా వెళ్లిన వారిలో సగం మంది యువత. వారంతా నిపుణులైన కార్మికులు కావటం, తలదాచుకుంటున్న దేశాలలోని నైపుణ్యం లేని కార్మికులకు తోడైతే జీడీపీ పెరుగుదలకు దోహదం చేస్తుందని అమెరికాలోని నార్త్ కరోలినా విశ్వవిద్యాలయ బృందం పేర్కొన్నది. ఈ సంక్షోభం ఇంకా కొనసాగాలని, తీవ్రం కావాలని కోరుకుంటున్న శక్తుల మధ్య లాభాలను ఎవరు కొట్టేయాలన్న పేచీ తలెత్తింది. మా ఎత్తుగడలు వ్యూహంలో భాగంగా ఈ సంక్షోభం కొనసాగుతున్నందున తమ సంస్థల నుంచి ఐరోపా దేశాలు ఆయుధాలను కొనుగోలు చేయాలని అమెరికా ఒత్తిడి పెంచుతోంది. పోరు జరుగుతున్నది మా గడ్డమీద, కావాల్సిన అస్త్రశస్త్రాలను మా కంపెనీలూ తయారు చేయగలవు గనుక కొనుగోళ్లు వాటి నుంచే జరుపుతామని ఐరోపా దేశాలు చెబుతున్నాయి. మానవ ప్రాణాలతో లాభాలు పొందాలనే పశ్చిమ దేశాల కాంక్ష ఒక వైపు, ప్రపంచానికి మానవత్వ ముఖ ప్రదర్శన మరోవైపు. ఎంత దుర్మార్గం, ఎంత నయవంచన! రష్యాను దెబ్బతీసేందుకు ముద్దులాట-ఆయుధాల మార్కెట్లో కుమ్ములాట!



నాటో దేశాలు మిలిటరీ ఖర్చు పెంచాలని అమెరికా ఎంతో కాలంగా ఒత్తిడి తెస్తోంది. ప్రతి నాటో సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేస్తున్నారు. ఐరోపా ధనిక దేశాల ఆర్థిక రంగం కూడా అంత సజావుగా లేనందున అక్కడి కార్పొరేట్లకు లాభాలను కట్టబెట్టాలంటే ఆయుధాల ఉత్పత్తే దగ్గరదారి. రక్షణ ఖర్చు పెంచాలంటున్నారు సరే పరిస్థితులు బాగోలేనందున మా పెట్టుబడులకు హామీ ఉండాలంటే ముందు దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవాలని సదరు కంపెనీలు ఒత్తిడి తెస్తున్నాయి. అంటే అవసరం ఉన్నా లేకున్నా ప్రభుత్వాలు కొనుగోలు చేయకతప్పదు. ఈ రంగంలో పోటీ ఎక్కువగా ఉండటంతో పాలకులను నమ్మి పెట్టుబడి పెడితే, తీరా కాంట్రాక్టు దక్కకపోతే తమ పరిస్థితి ఏమిటని అవి ప్రశ్నిస్తున్నాయి. దీనికి తోడు ఎక్కడ అమెరికన్ కంపెనీలు తమ అవకాశాలను తన్నుకుపోతాయో అన్న ఆందోళన మరోవైపు. ఉత్పత్తి చేయండి, ఒప్పందాలు తరువాత అంటున్నాయి ప్రభుత్వాలు. కోడి ముందా గుడ్డు ముందా అన్నట్లుగా పరిస్థితి ఉంది. స్వీడన్, జర్మనీ, ఫ్రెంచి బడా కంపెనీలు సంక్షోభాలు కొనసాగకపోతాయా, కొత్తవాటిని సృష్టించకుండా ఉంటారా అన్న ధైర్యంతో పెట్టుబడులకు సిద్ధపడుతున్నాయి. చాలా కాలం పాటు ఆఫ్రికాలోని అనేక దేశాలు, ఆఫ్ఘనిస్తాన్ వంటి చోట్ల పరిమితమైన ఆయుధాలతోనే అమెరికా కూటమి దేశాలు ఉద్రిక్తతలను కొనసాగిస్తున్నాయి. మరోసారి ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు ఏర్పడుతున్నట్లు అంచనా వేస్తున్న ఆయుధ రాబందులు వేట మొదలు పెట్టాయి. ఉక్రెయిన్‌లో టాంకులు, ఫిరంగుల వినియోగం పెరిగినందున వాటికి మార్కెట్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. వచ్చే పన్నెండు నెలల కాలంలో ఉక్రెయిన్‌కు పది లక్షల రౌండ్ల ఫిరంగి గుండ్లు సరఫరా చేస్తామని ఐరోపా సమాఖ్య వాగ్దానం చేసింది. వాటిని కొత్తగా ఉత్పత్తి చేయాల్సి ఉంది.

తమ గడ్డ మీద తమ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానమే ఉండాలని ఫ్రెంచి నేత మక్రాన్ బహిరంగంగానే చెప్పాడు. నాటో దేశాలు క్రమంగా రక్షణ ఖర్చు పెంచుతున్నాయి. ఆ మొత్తం తమకే దక్కాలని ఐరోపా కోరుకుంటున్నది స్పష్టం. తమ రక్షణ సంగతి తాము చూసుకోగలమని అమెరికా పెత్తనం అవసరం లేదని ఫ్రాన్సు, జర్మనీలు ఎప్పటి నుంచో చెబుతున్నాయి. ప్రస్తుతం ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా వేగంగా ఆయుధాలను సమకూర్చుకోవాలంటే అమెరికా కంపెనీల నుంచి కొనుగోలు తప్పని స్థితి. దీన్ని సొమ్ము చేసుకోవాలని అమెరికా చూస్తుండగా ఎంతకాలం ఇలా ఉండాలని ఐరోపా కంపెనీలు వత్తిడి పెంచుతున్నాయి. ఒక వైపు ఉమ్మడిగా రష్యాను దెబ్బతీసేందుకు చూస్తూ మరోవైపు ఆయుధమార్కెట్ కోసం అమెరికాతో ఐరోపా ధనిక దేశాలు తెగేదాకా లాగుతాయా, వైరుధ్యాలు ఆ స్థాయికి పెరుగుతాయా అన్నది చెప్పలేం. అదే జరిగితే ప్రపంచంలో రాజకీయంగా అవి మరింత బలహీనపడతాయి. ఇప్పటికే తమతో నిమిత్తం లేకుండా ప్రపంచ పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు సామ్రాజ్యవాద శక్తులు ఆందోళన చెందుతున్నందున అంతర్గత దెబ్బలాటలకు బదులు సర్దుబాటుకే పూనుకోవచ్చు.

నెహ్రూ సింగోల్ స్వీకరిస్తే, అన్నాదురైకి ఆవేదనా?



డాక్టర్ దేవరాజు మహారాజు

1947లో భారతదేశంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాన్నీ, నెహ్రూను సింగోల్ విషయంలో అన్నాదురై హెచ్చరించారు. 14 ఆగస్టు 1947 సాయంత్రం తమిళనాడు ఆధీనం మఠంవారు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను కలిసి, ఆయనకు సింగోల్ (రాజదండం) అందించారు. విషయం తెలుసుకున్న అన్నాదురై వెంటనే పదిరోజుల వ్యవధిలో నెహ్రూజీకి కొన్ని సూచనలు చేశారు. ఆగస్టు 24, 1947 నాడు అన్నాదురై 'ద్రవిడనాడు' తమిళవార పత్రికలో ఒక వ్యాసం ప్రకటించారు. అప్పటికి ఆయన తమిళనాడుకు ముఖ్యమంత్రి కాలేదు. తమిళవార పత్రిక 'ద్రవిడనాడు'ను స్థాపించి, దాని సంపాదకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నారు. ఆ తర్వాత 1949లో ద్రవిడ కజకం పార్టీని వదిలి "ద్రవిడ మున్నేట్ర కజకం" అనే కొత్త పార్టీని ఏర్పాటు చేసి, తన అనుచరులందరినీ అందులో చేర్చుకున్న విషయం మనకు తెలుసు - ఇప్పుడు మళ్ళీ డెబ్బయారేండ్ల తర్వాత 'విడుతలై' పత్రిక సంపాదకుడు, ద్రవిడ కజగం పార్టీ అధ్యక్షుడూ అయిన కె. వీరమణి తన పత్రికలో ఆ వ్యాసాన్ని మే 26, 2023న పునర్ముద్రించారు. దాంతో ఆనాడు అన్నాదురై నెహ్రూజీకి చేసిన సూచనలేమిటీ, హెచ్చరికలేమిటీ? ఆయనకు ఎందుకంత ఆవేదన? అనే విషయాలు స్పష్టమయ్యాయి.

తిరువదుతురై ఆధీనం - శైవ మఠానికి చెందిన కొందరు సాధువులు కొత్త ప్రధాని మంత్రి అయిన పండిట్ నెహ్రూ దగ్గరికి వెళ్ళి, సింగోల్ బహూకరించి రావడం సి.ఎన్. అన్నాదురై (అన్నా)కి మింగుడు పడలేదు. ఎందుకంటే ఈ శైవ సాధువులు ఎదుటి వారిని ఎలా ప్రభావితం చేస్తారోనన్నది ఆయనకు తెలుసు. బహుమతి పేరుతో తెచ్చింది అది బహుమతి కాదని, అది ఎదుటివారి ఆలోచనా ధోరణిని ప్రభావితం చేస్తుందనీ... తమ మతానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే విధంగా ఒత్తిడి తెస్తుందని అన్నాదురై తెలుసుకునే రాశారు. మొట్టమొదటి ప్రభుత్వం గనుక విజయవంతంగా పరిపాలన కొనసాగించగలిగితే... ఆధీనం మఠం వారు ఆ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుని, ప్రచారం చేసుకుంటారని అన్నాదురై భావించారు. మంచి పాలన - ఆధీనం మఠం వారిచ్చిన సింగోల్‌తోనే - దాని ప్రభావంతోనే కొనసాగుతుందని - దేశ ప్రజలు భావించే విధంగా చేస్తారనీ... అన్నాదురై నెహ్రూను హెచ్చరించారు. అయితే నెహ్రూజీ మతాన్ని, దేవుణ్ణి పక్కన పెట్టి ప్రజాస్వామ్య బద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా పరిపాలన సాగించారు గనక, అనతి కాలంలోనే దేశాన్ని అభివృద్ధి పథాన నడిపించగలిగారు. ఆ వ్యాసంలో అన్నాదురై నెహ్రూజీకి కొన్ని సూచనలు చేశారు. అయితే అవి సూచనలిచ్చినట్టుగా కాకుండా - తన ఆవేదన వ్యక్తం చేసినట్టుగా చెప్పారు. ఆ ఆవేదన ఇలా సాగింది...

"మీకు ప్రపంచ దేశాల చరిత్రలన్నీ తెలుసు. ఒక దార్శనికుడిగా ఒక విజ్ఞానవంతుడిగా మీకు పేరుంది. మొట్టమొదట సింగోల్‌ను చూడగానే మీకు ఏమనిపించిందో నాకు తెలియదు. ఆధీనం మఠానికి చెందిన ఆధీన కర్తార్ సింగోల్‌తో పాటు మీకు ఏదైనా సందేశం ఇచ్చారో లేదో తెలియదు. కానీ, సామాన్యుల శ్రమను గుర్తిస్తూ, ప్రజారాజ్యం స్థాపించాల్సిన తరుణంలో మతాల, మఠాధిపతుల ఉచ్చులో పడితే దేశం అధోగతి పాలవుతుందన్నది నా ఆవేదన! ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాల్సిన సమయం. బంగారు సింగోల్ మాత్రమే కాదు, వారు నవరత్న కచ్చితమైన అనేక ఇతర బహుమతులు కూడా తెచ్చినా తెస్తారు. భగవంతుణ్ణి వేడుకుంటున్నట్టు బిగ్గరగా మంత్రోచ్చారణ చేస్తారు. దేవుడు ఇక దిగి వస్తాడేమోనన్నంత మధురంగా, కరుణ రసార్ద్రంగా పాటలు పాడుతారు. అయినా ఎవరిని ఎక్కడ ఎంత వరకు ఉంచాలో మీకు తెలుసు! ఈ శైవ భక్తులు చెప్పే కథల్లో పవిత్రమైన విభూతి చల్లి నక్కల్ని గుర్రాలుగా మార్చే అద్భుత సంఘటనలుంటాయ్ - జాగ్రత్త! సింగోల్ స్వీకరించే వారిని ఎంతగా కీర్తిస్తారంటే, ఆ పొగడ్తలు కైలాసాన్ని అందుకుంటాయి. ఈ తిరువదుతురై ఆధీనం మఠం వారు తమ దైవ శక్తిని దేశభక్తిలోకి మార్చి మిమ్మల్ని ఆకట్టుకోగలరు.

ఈ ప్రభుత్వం చిరకాలం సుస్థిర పాలన అందించాలి.


ఆ దేవ దేవుడి ఆశీర్వాదాన్ని ఆధీనకర్తార్ అందిస్తున్నాడు.

ఆద్యంతాలు లేని ఆ శివుని చల్లని కరుణ మీపై
ఈ దేశ ప్రజలపై కురిపిస్తున్నాడు - అని
ఊదరగొడతారు - జాగ్రత్త!!" - అంటూ నెహ్రూజీకి మరికొన్ని జాగ్రత్తలు చెపుతూ అన్నాదురై ఆ వ్యాసం ముగించారు. ఆ తమిళ వ్యాసాన్ని కవితా మురళీధరన్ ఇంగ్లీషులోకి అనువదించడం వల్ల, విషయం ఇతర భాషల వారికి అందింది.

కసిని పెంచే మతము / కనులు గప్పే గతము
కాదు మన అభిమతము - అన్నారు ప్రముఖ తెలుగు కవి ఆరుద్ర

ఇక ప్రస్తుతంలోకి వద్దాం!

"కొత్త పార్లమెంట్ భవనంలో మే 28, 2023న జరిగిందేమిటీ? అటు చరిత్రను ఇటు ఒక ధర్మసూత్రాన్ని నిసిగ్గుగా ఎంతగా వక్రీకరించవచ్చో రుజువయ్యిందని నేను భావిస్తున్నాను" అని అన్నారు కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ నేత పి. చిదంబరం. "ఆ రోజు తిరువళ్ళువర్, ఇళంగో అడిగళ్, అవ్వయ్యార్, సంగం కవుల ఆత్మలు ఎంతగా క్షోభించి ఉంటాయో కదా?" అని కూడా అన్నారు.



సింగోల్ అనేది ప్రాపంచిక అధికారానికి చిహ్నం. రాజ్యాధికారం త్యజిస్తున్న రాజు, రాజ్యాధికారం స్వీకరిస్తున్నరాజుకు సింగోల్ (ధర్మబద్ధరాజ దండం) అందివ్వడం 10-12 శతాబ్దాల నాటి చోళ రాజుల ఆనవాయితీ. అనివార్యకారణాలు ఎదురైతే, కొత్త రాజుకు పూజారే సింగోల్ అందివ్వొచ్చు. మరి మే 28, 2023న రాజ్యాధికారం ఎవరి నుండి ఎవరికి వెళ్ళిందీ? అనే ప్రశ్న దేశ ప్రజల మెదళ్లను తొలుస్తూనే ఉంది. ఎన్నికలు జరిగింది లేదు. ఎవరూ కొత్తగా అధికారంలోకి వచ్చింది లేదు. తొమ్మిదేళ్ళుగా ప్రధానిగా ఉన్నవారే ఇప్పుడు సింగోల్: స్వీకరించడమేమిటీ? ఒక వినోద కార్యక్రమం ఈ దేశ ప్రజలకు 'లైవ్'లో చూపించినట్లయ్యింది. దానికి ప్రయోజనం గానీ, అర్థంగానీ లేదు. ఆనాడు నెహ్రూ స్వీకరించింది ఒక బహుమతిగా - అదీ తన ఇంట్లో - అధికారికంగా దానికి ఏ ప్రాధాన్యతా ఇవ్వలేదు. మోడీ అధికారికంగా పార్లమెంట్‌లో తీసుకుని ఎక్కడలేని ప్రాధాన్యతను దానికి ఆపాదించారు. ప్రజాస్వామ్య విలువలు తెలిసినవాడికి, తెలియనివాడికి తేడా అది! తెలిసినా అతిక్రమించే మహానుభావుల్నేమందాం?

> సింగోల్ అనేది ప్రాపంచిక అధికారానికి చిహ్నం. రాజ్యాధికారం త్యజిస్తున్న రాజు, రాజ్యాధికారం స్వీకరిస్తున్నరాజుకు సింగోల్ (ధర్మబద్ధరాజ దండం) అందివ్వడం 10-12 శతాబ్దాల నాటి చోళ రాజుల ఆనవాయితీ. అనివార్యకారణాలు ఎదురైతే, కొత్త రాజుకు పూజారే సింగోల్ అందివ్వొచ్చు. మరి మే 28, 2023న రాజ్యాధికారం ఎవరి నుండి ఎవరికి వెళ్ళిందీ? అనే ప్రశ్న దేశ ప్రజల మెదళ్లను తొలుస్తూనే ఉంది. ఎన్నికలు జరిగింది లేదు. ఎవరూ కొత్తగా అధికారంలోకి వచ్చింది లేదు. తొమ్మిదేళ్ళుగా ప్రధానిగా ఉన్నవారే ఇప్పుడు సింగోల్: స్వీకరించడమేమిటీ? ఒక వినోద కార్యక్రమం ఈ దేశ ప్రజలకు 'లైవ్'లో చూపించినట్లయ్యింది. దానికి ప్రయోజనం గానీ, అర్థంగానీ లేదు.

సాధారణ శకానికి ముందు తమిళ మహాకవి తిరువళ్ళువర్ 'తిరుక్కురళ్' అనే కావ్యాన్ని రాశాడు. అందులో సంపద అనే విభాగంలో రెండు అధ్యాయాలున్నాయి. 1. సెంగోన్మాయి (ధర్మబద్ధ రాజదండం) 2. కొడుగ్నోమాయి (క్రూర రాజదండం). పాలకులు ధర్మబద్ధంగా పాలించవచ్చు లేదా క్రూరంగా కూడా పాలించవచ్చు. చివరికి పాలకుడికి ప్రజాదరణ లేదా విజయం లభించేది. ధర్మబద్ధమైన న్యాయపాలన వల్లనే గానీ, క్రూరపాలన వల్ల కాదు - అని ఆ అధ్యాయాలలో చర్చించబడింది. మరి ప్రస్తుతం దేశంలో అధికారంలో ఉన్నవారు ఇవన్నీ క్షుణ్ణంగా చదువుకున్నారా? అయినా, చదవడం రావాలి కదా? ఎవరైనా చదివి చెప్పినా కనీసం అర్థం చేసుకునే సామర్థ్యం ఉండాలి కదా? అవేవీ లేని వారు పూజలు, హెూమాలు, సాష్టాంగ ప్రణామాల దగ్గర ఆగిపోతారు. అంతదాకా ఎందుకూ? మంత్రిగానైనా, ప్రధాన మంత్రిగానైనా బాధ్యతలు తీసుకునే ముందు చేసే ప్రమాణంలో ఈ విషయాలు నిక్షిప్తమయ్యే ఉన్నాయి.

"సమస్త ప్రజలకు, రాజ్యాంగానికీ, చట్టాలకూ అనుగుణంగా నిష్పాక్షికంగా, ఎలాంటి ద్వేష భావం లేకుండా సేవ చేస్తాను" అని దేశ ప్రజల ముందు వాగ్దానం చేస్తారు కదా? మరి ఆ విషయాన్ని మరిచి ఎలా ప్రవర్తిస్తారూ?


ప్రస్తుతం దేశంలో జరుగుతున్న దేమిటీ? ప్రజాస్వామికంగా అధికారంలో ఉన్నవారే విద్వేష ప్రసంగాలు చేస్తున్నారు కదా? బుల్‌డోజర్ న్యాయం నడిపిస్తున్నారు కదా? నేపాల్ క్రైస్తవుల పట్ల, శ్రీలంక తమిళుల పట్ల పొరుగు దేశాల ముస్లింల పట్ల వివక్ష చూపుతూ పౌరసత్వ చట్టాలు తెచ్చారు కదా? తిండి పెట్టే రైతును కట్టడి చేసే రైతు చట్టాలు తెచ్చారు కదా? లింగ వివక్షపై గళమెత్తిన మహిళా క్రీడాకారుల గోడు వినాలి కదా? ఇటీవల కర్నాటకలో జరిగినట్టు - మైనార్టీ అభ్యర్థులయినందుకే - ఎన్నికల్లో నిలబడే అర్హతను లాక్కున్నారు కదా? ఇన్ని రకాలుగా కొడుగ్నోమాయి (క్రూర రాజదండం) జనం మీద ఉపయోగిస్తూ... సింగొన్మాయి (సింగోల్ - ధర్మబద్ధ రాజదండం) పట్టుకుని, దేశ ప్రజలకు ఒక 'లైవ్ షో' చూపిస్తారా? అలాంటి ప్రదర్శనకు అర్థం పర్థం ఉంటుందను కుంటున్నారా?

ధర్మబద్ధ రాజదండం - సింగోల్ పట్టుకున్న పాలకుడికి కరుణ, దాతృత్వం, పేదల సంరక్షణ అనే లక్షణాలు ఉండాలని, సింగోల్ ఎప్పుడూ వంగకూడదని, నిటారుగా నిలబడి ఉండాలని తిరక్కురల్ వివరించింది. ఆ విషయం తెలుసుకున్న ఈ దేశ ప్రజలు ఇప్పటి ఈ ప్రభుత్వ పెద్దలకు ఆ లక్షణాలు ఉన్నాయా? అని విశ్లేషించుకుంటున్నారు. సింగోల్ చేతిలోకి తీసుకునే ముందు కొంచెం ఆత్మవిమర్శ చేసుకుంటే బావుండేది. కెమెరాకి ఫోజులివ్వడం దగ్గర పాలకుడు ఆగిపోగూడదు. లోక్‌సభలో స్పీకర్ స్థానానికి దగ్గరలో సింగోల్‌ను ప్రతిష్టించడం బాగానే ఉంది. కానీ, విపక్షాలకు ప్రశ్నలడిగే స్వాతంత్ర్యం ఇవ్వగలమా లేదా? సహనంతో వాటికి జవాబివ్వగలమా లేదా? అర్థవంతమైన చర్చలు జరిపి ప్రజా సమస్యలు పరిష్కరించగలమా లేదా లాంటి ఎన్నో విషయాలు అధికారంలో ఉన్నవారు ఆలోచించు కోవాల్సి ఉంటుంది. ఏదో కాసేపు నటించి, మరిచిపోదామను కుంటే... ఇది టెలివిజన్ సీరియల్ కాదు గదరా నాయనా? ఇది వాస్తవం! బాధ్యతగల ప్రభుత్వం - న్యాయ రక్షణ - ప్రజా సంక్షేమం ఎన్నో విషయాలు సింగోల్‌తో ముడివడి ఉన్నాయి. పార్లమెంటులో సింగోల్ పెట్టడమేమో గానీ, వెంటనే ఒడిశాలో కనీవినీ ఎరుగని రైలు ప్రమాదం జరిగింది. తప్పు కేంద్ర ప్రభుత్వానిదైనప్పుడు బాధ్యులైన రైల్వే మంత్రో, ప్రధానమంత్రో దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి రాజీనామా చేశారా? లేదు. చెయ్యరు. నైతికత అనే పదం వారు ఎప్పుడైనా వింటే కదా? రైల్వే మంత్రి బోగీల కింది నుండి ఈగుతూ తిరుగుతారు. గతంలో ప్లాస్టిక్ సంచులేరుతూ రోడ్లమీద తిరిగిన ప్రధాని ఆయనకు ఆదర్శం! ఏ పని ఎక్కడ ఉండి ఎలా జరిపించాలో, వ్యవస్థల్ని సక్రమంగా ఎలా పని చేయించాలో వీరు నేర్చుకోలేరు. అయితే వ్యవస్థల్ని అక్రమంగా ఎలా పని చేయించాలి - అన్న విషయంలో వీరు నిష్ణాతులు!!

> పార్లమెంటులో సింగోల్ పెట్టడమేమో గానీ, వెంటనే ఒడిశాలో కనీవినీ ఎరుగని రైలు ప్రమాదం జరిగింది. తప్పు కేంద్ర ప్రభుత్వానిదైనప్పుడు బాధ్యులైన రైల్వే మంత్రో, ప్రధానమంత్రో దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి రాజీనామా చేశారా? లేదు. చెయ్యరు. నైతికత అనే పదం వారు ఎప్పుడైనా వింటే కదా? రైల్వే మంత్రి బోగీల కింది నుండి ఈగుతూ తిరుగుతారు. గతంలో ప్లాస్టిక్ సంచులేరుతూ రోడ్లమీద తిరిగిన ప్రధాని ఆయనకు ఆదర్శం! ఏ పని ఎక్కడ ఉండి ఎలా జరిపించాలో, వ్యవస్థల్ని సక్రమంగా ఎలా పని చేయించాలో వీరు నేర్చుకోలేరు. అయితే వ్యవస్థల్ని అక్రమంగా ఎలా పని చేయించాలి - అన్న విషయంలో వీరు నిష్ణాతులు!!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

రైతులకిచ్చే 'మద్దతు' ఇదేనా?



ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ నెల 7న కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటించింది. గతంలో ఎన్నడూ లేనంత గొప్పగా తాము అన్నదాతలను ప్రోత్సహిస్తున్నామంటూ ఈ సందర్భంగా బీజేపీ నేతలు ప్రచార బాకాలూదుతున్నారు. కానీ వాస్తవమేంటి? రైతన్నల ఆదాయం రెట్టింపు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాషాయ పార్టీ... పాలనా పగ్గాలు చేపట్టి తొమ్మిదేళ్ళు పూర్తయినా ఇప్పటికీ వంచనకు పాల్పడుతోందే తప్ప వ్యవసాయోద్ధరణకు ఇసుమంత సాయం కూడా చేసింది లేదు. సాగు పెట్టుబడి, రైతు కుటుంబ కాయకష్టం విలువ కట్టి దానికి 50శాతం లాభం కలిపి మద్దతు ధరలు ప్రకటించాలనేది వ్యవసాయ రంగ శాస్త్రవేత్తలు, నిపుణులు మొదటి నుంచి ఘోషిస్తున్న డిమాండ్. స్వామినాథన్ కమిషన్ దీనినే శాస్త్రీయ రూపంలో సి2 ప్లస్ 50 పర్సెంట్‌గా ప్రతి పాదించారు. ఈ సూత్రీకరణలో మద్దతు ధరను చట్టబద్ధం చేస్తేనే రైతన్నకు కాస్త ఊరట కలిగి దేశానికి వెన్నుముకగా ఉన్న పల్లె సీమలు ప్రగతి బాట పట్టేది. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రావడానికి దారితీసిన కారణాల్లో సి2 ప్లస్ 50 పర్సెంట్ ప్రాతిపదికన పంటలకు మద్దతు ధర కల్పిస్తామనే వాగ్దానం కూడా ప్రధానమైనది. 'ఏరుదాటేదాకా ఓడ మల్లన్న... ఏరుదాటాక బోడి మల్లన్న' నానుడిలా అధికారంలోకి వచ్చాక ఆ వాగ్దానానికి బీజేపీ తిలోదకాలు ఇచ్చేసింది. వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే చీకటి చట్టాలను తీసుకొచ్చి రైతన్నల ఆగ్రహాన్ని చవిచూసింది. ఎన్ని కుతంత్రాలు, కుట్రలకు తెరలేపినా... ఎంతటి తీవ్రమైన అణిచివేతలకు, వేధింపులకు పాల్పడిన మడమ తిప్పని పోరాట పటిమతో ఆ చీకటి చట్టాలను అన్నదాతలు వెనక్కినెట్టి వ్యవసాయోద్యమ చరిత్రకు కొత్త పేజీలను జత చేశారు. కానీ మోడీ సర్కార్ నేటికీ పాఠాలు నేర్చినట్టు లేదు. అందుకే తన దగాకోరుతనాన్ని ప్రస్తుత ఎంఎస్‌పి ప్రకటనలోనూ కొనసాగించింది.

కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల్లో ఒక్కటంటే ఒక్క పంటకు కూడా సి2 ప్లస్ 50 పర్సెట్ ప్రామాణికాల్లో ఇవ్వకపోవడం దుర్మార్గం. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారకాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సాగు ఖర్చులు రైతన్నకు గుదిబండగా మారాయి. అకాల వర్షాలు, ఇతర ప్రకృతి విపత్తులు మోసుకొచ్చే నష్టాలు చెప్పనలవికావు. ఇ-క్రాప్ వంటి డిజిటల్ చిక్కుముడులతో పంటలకు అందాల్సిన బీమా సైతం అందకుండా రూ.కోట్లాది ప్రీమియం సొమ్ము కార్పొరేట్ గల్లాపెట్టెలు చేరుతోందే తప్ప అన్నదాతకు ఊరడింపు దక్కడం లేదు. విత్త సంస్థల నుంచి రుణసాయం కూడా ఎండమావిలో నీటిచెమ్మ తీరునే తలపిస్తోంది. కష్టాల సుడిగుండంలో చిక్కుకున్న రైతన్నకు నామమాత్రపు ఎంఎస్‌పితో ప్రోత్సాహం దక్కకపోగా కన్నీరే మిగులుతోంది. కేంద్ర ప్రభుత్వ చర్యలు రైతులను ప్రత్యేకించి చిన్న, సన్నకారు రైతులను పచ్చి దగాకు గురిచేస్తున్నాయి.

అఖిల భారత కిసాన్ సభ వంటి రైతు సంఘాలు కేంద్రం మోసాన్ని ఆధార సహితంగా నిరూపించాయి. ధాన్యానికి క్వింటాలకు రూ.2183, జొన్నకు రూ.3180, కందికి రూ.7000, పత్తికి రూ.6620 చొప్పున కేంద్రం ఎంఎస్‌పి ప్రకటించింది. కానీ సి2 ప్లస్ 50 పర్సెంట్ ప్రకారం... ధాన్యానికి కింటాకు రూ.2866.5, జొన్నకు రూ.2833, కందికి రూ.8989.5, పత్తికి రూ.8679 ప్రకటించాలి. రైతు సంఘాల విశ్లేషణల ప్రకారం..సి2 ప్లస్ 50 పర్సెంట్ ప్రకారం ఎంఎస్‌పి ప్రకటించని కారణంగా ధాన్యం పండించే రైతులు క్వింటాలుకు రూ.683.5 నష్టపోనున్నారు. అలాగే కంది పప్పు, పెసర, మినపగుళ్ళ, పొద్దు తిరుగుడు విత్తనాలు, నువ్వులు, నైజర్ సీడ్స్, పత్తి పంటలకు క్వింటాలకు కనీసంలో కనీసం రూ.2000 చొప్పున రైతులు కోల్పోనున్నారు. వీటిలో కొన్ని పంటలకయితే క్వింటాలకు రూ.3000 మించి నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితిని కేంద్రం కల్పిస్తోంది. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) అంచనాల కంటే ఆంధ్రప్రదేశ్, బీహార్, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ సాగు పెట్టుబడులు అధికంగా ఉంటున్నాయి. అంటే సాగు పెట్టుబడులను కావాలనే సిఎసిపి తక్కువగా చూపి... జాతీయ సగటు కంటే అధికంగా ఎంఎస్‌పి ఇచ్చామంటూ ప్రచారం చేస్తుండటం మోడీ సర్కార్ నయవంచన. ఉదాహరణకు కేరళలో వరి సాగు ఖర్చు (సి2) క్వింటాలకు కనీసం రూ.2847 అవుతుంది. కానీ సిఎసిపి రూ.2338గానే లెక్కకట్టింది. పంజాబ్‌లో కనీస సి2 రూ.2089 అయితే దానిని కూడా రూ.1462గానే సిఎసిపి లెక్కకట్టింది. మిగిలిన అన్ని పంటలకూ ఇదే వంచన. దేశానికి అన్నం పెట్టే రైతన్నను వంచించడం కంటే దేశద్రోహం ఉండదు. మోడీ సర్కార్ ఇప్పటికైనా స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన సి2 ప్లస్ 50 పర్సెంట్ ప్రకారం ఎంఎస్‌పి ప్రకటించి చట్టబద్ధం చేయాలి. పదేపదే ఇదే ద్రోహానికి ఒడిగడుతున్న బీజేపీని సాగనంపేందుకు సాగుదార్లంతా సిద్ధం కావాలి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

విద్య, పరిశోధనావకాశాలులేని 'దశాబ్ది తెలంగాణ'



ఇమ్మిడి మహేందర్
9505645706

దశాబ్ది తెలంగాణ పేద ప్రజల విద్యా ఆకాంక్షలను పట్టించుకోలేదు. ప్రభుత్వ పెద్దలు ఉద్యమ ఆశయాలను పెడచెవిన పెట్టారు. తెలంగాణ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారు. నిజానికి ఏ సమాజ అభివృద్ధి అయిన అక్కడి విద్యా విధానంపై నిర్మాణమవుతుంది. విద్య, పరిశోధనలకు అవకాశం లేని నేలలో ప్రగతి ఏ మాత్రం సాధ్యం కాదు. తెలంగాణలో ఉన్నత విద్య పాతాళానికి పడిపోయింది. విశ్వ విద్యాలయాల్లోకి వస్తున్న విద్యార్థులకు, పరిశోధకులకు నాణ్యమైన విద్య, పరిశోధన అవకాశాలు అందటం లేదు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన వాతా వరణం కాకుండా, కోచింగ్ సెంటర్ల వాతావరణం క్రమంగా పెరిగింది. పరిశోధనల్లో సాధించిన ప్రగతిని గర్వంగా చెప్పుకోవాల్సిన యూనివర్సి టీలు మా విద్యార్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పు కుంటున్నాయి. తెలంగాణలో ఉన్నత విద్య పతనావస్థకు ఇది నిదర్శనం.

విశ్వవిద్యాలయాల్లో బోధన ఫలితాలను పరిశోధనల్లో చూడాలి. ప్రభుత్వాలు యూనివర్సిటీ లతో ములాఖత్ అయి పరిశోధన ఫలితాను సమన్వయం చేసుకోవాలి. దీనికి మన ప్రభుత్వం సిద్ధమై లేదు. ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేసే దిశగా ఆలోచనలను సాగిస్తున్నది. దీనికి గత పదేళ్ల తెలంగాణలో విద్యారంగంపై చూపిన వివక్షనే సాక్ష్యం. గ్రామీణ, పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవకాశాల కల్పన, పరిశోధన వాతావరణం వంటి విద్యా మౌలిక విషయాల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. మన రాష్ట్రంలో ఉన్న 11 విశ్వవిద్యాలయాల్లో ఉండాల్సిన బోధన సిబ్బంది ఇప్పుడు కేవలం 20శాతం లోపే ఉన్నారు. ఇంకా రెండేళ్లైతే ఈ పరిస్థితి 14శాతానికి పడిపోతుంది. విశ్వవిద్యాలయాల్లో హాస్టల్ల నిర్వహణ, తరగతి గదులు, రీసెర్చ్ ల్యాబులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన బడ్జెట్‌ని కూడా కేటాయించడం లేదు. విశ్వవిద్యాలయాలు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్న బడ్జెట్‌లో సగభాగం కూడా కేటాయించడం లేదు. కేటాయించిన బడ్జెట్ కేవలం సిబ్బంది జీతాలకు మాత్రమే సరిపోతుంది.

వీటి కారణంగా యూనివర్సిటీ లకు వచ్చే గ్రామీణ ప్రాంత విద్యార్థులే ఎక్కువగా నష్ట పోతున్నారు. వారిలో కూడా దళిత, బహుజన, మైనార్టీ విద్యార్థుల సంఖ్యే అధికం. వీరికి ప్రయివేట్ విశ్వవిద్యాలయాల్లో చదువుకునే స్తోమత ఉండదు. రెక్కాడితే కానీ, డొక్కాడని పరిస్థితులు వీరివి. కనుక అనివార్యంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోకి వస్తున్నారు. ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పే ప్రభుత్వం, నాణ్యమైన ఉన్నత విద్య విషయంలో స్పష్టమైన భరోసాను ఇవ్వలేక పోతుంది. అరకొర వసతుల మధ్యే విద్యార్థులు చదువుకొని అనేక రకాల ఫెలోషిప్పులు సాధిస్తున్నారు. కానీ, పరిశోధన అవకాశాలు యూనివర్సిటీల్లో ఉండటం లేదు. విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలను గైడ్ చేసే వాళ్ల 20శాతం లోపే ఉన్నారు. ఈ పరిస్థితి వల్లే పీహెచ్‌డీ విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అదే ఫాకల్టీ నియామకం జరిగితే వందలాది మంది విద్యార్థులకు పరిశోధన చేసే అవకాశం కల్పించవచ్చు. ఉదాహరణకు మన అధికార భాష తెలుగునే తీసుకుందాం. ప్రతియేట దాదాపు 50మంది తెలంగాణ విద్యార్థులు తెలుగులో జెఆర్ఎఫ్ సాధిస్తున్నారు. మన విశ్వవిద్యాలయాల తెలుగుశాఖల్లో సంవత్సరానికి 50మందికి కూడా పరిశోధన చేసే అవకాశం కల్పించలేని పరిస్థితిలో ఉన్నాం. మనం ప్రభుత్వం చెప్పే తెలంగాణ మోడల్ అంటే ఇదేనా? జెఆర్ఎఫ్ ద్వారా నెలకు రూ.40వేల



వరకు ఫెలోషిప్ వస్తుంది. వారికి సరిపడా ఫ్యాకల్టీ లేని కారణంగా పరిశోధన చేసే అవకాశం లేకుండా పోతుంది. సాధించిన ఫెలోషిప్‌ని ఉపయోగించు కోలేని దుస్థితి వచ్చింది. ఈ పరిస్థితికి కారణం ప్రభుత్వ విధానాలే. ఇటువంటి పరిస్థితి మరే రాష్ట్రంలోను లేదు. నెలకు 40వేలు వచ్చే ఫెలోషిప్స్ ద్వారా ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు, నాణ్యమైన పరిశోధనలు చేసే అవకాశం ఉంటుంది. ఈ విషయంపై ప్రభుత్వంగా సీరియస్‌గా ఆలోచించాలి. యూనివర్సిటీల్లోని కొన్ని డిపార్ట్‌మెంట్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం వాటిల్లో ఒక్క రెగ్యులర్ ఫాకల్టీ లేనివి కూడా ఉన్నాయి. పీహెచ్‌డీ సీట్ల విషయంలో కొన్ని డిపార్ట్‌మెంట్స్ పరిశోధన అవకాశాలను పూర్తిగా నిలిపివేశాయి.

యూనివర్సిటీలు సమాజానికి, అభివృద్ధికి మధ్య అనుసంధానంగా ఉంటాయి. సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని చూయిస్తాయి. ప్రగతి మార్గంలో నడిపిస్తాయి. ప్రజల ఆకాంక్షలకు కార్యరూపం ఇస్తాయి. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను యూనివర్సిటీలే చర్చకు పెట్టాయి. ప్రొఫెసర్ జయశంకర్ ఒక ప్రొఫెసర్‌గా తెలంగాణ వాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఎంతో మంది తమ ఉపన్యాసాల ద్వారా, వ్యాసాల ద్వారా సమాజాన్ని చైతన్యం చేశారు. ఈ ఆచరణ రూపాలన్నింటికి కార్యక్షేత్రం యూనివర్సిటీలే. పోరాటానికి, ఆరాటానికి ప్రతీకలు యూని వర్సిటీలు. కానీ, నేడు మన యూనివర్సిటీల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. తెలంగాణ వచ్చి తొమ్మిదేండ్లు గడిచినా, పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదు. ఉద్దేశ్య పూర్వక పట్టింపులేని తనం కారణమా? 2004, 2010, 2014, 2017లో ఓయూలో ఉద్యమ నాయకుడికి జరిగిన అవమానాలకు ప్రతీకారామా? ఆలోచించాలి.

> యూనివర్సిటీల అభివృద్ధి నిధులు, నాణ్యమైన పరిశోధన అవకాశాల కొరకు వివిధ విద్యార్థి సంఘాలు తమ నిరసనను వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఉన్నత విద్యపై బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశాయి. ఫ్యాకల్టీల నియామకాలపై ధర్నాలు చేశాయి. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే ప్రొఫెసర్లే యూనివర్సిటీల్లో నియామకాలు జరిపి, పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని దీక్షలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించిన జీఓ వచ్చినప్పటికి అమలుకు నోచుకోవడం లేదు. ఈ పరిస్థితులు మారాలి.

యూనివర్సిటీల అభివృద్ధి నిధులు, నాణ్యమైన పరిశోధన అవకాశాల కొరకు వివిధ విద్యార్థి సంఘాలు తమ నిరసనను వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఉన్నత విద్యపై బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశాయి. ఫ్యాకల్టీల నియామకాలపై ధర్నాలు చేశాయి. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే ప్రొఫెసర్లే యూనివర్సిటీల్లో నియామకాలు జరిపి, పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని దీక్షలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించిన జీఓ వచ్చినప్పటికి అమలుకు నోచుకోవడం లేదు. ఈ పరిస్థితులు మారాలి. తెలంగాణ మోడల్‌లో ఉన్నత విద్యపై ఉన్న మచ్చలను తొలగించుకోవాలి. విశ్వవిద్యాలయాల పనితీరుపై సమీక్షలు నిర్వహించాలి. అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలి. నాణ్యమైన ఉన్నత విద్య కోసం విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీలను నియ మించాలి. విశ్వవిద్యాలయాల పరిశోధనలతో తెలంగాణ ప్రభుత్వం ములాఖత్ కావాలి. పరిశోధన ఫలితాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉపయోగించుకొని బంగారు తెలంగాణ దిశగా మన ప్రయాణం సాగించాలి. అసమానతలు, అవమానాలులేని ప్రజాస్వామిక తెలంగాణను సాధించుకోవాలి. తెలంగాణ పునఃనిర్మాణంలో విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం అనివార్యం. వీటిని దృష్టిలో ఉంచుకొని యూనివర్సిటీ విద్యార్థులకు ప్రభుత్వాలు మెరుగైన అవకాశాలు కల్పించాలి. అవకాశాలను కల్పించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. అప్పుడే నిజమైన ప్రజా ప్రభుత్వంగా నిలిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమా? ప్రభు ప్రభుత్వమా? అన్నది ప్రజలు తేల్చుకుంటారు.

మానవి
www.navatelangana.com



కంపోస్టబుల్ కాగితపు వ్యర్థాలతో పేపర్ బాటిల్ తయారీకి హైదరాబాదులో 'కార్జీ బాటిల్స్' అనే పేరుతో ఓ కంపెనీ స్థాపించబడింది. ప్లాస్టిక్ బాటిల్స్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్ బాటిల్స్ తయారు చేసి అభివృద్ధి చేసిన ఆ కంపెనీ వ్యవస్థాపకురాలీ సమీక్ష గోవిల్. ఈ బాటిల్స్‌లో షాంపులు, కండిషనర్లు, హ్యాండ్ వాష్‌లు మొదలైనవి నిలువ చేసుకోవచ్చు. ఇలాంటి ఆలోచన అసలు ఆమెకు ఎందుకు వచ్చిందో తెలుసుకుందాం...

ప్లాస్టిక్ నిర్మూలనే నా ధ్యేయం

హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను. విజ్ఞాన్ జ్యోతి ఇనిస్టిట్యూట్‌లో ఎంబీఏ పూర్తి చేశాను. చెత్తకు సంబంధించిన వివిధ చిత్రాలు చూస్తే పర్యావరణానికి సంబంధించిన ప్రధాన సమస్య ప్లాస్టిక్ బాటిల్స్, ప్యాకెట్లని అర్థమైంది. ప్లాస్టిక్ బ్యాగ్‌లకు బదులుగా పేపర్ బ్యాగులు, గుడ్డ సంచులు వంటివి మన దగ్గర ఉన్నాయి. కానీ బాటిల్స్‌కు ప్రత్యామ్నాయం లేవు. అందుకే వాటి పై నా పరిశోధన ప్రారంభించా. వేస్ట్‌పేపర్ నా మొదటి ఎంపిక.



ఆకులతోనే పేపర్...

కాగితం జలనిరోధిత తయారీ మీద నా పరిశోధనను ప్రారంభించా. గడ్డి, ఆకులు, బెరడు, తామర ఆకు, అరటి ఆకు మొదలైనవన్నీ జలనిరోధితమైనవే. వాటి ద్వారా బాటిల్స్ ఉత్పత్తిని ఎందుకు తయారు చేయలేం? అనే ఆలోచన వచ్చింది. గుడ్డు ట్రేలను బేస్‌గా ఉపయోగించి, బాటిల్‌ను రూపొందించాము. కార్జీ బాటిల్స్ ప్రారంభించే ముందు కూడా రెండేండ్లు నా పరిశోధ కొనసాగించాను. నా భర్త నాకెంతో సహకరిస్తున్నారు.

ప్రజలకు అవగాహన పెంచితేనే...

వినియోగించుకోడానికి వీలుగా ఉండేవి, కంపోస్ట్ చేయగలిగినవి, బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులు అన్ని రూపాల్లో తయారు చెయ్యగలిగాం. ప్యాకేజింగ్ కోసం పెరుగుతున్న డిమాండ్‌తో పాటు ప్రజల్లో ప్లాస్టిక్‌పై వ్యతిరేకత బాగా పెరుగుతున్నది. దీంతో బయోప్లాస్టిక్‌తో పాటు పేపర్‌కి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. బయోప్లాస్టిక్ అనేది కొత్త అంశం కాబట్టి ప్రజలకు దీని గురించి పెద్దగా అవగాహన లేదు. ఇదే తర్వాత కాలంలో ఉత్తమ ఎంపికయ్యింది. దీనిలో అన్ని రకాల లేబుల్స్‌ని అందంగా ప్రింట్ చెయవచ్చు, తేలికగా కంపోస్ట్ చెయ్యవచ్చు. కాగితం కోసం ఉపయోగించే చెక్కని అడవుల నుంచి, ఇతర వ్యర్థాల నుంచి తీసుకుంటారు. దీన్ని రీసైకిల్ చేయడం కూడా సులభం.

తయారు చేసే విధానం

కార్జీ బాటిల్స్ వంద శాతం మట్టిలో కలిసిపోయి ఎరువుగా మారిపోతాయి. హిమాచల్ ప్రదేశ్ నుంచి సేకరించిన కాగితపు వ్యర్థాలతో ఇవి తయారు చేస్తాం. నీరు, ఇతర రసాయనాలను కలిపి గుజ్జుగా చేస్తాం. ఈ గుజ్జుతో ముందు బాటిల్ రెండు భాగాలుగా తయారు చేస్తాం. తర్వాత ఈ రెండు భాగాలు నీటి నిరోధక ద్రావణం ఉపయోగించి ఒక బాటిల్‌గా తయారు చేస్తాం. ఈ పేపర్ బాటిల్ తయారు చేయడానికి రెండు రోజులు పడుతుంది. ద్రవాన్ని, పొడిని ఇందులో నిల్వ చేయవచ్చు. ఒక బాటిల్ ధర సుమారు 19 నుండి 22 రూపాయల వరకు ఉంటుంది.

మొదటిసారి మార్కెట్లోకి

వంద శాతం బయోడిగ్రేడబుల్, మన్నిక కలిగిన ఉత్పత్తులు తయారు చెయ్యడానికి చేసిన మా కృషి ఫలించింది. ఇది దాదాపు ఐదేండ్ల పరిశోధన. ఇక మేము దాన్ని మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టాలనుకున్నాం. అయితే వీటితో పాటు స్ట్రాస్, పేపర్ పౌచ్‌లు, ట్యూబ్లు మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ పరిష్కారాల మీద కూడా దృష్టి పెట్టాం. అనుకున్న సమయానికే మా ఉత్పత్తులన్ని మార్కెట్లోకి విడుదల చేశాం. మా ప్రయత్నాలు ఫలితాల్ని సాధించడానికి రెండేండ్ల కంటే ఎక్కువ సమయం పట్టింది. 2021లో రిజిష్టర్ చేశాం. అప్పటికే ప్రముఖ పర్సనల్ కేర్ బ్రాండ్‌తో ట్రయల్ టెస్టు పూర్తయింది. జీడిమెట్లలో అసెంబ్లీ యూనిట్ కూడా ఏర్పాటు చేసుకున్నాం. ఉత్పత్తి బాగా పెరిగిన తర్వాత ఎక్కువ సదుపాయాల్ని సమకూర్చుకోవాలని ఆలోచించాం.

క్లయింట్ అడగటంతో...

మహిళలు మంచి నిర్ణయాలు తీసుకోగలరు, సృజనాత్మకంగా ఆలోచించగలరు. సమస్యలు ఎన్ని ఉన్నా వాటిని అధిగమిస్తూ అభివృద్ధి పథంవైపు పయనించగలరు. అభివృద్ధి దిశగా నడుస్తున్న ఎన్నో కంపెనీలను మహిళలే ప్రారంభించారు. గొప్ప పేరు తెచ్చుకున్నారు. ప్యాకేజింగ్ సొల్యూషన్స్ వెంచర్‌లో పని చేస్తున్న సమయంలో ఒక క్లయింట్ అన్ని అవసరాలకు ఉపయోగపడే ప్యాకేజింగ్ ఉత్పత్తులు కావాలని అడిగారు. నేను కాలేజీలో రోజుల్లోనే ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా పనిచేసే బాటిల్ తయారీ కంపెనీని ప్రారంభించాలని అనుకున్నాను. పనుల ఒత్తిడిలో ఉండి ఆ విషయం గురించి మళ్లీ ఆలోచించలేదు. ఆనాటి నా ఆలోచన క్లయింట్ కోరడం వల్ల మళ్లీ మొదలైంది. అనుకున్న విధంగా ఉత్పత్తిని ప్రారంభించడం మీద దృష్టి పెట్టాను.

కల నిజం చేసుకోవడానికి

ఆ బాటిళ్లను ప్రజల్లోకి తీసుకెళ్లడం చాలా కష్టమైన సవాలు. ముందుగా బ్రౌన్ కలర్ పేపర్ బాటిల్‌ను నా కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, బంధువులకు అలవాటు చేశాను. ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లకు బాగా అలవాటు పడ్డారు. వాటి



స్థానంలో పేపర్ బాటిల్ తీసుకురావాలంటే ప్రజలకు అవగాహన కల్పించాలి. మేము కూడా అదే ప్రయత్నం చేశారు. తద్వారానే మా పేపర్ బాటిల్స్ ఉత్పత్తి, వినియోగం పెరిగింది. మేము స్థాపించిన 'కార్టీ బాటిల్స్' కంపెనీలో ఉన్న బ్రౌన్ బయోడిగ్రేడబుల్ బాటిల్ భారతదేశంలోనే మొదటిసారి తయారు చేయబడింది. దీనికి దేశీయ నామం పెట్టాలనుకున్నా. బాటిల్ పేపర్‌తో తయారు చేయబడింది కాబట్టి కంపెనీకి పేపర్ బాటిల్ అని పేరు పెట్టాను.

ఆహార ఉత్పత్తుల కోసం కూడా...

ప్రస్తుతం బాటిల్స్‌ను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నాం. త్వరలో ఆహార ఉత్పత్తుల కోసం ఉపయోగపడే పేపర్ వస్తువులను కూడా తయారు చేయాలని ఆలోచిస్తున్నాం. పాలు, పెరుగు, ఇతర ఆహార పదార్థాలను ఈ బాటిల్స్‌లో భద్రపరుచుకోవచ్చు. వీటిని కూడా ఉత్పత్తి చెయ్యగలమనే పూర్తి భరోసా ఉంది. వ్యాపారానికి సంబంధించిన అకౌంట్లు, మార్కెటింగ్ వంటి విషయాల్లో వి హబ్ సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయి. మా వ్యాపార అభివృద్ధిలో వీరి సహకారం ఎంతో ఉంది.

- భమిడిపాటి బాలాత్రిపురసుందరి
9440174797

ప్రతిఒక్కరూ వారి సంపాదన ప్రకారం ఖర్చులను ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. ఆర్థిక స్థిరత్వం ఉండాలంటే ఎన్నో రకాల జాగ్రత్తలు తీసుకోవాలి కూడానూ. ఈ విషయంలో తీసుకునే నిర్ణయాలు కరెక్ట్‌గా ఉంటేనే ఏదైనా సమస్యలు వస్తే సులువుగా అధిగమించే అవకాశం ఉంటుంది. అలా చేయలేకపోతే నెలాఖరికి చేతిలో డబ్బులు మిగలకుండా పోతాయి. ఫలితంగా అప్పు చేయాల్సి వస్తుంది. అటువంటి సమస్యలు రాకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఓ సారి తెలుసుకుందామా.. ఈ టిప్స్ పాటించడం వల్ల భవిష్యత్‌లో కూడా ఆర్థిక సమస్యలు తలెత్తకుండా ఉంటాయి.

ప్రణాళికతోనే నిధి నిల్వలు..

జీవన విధానం : కాలానికి తగ్గట్లుగా లైఫ్‌ని స్టైల్‌గా చేసుకోవాలని ఉంటుంది కానీ ఆ మెయింటెన్స్‌కి హద్దు అనేది ఉండదు. అదుపు లేకుండా డబ్బులు ఖర్చవుతూనే ఉంటాయి. ముఖ్యంగా చాలా మంది బ్రాండెడ్ ఐటమ్స్ కోసం చాలా ఖర్చు పెడుతారు. వాటివల్ల కేవలం స్టేటస్ పెరుగుతుంది, ఆర్థిక సమస్యలు చుట్టుముడతాయి.

సేవింగ్స్ : ద్రవ్యోల్బణం కారణంగా ఎంత ప్రయత్నించినా సేవింగ్స్ అనే కాన్సెప్ట్‌నే అందరూ మర్చిపోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. సేవింగ్స్ చేయకపోతే భవిష్యత్తులో ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సడన్‌గా ఏదైనా సమస్య వస్తే దాన్ని పరిష్కరించుకోవడానికి సేవింగ్స్ అవసరం చాలా ఉంటుంది. రిటైర్మెంట్ అయ్యే సరికి కొంత సేవింగ్స్ ఉండడం ఎంతో అవసరం. కాబట్టి మీ సంపాదనలో కొంత భాగాన్ని సేవింగ్స్‌లో చేర్చుకోవడం చాలా అవసరం.

పెట్టుబడులు : ఎవరైనా, ఎప్పుడైనా పెట్టుబడులు పెట్టుకోవచ్చు. కేవలం కొద్ది పాటి డబ్బుతో అయినా మొదలుపెట్టవచ్చు. తద్వారా పొందిన లాభాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. దీని వల్ల రోజు రోజుకు డబ్బు పెరుగుతూ ఉంటుంది. కాబట్టి ఎలాంటి నష్టం ఉండదు. కొందరు రిస్క్ తీసుకునేందుకు కూడా సిద్ధంగా ఉంటారు. అలాంటి వారు స్టాక్ మార్కెట్ వంటివి ఎంచుకుంటే ఎక్కువ ఆదాయం ఉంటుంది. కానీ పూర్తి స్థాయి అవగాహన ఉంటేనే పెట్టుబడులు పెట్టుకోవాలి. లేకుంటే సమస్య రావచ్చు.

అత్యవసర నిధి : ఎమర్జెన్సీ ఫండ్.. ఇది ప్రతి కుటుంబంలో తప్పనిసరిగా ఉండాల్సినది. కనీసం ఓ ఆరు నెలలు పాటు ఖర్చులు తగ్గించుకుని ఆ డబ్బును ఆదా చేసుకుని దాన్ని అత్యవసర నిధిగా పెట్టుకోవాలి. దీనిని ఎప్పుడైనా ఏదైనా అవసరం అయినప్పుడు ఉపయోగించవచ్చు. ఈ మధ్యకాలంలో చాలా మంది దీన్ని పాటించడానికి ఇష్టపడుతున్నారు. ఎందుకంటే సేవింగ్స్‌లేని సమయంలో ఈ ఎమర్జెన్సీ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

క్రెడిట్ కార్డ్స్ : చాలా మంది క్రెడిట్ కార్డ్స్ ఉపయోగిస్తుంటారు. అయితే క్రెడిట్ కార్డ్స్ ఉపయోగించడంతో పాటుగా బిల్ కట్టడం ఎంతో అవసరం.



కాకపోతే సమయం లేకపోవడం వల్లనో, ఇతర కారణాల వల్లనో ఆ క్రెడిట్ కార్డ్ బిల్స్ సరైన సమయంలో కట్టకపోవడం వల్ల అవి ఎక్కువైపోతూ ఉంటాయి. వీలైనంత త్వరగా తక్కువ అమౌంట్ ఉన్నప్పుడే క్లియర్ చేసేయాలి. ఎక్కువ అమౌంట్ అయ్యేకొద్ది పేమెంట్ కట్టడంలో సమస్యలు తలెత్తవచ్చు. ఆర్థికంగానూ సమస్య తలెత్తవచ్చు.

బీమా : ప్రతి ఒక్కరి జీవితంలో ఇన్సూరెన్స్ అనేది చాలా అవసరం. ఎప్పుడూ కూడా హెల్త్ ఇన్సూరెన్స్‌కు కొంత అమౌంట్ ఖర్చు పెట్టడం చాలా అవసరం. ఇలా చేయడం వలన ఎమర్జెన్సీ సమయంలో ఎక్కువ అమౌంట్ ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు.

బడ్జెటింగ్ : ఖర్చు పెట్టే డబ్బును గమనిస్తూ ఉండాలి. ఎప్పుడు ఎక్కడ ఎంత ఖర్చు పెట్టాం. ఇలా చేస్తే ఎక్కడైనా అనవసరపు ఖర్చు అయి ఉంటే మళ్ళీ అలాంటి పొరపాటు జరగకుండా చూసుకోవచ్చు. దీనిని ప్రతి ఒక్కరూ పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. చేసే ఖర్చులపై అవగాహన ఉంటేనే ఖర్చులు తగ్గే అవకాశాలూ ఉంటాయి. పైగా బడ్జెట్ కూడా మేనేజ్ చేసుకోగలుగుతారు. కొంత మంది ఖర్చులు పెట్టడానికి ఎంతగానో ఆలోచిస్తారు. మరి కొందరు అతిగా ఖర్చు పెడతారు అది కరెక్ట్ కాదు. బడ్జెట్‌కు మించి అతిగా ఖర్చు పెట్టడంతో తర్వాత బాధపడాల్సి ఉంటుంది. కాబట్టి ఖర్చు చేసే ముందు ఆలోచించి సరైన డెసిషన్ తీసుకొని ఖర్చు చేయడం ఉత్తమం.

బాసర ఆర్జీయూకేటీలో మరో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

సెక్యూరిటీ సిబ్బంది మొదట స్థానిక ఆస్పత్రికి తరలించారు. తనంతరం భైంసా ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి, నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించాలని సూచించగా అక్కడ పరీక్షించిన వైద్యులు లిఖిత అప్పటికే మృతిచెందిందని ధృవీకరించారు. యూనివర్సిటీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. వరుస విషాద ఘటనలతో యూనివర్సిటీ ప్రతిష్ట దిగజారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు యూనివర్సిటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో లిఖిత మృతదేహాన్ని యూనివర్సిటీ వీసీ వెంకటరమణ పరిశీలించారు. బయటకు వచ్చిన వీసీ వాహనాన్ని ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు మృతి చెందుతున్నారని, ముమ్మాటికీ ఇవి ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లిఖిత హాస్టల్ భవనాన్ని తల్లిదండ్రులు పరిశీలించేందుకు అనుమతిని ఇవ్వాలని కోరగా వీసీ అనుమతి ఇచ్చారు. పోలీసు వాహనంలో లిఖిత తల్లిదండ్రులు యూనివర్సిటీలోని గంగా హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో లిఖిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తల్లిదండ్రులకు అప్పగించారు. లిఖిత కుటుంబాన్ని ఆదుకుంటామని యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ హామీ ఇచ్చారు.

బ్రిజ్ భూషణ్‌పై ఛార్జ్‌షీట్

(మొదటిపేజీ తరువాయి)

ఛార్జిషీట్ దాఖలు చేయవచ్చని చెప్పారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం కింద దాఖలైన రెండో కేసులో సింగ్‌పై ఎలాంటి ఆధారాలు లభించలేదని ఢిల్లీ పోలీసులు కోర్టుకు తెలిపారు. ఆయనపై పోక్సో కేసును కొట్టివేయాలని కోరారు. కోర్టులో దాఖలు చేసిన పోలీసుల 552 పేజీల రద్దు నివేదికలో ఒక మైనర్ రెజ్లర్, ఆమె తండ్రి, ఫిర్యాదుదారు, సింగ్, ఇతర సాక్షుల వాంగ్మూలాలను ఉదహరించారు. దీనిపై తదుపరి విచారణను కోర్టు జూలై 4న చేపట్టనుంది. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) 180 మందిని విచారించింది.

వైన్ గ్రూప్ పేరుతో సైబర్ మోసాలు

(మొదటిపేజీ తరువాయి)

యాప్‌లో 'అమ్మెల్యే' అనే మహిళ పేరుతో ఉన్న ఐడీతో అన్ని గ్రూప్‌లలో పరిచయం చేసుకుంటారు. సదురు మహిళ పేరుతో సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కొంత మందిని టార్గెట్ చేసుకొని వాట్సాప్ గ్రూప్ తయారు చేయిస్తున్నారు. ఒక వాట్సాప్ గ్రూప్ తయారు చేసినందుకు నెలకు కొంత మొత్తంలో డబ్బు పంపిస్తామంటూ నమ్మిస్తున్నారు. ఆ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌కు 'మాది 'వైన్' తయారు చేసే పెద్ద సంస్థ, వైన్ గ్రూప్ యాప్ ఉంటుంది' అని నమ్మిస్తున్నారు.

వాట్సాప్ గ్రూప్‌లో చేరే వారికి అన్ని విషయాలు తామే వివరిస్తామంటూ నమ్మిస్తున్నారు. ముందుగా వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ పెట్టుబడి రూపంలో దాదాపు రూ.17000 చెల్లిస్తారు. ఆ తర్వాత మీరు ఎంత మందిని గ్రూప్‌లలో చేర్పిస్తే అంత మొత్తంలో మీ కమీషన్ డబ్బు పెరుగుతుందంటూ టాస్కులు పెడ్తారు. ఇది నిజమని నమ్మి గ్రూప్ అడ్మిన్ పెట్టుబడులు పెట్టడంతోపాటు స్నేహితులను, తెలిసిన వారిని, తోటి ఉద్యోగులను, బంధువులను ఇలా మరింత మందిని గ్రూప్‌లలో సభ్యులుగా చేర్పించి, సైబర్ నేరగాళ్లకు ఆ గ్రూప్‌ను అప్పగిస్తున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు ఆ గ్రూప్‌లో ఉండే సభ్యులను వ్యక్తిగతంగా, గ్రూప్ వారీగా టార్గెట్ చేసి, వైన్ గ్రూప్ యాప్‌లో పెట్టుబడులు పెట్టించి మోసం చేస్తున్నారు. ఇందులో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వాళ్లు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా వైన్‌గ్రూప్ మోసాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఒకే సారీ వేలాది మంది టార్గెట్

సైబర్ నేరగాళ్లు ఇప్పటి వరకు నిరుద్యోగులను, మహిళలను, అమాయకులను టార్గెట్ చేసుకునేవారు. ఈ మెయిల్, సెల్‌ఫోన్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లో మెసేజ్‌లో లింక్ పంపించి, వారిని టెలిగ్రామ్ యాప్‌లలోకి రప్పించి, మరో లింక్ ద్వారా ఒక వెబ్‌సైట్ లింక్‌తో బాధితులను పరిచయం చేసుకునేవారు. అయితే, వైన్ గ్రూప్ పేరుతో సైబర్ నేరస్థులు ఒక్కసారిగా వేలాది మందిని మోసం చేస్తున్నారు. ఇక్కడ గ్రూప్ అడ్మిన్‌లు చాలా మందిని ఆ గ్రూప్‌లో చేర్పిస్తున్నారు. మోసపోయిన వాళ్లు మరో కొత్త గ్రూప్‌ను తయారు చేసి, మరింత మందిని అందులోకి చేర్చుతున్నారు. ఇందులో మోసపోయిన బాధితులు సైతం డబ్బు రాబట్టుకోవాలంటే, ఇంకొకరిని మోసం చేస్తూ వెళు న్నారు. ఇక్కడ తెలిసిన వారే, మరొకరిని ఆ గ్రూప్‌లో చేర్పించడంతో చాలా మంది వైన్ గ్రూప్ చేతిలో మోసానికి గురవుతున్నారు.

ప్రతి రోజూ వేలల్లో లాభాలు..

'వైన్ తయారు చేసే సంస్థ మాకుంది. మా వైన్ ధర రూ.35000 ఉంటుంది, మార్కెట్లో బాగా డిమాండ్ ఉంది. ఎక్కువ మందికి వ్యాపారంలో భాగస్వామ్యం ఇవ్వాలని పరిచయం చేస్తున్నాం. వైన్‌పై మీరు పెట్టుబడి పెడితే మీకు ప్రతి రోజూ రూ.2,200 లాభం వస్తుంది' అని నమ్మిస్తారు. ఇది నమ్మిన చాలా మంది 'వైన్ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకొని అందులో పెట్టుబడులు పెడుతున్నారు. అయితే ముందుగా కొంతమందికి ఎక్కువ మొత్తంలో డబ్బు చెల్లించడంతో, చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇలా రూ.50 వేల నుంచి రూ. 10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టిన వారున్నారు. ఈ యాప్‌లో పెట్టిన పెట్టుబడి డిజిటల్‌లో కనిపిస్తుండగా, మరోపక్క రోజు వారీ లాభాలు కనిపిస్తుంటాయి. మొదటి ఒకటి రెండ్రోజులు వచ్చిన లాభాన్ని విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఆ తరువాత విత్‌డ్రా ఆప్షన్‌ను బ్లాక్ చేసి, మరింత పెట్టుబడి పెట్టండి, మరిన్ని లాభాలొస్తాయంటూ నమ్మిస్తూ దఫ దఫాలుగా పెట్టుబడులు పెట్టిస్తూ వెళ్తున్నారు.

కష్టపడందే ఏదీ రాదు
సైబర్‌క్రైమ్స్ ఏసీపీ, కేవీఎం ప్రసాద్

(మొదటిపేజీ తరువాయి)

కూడా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ వైన్‌గ్రూప్ మోసాల వెనుక ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వాళ్లే ఉంటున్నారు, ఎక్కువగా దుబాయ్, చైనా సైబర్‌నేరగాళ్లు ఇలాంటి మోసాలు చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ఎవరూ ఇలాంటి మోసపూరితమైన మాటలు, మెసేజ్‌లను నమ్మి డబ్బులు పెట్టుబడి పెట్టొద్దన్నారు.

హరగోపాల్‌పై కేసును ఉపసంహరించుకోవాలి : సీపీఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రొఫెసర్ హరగోపాల్‌పై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే సాకుతో తాడ్వాయిలో ఆయనపై కేసు పెట్టడం విడ్డూరంగా ఉందని తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరిపేందుకు ఆయన మధ్యవర్తిత్వం వహించారని గుర్తు చేశారు. గతంలో పలు సమస్యలు తలెత్తినప్పుడు కూడా వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లతో సంప్రదింపులు జరిపారని పేర్కొన్నారు. ప్రజాస్వామిక వాదియైన హరగోపాల్‌పై పోలీసులు కేసు పెట్టడం అన్యాయమని తెలిపారు. ఆయనతో పాటు ప్రొఫెసర్ పద్మజా షా, తదితరులపై కారణం లేకుండా కేసులు పెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తక్షణమే వారిపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఉపసంహరించేందుకు చర్యలు తీసుకోవడం తెలంగాణ ప్రయోజనాలకు ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు.

గుజరాత్ తీరాన్ని తాకిన తుపాను

కచ్ : అరేబియా సముద్రంలో పది రోజుల క్రితం ప్రారంభమై అత్యంత తీవ్రమైన తుపానుగా మారిన బిపారిజాయ్ తుపాను ఉగ్ర రూపంతో గుజరాత్ తీర ప్రాంతంపై విరుచుకుపడింది. కచ్ జిల్లాలో జకావు పోర్టుకు సమీపంలో తీరాన్ని తాకిందని గురువారం సాయంత్రం భారత వాతావరణ విభాగం తెలిపింది. గురువారం సాయంత్రం తుపాను తీరాన్ని దాటే క్రమం ఆరంభమైందని అయితే మొత్తం తుపాను తీరాన్ని దాటేందుకు కనీసం ఆరు గంటలు పడుతుందని వాతావరణ అధికారులు తెలిపారు. మూడో కేటగిరీలోని ఈ తుపానును 'అత్యంత తీవ్రమైన తుపాను' వర్గీకరించారు. తుపాను తీరాన్ని దాటే సమయంలో పెను విధ్వంసం చోటు చేసుకోవచ్చని ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కోనాల్సిందిగా అధికార యంత్రాంగం ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గత పది రోజులుగా ఈ తుపాను గురించి వాతావరణ శాఖ తీవ్రమైన హెచ్చరికలు చేస్తోంది. గత రెండు మూడు రోజులుగా తుపాను ధాటికి గుజరాత్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాగా గురువారం సాయంత్రానికి గుజరాత్ తీర ప్రాంతమంతా కుంభవృష్టి కురుస్తోంది. బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో కచ్, సౌరాష్ట్ర తీర ప్రాంతాలు అల్లాడుతున్నాయి. ఈ తుపాను మూలకేంద్రం (సైక్లోన్ ఐ) దాదాపు 50కిలోమీటర్ల విస్తీర్ణంలో వుందని. గంటకు 13నుండి 14కిలోమీటర్ల వేగంతో ముందుకొస్తోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో ప్రస్తుతానికి గంటకు వంద నుండి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. తుపాను తీరం దాటే క్రమంలో ఇవి మరింత పెరుగుతాయి. పలు ప్రాంతాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. తుపాను తీరాన్ని దాటే ప్రాంతంలో పది కిలోమీటర్ల పరిధిలోని దాదాపు 20గ్రామాల నుండి లక్ష మంది వరకు ప్రజలను ఇప్పటికే తాత్కాలిక పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భుజ్, ద్వారక, పోర్‌బందర్, జామ్‌నగర్ తీర ప్రాంతాల్లో మూడు నుండి ఆరు మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడుతున్నాయి. చాలాచోట్ల పల్లపు ప్రాంతాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకువచ్చింది. ద్వారక, మండ్వీ, మోర్బి జిల్లాలో బలమైన గాలులతో పాటూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముంబయిలో సముద్రం అల్లకల్లోలంగా వుంది. పెద్ద ఎత్తున అలలు ఎగిసిపడుతున్నాయి. కాగా ఈ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనడానికి గుజరాత్ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. కచ్, సౌరాష్ట్రల్లోని ఆరు జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. తీర ప్రాంత జిల్లాల్లో ఇప్పటికే ఎన్‌డిఆర్‌ఎఫ్‌కి చెందిన 18 బృందాలు, రాష్ట్ర విపత్తు దళాలు 12 బృందాలు మోహరించాయి. భుజ్, జామ్‌నగర్, గాంధీనగర్‌ల వ్యాప్తంగా 27 రిలీఫ్ సైనిక దళాలను మోహరించినట్లు ఆర్మీ ప్రకటించింది. రోడ్లు, భవనాల శాఖకు చెందిన 115 బృందాలను, విద్యుత్ విభాగాలకు చెందిన 397మంది అధికారులను వేర్వేరు తీర ప్రాంత జిల్లాల్లో మోహరించారు.

ప్రొఫెసర్ హరగోపాల్‌పై రాజద్రోహం కేసు

- ఆలస్యంగా సమాచారం వెలుగులోకి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

ప్రముఖ పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్‌పై ములుగు జిల్లా తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో రాజద్రోహం కేసును నమోదు చేసినట్టు ఆలస్యంగా వెలుగు చూసింది. ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. 2022, ఆగస్టు 19న తాడ్వాయి పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక మారుమూల ప్రాంతంలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ములుగు ప్రసాద్ రావు అలియాస్ చంద్రన్న, రాజిరెడ్డితో పాటు దాదాపు 50 మంది మావోయిస్టులు సమావేశమై కొందరు ప్రజా ప్రతినిధులను హత్య చేయటానికి ప్రణాళిక రచించటంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వాస్తుల విధ్వంసానికి కుట్ర పన్నినట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు ఆ ప్రాంతంపై దాడికి వెళ్లగా మావోయిస్టులు తప్పించుకున్నారు. మరుసటి రోజు ఆ ప్రాంతంలో సోదాలు జరిపిన పోలీసులకు విప్లవ సాహిత్యంతో పాటు మావోయిస్టులకు చెందిన అనేక కిట్ బ్యాగులు, వ్యూహ రచనకు సంబంధించిన పత్రాలు లభించాయి. దాని ఆధారంగా 45 మందికి పైగా మావోయిస్టులపై సెక్షన్ 120(బి), 147, 148, 149తో పాటు సాయుధ చట్టం(ఆర్మ్స్ యాక్ట్) కింద కేసులు నమోదు చేశారు. అందులో 44వ నిందితుడిగా ప్రొఫెసర్ హరగోపాల్ పేరును చేర్చారు. దీనికి సంబంధించిన సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మండుతున్న కూరగాయలు

(మొదటిపేజీ తరువాయి)

క్వింటాళ్ల పచ్చిమిర్చి అమ్మేది. గురువారం పావుకింటా కూడా అమ్ముడుపోలేదు. ధరలు పెరిగే సరికి జనం కొనుగోలు చేయడం తగ్గించింద్రు. కొద్దిపాటిగా కొంటున్నరు. మార్కెట్‌లో వ్యాపారాలు ఢల్‌గా మారాయి" ఇదీ..! కూరగాయల వ్యాపారి నర్సింహ మాట.

మార్కెట్లలో ఉన్నట్టుండి కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. అతివృష్టి...అనావృష్టి వల్ల అన్ని పంటల మాదిరే కూరగాయలు, ఆకుకూరల పంటలు కూడా దెబ్బతిన్నాయి. పంట దిగుబడులు అమాంతం తగ్గడంతో మార్కెట్‌కు సరుకు రావడం తగ్గింది. జనం వినియోగం మేరకు సరుకు రాకపోయే సరికి మార్కెట్‌లో దళారులు ధరల్ని పెంచేశారు. పండించిన రైతు నుంచి సరుకు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల చేతులు మారి వినియోగదారుడి చేతికొచ్చే సరికి కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలోని ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో జరిగే కూరగాయల మార్కెట్‌లో ధరలు ఆకాశాన్నంటాయి. రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లు, వీధి సంతల్లో ఏ రకం కూరగాయల్ని కొందామన్నా ధర వినేసరికి గుబులు పుట్టే పరిస్థితులు నెలకొన్నాయి. కూరగాయల మార్కెట్లల్లో ధరల పట్టికల్ని చూస్తే పావుకిలో కొనాలన్నా వీలుగాని పరిస్థితులేర్పడ్డాయి. పండించే రైతులు ప్రకృతి వైపరిత్యాల వల్ల తగ్గిపోతున్నారు. మరో పక్క కూరగాయల సాగుకు ప్రభుత్వం ప్రత్యేకమైన రాయితీలివ్వడంలోనూ ఇబ్బందులున్నాయి. మార్కెట్ సదుపాయం లేకపోవడం, వరుసగా నష్టాలొస్తుండడంతో కూరగాయల సాగు మానేసి వరి, పత్తి వంటి పంటల వైపు మళ్లుతున్నారు.

అన్నింటి ధరలు పెరిగాయి..

గురువారం సంగారెడ్డిలోని బైపాస్‌రోడ్డులో కూరగాయల సంతకెళ్లి పరిశీలిస్తే అన్ని రకాల కూరగాయల ధరలూ పెరిగాయి. పచ్చిమిర్చి కిలో ధర రూ.80, క్యాప్సికం రూ.80, బీన్నీస్ రూ.120, చిక్కుడు రూ.100, క్యారెట్ రూ.80, దొండకాయ రూ.80 పలికింది. దోసకాయ రూ.60, టమాటా రూ.50, బీర రూ.60, గోరుచిక్కుడు రూ.60, చామగడ్డ రూ.60, కాకరకాయ రూ.60 ఉంది. 3 మునగకాయల ధర రూ.20, మూడు కిలోల ఉల్లిగడ్డ ధర రూ.50 ఉంది. సోరకాయ, కీరదోస, బీటురూట్ వంటి ధరలు కూడా పెరిగాయి. కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులే కాదు సంపన్నులు కూడా కొనుగోలును తగ్గించేశారు. వారాంతపు సంతల్లో ఆ వారానికి సరిపడా కూరగాయాల్ని కొనుగోలు చేస్తుంటారు. ఏ రకమైన కూరగాయలైనా సరే కిలో కొంటున్నది లేదు. పావు కిలో అరకిలో కూడా కొనలేకపోతున్నారు.

చికెన్ తినలేని పరిస్థితి

మార్కెట్‌లో కొన్ని నెలలుగా చికెన్ ధరలు మండిపోతున్నాయి. వేసవిలో సహజంగా చికెన్ వినియోగం తగ్గిస్తుంటారు. కానీ, ధరలు మాత్రం విపరీతంగా పెరిగాయి. ఆదివారం, ఇతర ప్రత్యేక రోజుల్లో చికెన్ తినే వాళ్లకు ధరలు భారంగా మారాయి. రెండు నెలలుగా కిలో చికెన్ ధర రూ.250 నుంచి 300 వరకు ఉంది. వేసవిలో ఎండల తీవ్రత వల్ల పౌల్ట్రీలో బాయిలర్ కోళ్ల పెంపకం కష్టంగా మారింది. ఎక్కువ మొత్తంలో చనిపోతుండటంతో మార్కెట్ అవసరాల మేరకు కోళ్లు రావట్లేదంటున్నారు. ధరలు పెరగడం వల్ల చికెన్ సెంటర్లలో గిరాకీల్లేకుండా పోయాయని నజీర్ అనే చికెన్ వ్యాపారి తెలిపారు.

అతివృష్టి.. అనావృష్టి

కూరగాయలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వడగండ్ల వానల వల్ల వరి, ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అందులో కూరగాయల పంటలు బాగా దెబ్బతిన్నాయి. వర్షాలు, గాలులు, వడగండ్ల వల్ల కూరగాయల తోటలు నేలవాలిపోయాయి.

పూత, పిందె రాలిపోయింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో టమాటా, ఉల్లిగడ్డ, దొండ, బెండ, సోరకాయ, దోసకాయ, పచ్చిమిర్చి, బీర వంటి పంటలు అకాల వర్షాల వల్ల దెబ్బతిన్నాయి. వేసవి సీజన్‌లో కూరగాయల వినియోగం బాగా ఉంటున్నందున ఆ సమయానికి దిగుబడులు వచ్చే విధంగా సాగు చేసిన కూరగాయల పంటలన్నీ దెబ్బతినడంతో తెలంగాణ అంతటా దిగుబడులు తగ్గాయి. ప్రస్తుతం మార్కెట్‌కు కూరగాయలు సరిపడ రాని కారణంగా ధరలు పెరిగాయి. ఖరీఫ్‌లో కూరగాయల సాగు చేసేందుకు విత్తనాలు తెచ్చుకున్నారు. టమాటా, ఉల్లినార్లు పోశారు. వర్షాల్లేకపోవడంతో ఆ పంటల సాగు ఆగిపోయింది. మరో రెండు నెలల వరకు కూడా కూరగాయలు దిగుబడులు సరిపడా వచ్చే అవకాశం లేనందున ధరల భారం తప్పదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

పహాడి షరీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్



నవతెలంగాణ- బడంగ్ పేట్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కే.సతీష్‌ను నియమిస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మహేశ్వరం నియోజకవర్గం పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా గురువారం కే. సతీష్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ ఎం. కాశీవిశ్వనాథ్ మంచాల్ పోలీసుస్టేషన్ కు బదిలీపై వెళ్లారు. ఈ స్థానంలో బోన్ గిర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న 2004 బ్యాచ్ కు చెందిన కె. సతీష్ ను నియమించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో తాను రాజీలేకుండా పనిచేస్తానని చెప్పారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ సతీష్‌కు ఎస్ఐలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సమస్యలపై సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో సర్వే



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీలో గురువారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీలో అత్యధికంగా పేదలు నివసిస్తున్నారని తెలిపారు. వారికి సరైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. కానీ అందుకు విరుద్ధంగా అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయని, మంచినీటి, వీధి దీపాలు మొదలగు సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ నివసించే చిన్నారులకు, గర్భిణులకు ఆరోగ్య అవసరాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్ వెంకన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

పేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

పేదలకు ఆపన్న హస్తం సీఎం సహాయ నిధి పథకం అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీ 18వ వార్డులో నివాసం ఉండే ఎస్.రమేష్ తండ్రి సుదర్శన్‌కు రూ.60వేలు, అదే విధంగా శ్రీరామ కాలనీలో నివాసం ఉంటున్న రాము తండ్రి చంద్రప్పకు రూ.4లక్షలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరయ్యా యి. గురువారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేదలు, బడుగు, బలహీల వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు ప్రభుత్వం కృషి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అడవుల సంరక్షణకు ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహాడి షరీఫ్ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను గురువారం మంత్రి సబితా ఇంద్రా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అడవులతో వాతావరణ కాలుష్య నియంత్రణ జరుగుతుందని చెప్పారు. పార్క్‌కు సంబంధించిన అభివృద్ధితో పాటు ప్రజలకు వాకింగ్ ట్రాక్ కోసం మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. జల్ పల్లి అర్బన్ పార్క్‌లో ఉదయం, సాయంత్రం పూట స్థానికులు వాకింగ్ చేసేలా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

ఈ అర్బన్ పార్క్ లో మున్సిపల్ తరుపున సిబ్బందిగా ఒకరిని నియమించాలని సూచించారు. అంతేకాదు చిన్న పిల్లలు ఆటలు ఆడుకునేలా పరికరాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పార్క్‌లో కాలిబాటన తిరుగుతూ చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. మంత్రి వెంట జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ బిన్ సాధి, మున్సిపల్ కమిషనర్ వసంత, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు యూసుఫ్ పటేల్, మున్సిపల్ అధ్యక్షులు ఎక్బాల్ ఖలీఫా, కౌన్సిలర్లు శంషాద్దీన్ తదితరులు ఉన్నారు.



సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని బి టైపు క్వాటర్స్ నందు నివాసం ఉండే లక్ష్మికి సీఎం సహాయ నిధి నుండి లక్ష రూపాయల చెక్కు మంజూరైంది. ఈ మేరకు గురువారం ఆ చెక్కును ఎమ్మెల్యే బాధితురాలి కుటుంబ సభ్యులకు అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి ఎంతో దోహదపడుతుందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, విజయ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

'పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'



నవతెలంగాణ- వనస్థలిపురం

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని మారుతీ నగర్ కాలనీలో రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కాలనీవాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఈ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించారని కొనియాడారు. అనంతరం డివిజన్‌లోని సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ వెంకటరెడ్డి, మునగాల రాఘవేందర్ రావు, అమర్థ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరోరా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బొరియాలిస్ ఫెస్ట్



నవతెలంగాణ-బోడుప్పల్

పర్వతాపూర్‌లోని అరోరా టెక్నలాజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కాలేజీ, స్టూడెంట్ ఆక్టివిటీ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే సాంకేతిక, సాంస్కృతిక, సాహిత్య ఫెస్ట్, బొరియాలిస్‌ను గురువారం కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫెస్ట్‌కు వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా నే ప్రతిభను గుర్తించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఫెస్ట్ కన్వీనర్ శ్రవణ్ కుమార్ రెడ్డి విద్యార్థులకు మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫెస్ట్ కో-కన్వీనర్లు అనిల్ కుమార్, రాజేందర్, కళాశాల అసిస్టెంట్ రిజిస్టర్ బాలకృష్ణారెడ్డి, డాక్టర్ అజయ్ కుమార్, వివిధ విభాగ అధిపతులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ- ఉప్పల్

సీఎం సహాయ నిధి పథకంతో ఎంతో మంది పేదలకు మేలు జరిగిందని ఉప్పల్ ఎమ్మెల్యే భేత్ సుభాష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఆయన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులు సహస్ర శ్రీ కి రూ.2,50,000, సుబ్బలక్ష్మికి రూ.48000, మహేష్‌కు రూ.36,000, సబితకు రూ.24000, లిఖితకు రూ.22000 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వరరెడ్డి, గరిక సుధాకర్, మేకల ముత్యంరెడ్డి, వేముల సంతోష్ రెడ్డి, డాక్టర్ బి.వి చారి, లక్ష్మీనారాయణ, పిట్టల నరేష్ ముదిరాజ్, నందికంటి శివ, కొంగల శ్రీధర్, వెంకట్ రెడ్డి, సాయి, రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నీట్ ఫలితాల్లో 'అపోలో' అకాడమీ ప్రభంజనం



నవతెలంగాణ -చైతన్యపురి

నీట్ పరీక్షా ఫలితాలలో చైతన్యపురిలోని అపోలో మెడికల్ అకాడమీ ప్రభంజనం సృష్టించిందని అపోలో మెడికల్ అకాడమీ డైరెక్టర్ పోసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అకాడమీలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అకాడమీ నుండి 280 మంది నీట్ పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 250 మందిలో 12 మంది ఎయిమ్స్ ఎంపికయ్యారని, 181 మంది విద్యార్థులు ఉచిత మెడికల్ సీట్లు సాధించినట్లు వివరించారు. పి. ప్రణతి 720 మార్కులకు గాను 685 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యా విధానంలో మార్పులకు అనుగుణంగా అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో బోధించడం వలనే అత్యుత్తమ ఫలితాలు రాబట్టగలిగామని హర్షం వ్యక్తం చేశారు. తమ అకాడమీ నుండి పరీక్షకు హాజరైన ప్రతి ముగ్గురిలో ఇద్దరు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అల్వాల మధుసూదన్, అధ్యాపకులు శ్రీధర్, గోవర్ధన్ రెడ్డి, కెవిఆర్, రాజు, మూర్తి, వంశీకృష్ణ, రోహిత్ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్, అబ్దుల్లా పూర్‌మెట్ మండలాల పరిధిలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగా తీసుకొచ్చిన మెనూ ప్రకారం మెస్ ఛార్జీలు పెంచాలని, ప్రతి పాఠశాలలో మంచినీళ్ల, వంటగది, గ్యాస్ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గురువారం హయత్ నగర్ ఎంఈఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ నేతలు ధర్నా నిర్వహించారు. తర్వాత ఎంఈఓ హీర్యా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మధ్యాహ్నం భోజన కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. ఏడు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉంటే.. వారు ఎక్కడి నుంచి తెచ్చి పిల్లలకు భోజనం పెట్టాలో ఈ ప్రభుత్వానికి అర్థం కావట్లేదా అని ప్రశ్నించారు. కార్మికులకు రూ.3వేల జీతం పెంచుతున్నట్టు ప్రకటించి..రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకూ ప్రకటించిన జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు సేవ చేస్తున్న మధ్యాహ్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, వంట సామానుతో సహా అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు, వీరయ్య, వెంకన్న, కార్మికులు రమాదేవి, మంజుల, లక్ష్మమ్మ, రంగమ్మ, నాగరాణి, మంగమ్మ, అలివేల అనిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష ఆర్థిక సాయానికి

దరఖాస్తు గడువు పెంచాలి



- తెలంగాణ రాష్ట్ర చేతి వృత్తి సంఘాల రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ

నవతెలంగాణ -నాగోల్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సహాయానికి దరఖాస్తుల సమయాన్ని ఈ నెల 30 వరకు పొడగించాలని తెలంగాణ రాష్ట్ర చేతి వృత్తుల సంఘాల రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు బోడ్డుపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. బీసీ చేతి వృత్తిదారులకు లక్ష రూపాయల ప్రభుత్వ సహాయం కోసం ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే కంప్యూటర్ సర్వర్‌లు మొరాయించి పని చేయడంలేదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. చాలా మంది అర్హులు దరఖాస్తు చేసుకోలేదని.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ ఆర్థిక సహాయానికి గడువు పెంచాలని కోరారు. దళితులకు రూ.10 లక్షలు ఇచ్చి.. జనాభాలో 50 శాతం ఉన్న బీసీ లకు రూ.లక్ష సాయం అది కూడా కొద్దిమంది బీసీ చేతి వృత్తిదారులకు వర్తింపజేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో పూట గడవని నిస్సహాయ స్థితిలోని ఉన్న నిరుపేద, వెనుకబడిన వర్గాల కుల వృత్తిదారులు పెట్టుబడులు పెట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లక్ష రూపాయల ప్రభుత్వ సహాయం ఏమాత్రం సరిపోదన్నారు. 52 శాతం ఉన్న బీసీ చేతి వృత్తిదారులందరికీ 'బీసీ బంధు ' ప్రవేశపెట్టి..రూ. 10 లక్షలు సహాయం చేయాలనీ బొడ్డుపల్లి కృష్ణ సీఎం కేసీఆర్‌ను కోరారు.

చంపాపేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చంపాపేట్ డివిజన్ పరిధిలోని న్యూ పద్మా నగర్ అసోసియేషన్ సభ్యులు, చంపాపేట్ డివిజన్ నాయకులు గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సదర్భంగా పలువురు మాట్లాడుతూ వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పద్మానగర్ ప్రధాన రహదారిలో జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఆ పనులను పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులేదని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చంపాపేట్ డివిజన్ పరిధిలోని న్యూ పద్మా నగర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ రెడ్డి, విజయనంద్ రెడ్డి, యాదయ్య, నాగరాజు, శ్రీనివాస్, వెంకట స్వామి, నగేష్, సుధాకర్ రెడ్డి, చంపాపేట్ డివిజన్ సీనియర్ నాయకుడు నల్ల రఘుమా రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్ కుమార్ రెడ్డి, స్థానిక పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ- సంతోష్ నగర్

మలక్‌పేట్ ట్రాఫిక్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎం.ప్రవీణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతతో పరిరక్షణ, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకట్ రెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

బాలాపూర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా వెంకట్ రెడ్డిని నియమిస్తూ రాచకొండ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం వెంకట్ రెడ్డి బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇక్కడి నుండి బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ భాస్కర్ కు స్థానిక వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోల్ పలికారు. తర్వాత పలువురు నాయకులు మాట్లాడుతూ బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో మచ్చలేని ఒక అధికారిగా భాస్కర్ ఉన్నారని కొనియాడారు. కరోనా కష్టకాలంలో తన సొంత డబ్బుతో పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారని గుర్తుచేశారు. గడిచిన మూడున్నర సంవత్సరాలుగా కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలను కలుపుకొని శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, మహేశ్వరం నియోజకవర్గ యువజన విభాగం జర్నల్ సెక్రటరీ ఎల్మిటి సుమంత్ రెడ్డిలు నూతన ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మాజీ వార్డు సభ్యుడు కాల్వ గణేష్ ముదిరాజ్, సతీష్, రాము యాదవ్, రాళ్ల బండి కుమార్ గౌడ్, ఎండీ అక్వీల్, లాలా భాయ్, అక్బర్ ఖాన్, షబ్బీర్ భాయ్, పాషా భాయ్, నిఖిల్ యాదవ్, సాయి కుమార్, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంకుషాపూర్‌లో పంచాయతీ రాజ్ కమిషనర్ పర్యటన



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్ గ్రామంలో తెలంగాణ పంచాయతీ రాజ్ కమిషనర్ హనుమంత్ రావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో నర్సరీ, డంపింగ్ యార్డ్, వైకుంఠ దామాలను మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. తర్వాత తడి, పొడి చెత్త సేకరణ ఎలా చేపడుతున్నారని, ఇప్పటి వరకూ హరితహారం కార్యక్రమాలలో ఇంటింటికీ ఎన్ని మొక్కలు పంపిణీ చేశారని, ఇంకా తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డిని కమిషనర్ హనుమంత్ రావు అడిగి మరి తెలుసుకున్నారు. హరిత హారం కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా పాలకవర్గం, అధికారులు కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో దేవసహాయం, డీఆర్డీఏ అధికారి పద్మజారాణి, డీపీవో రమణా మూర్తి, ఎంపీడీవో అరుణ, ఎంపీవో నందకిశోర్, సర్పంచ్ జలజ సత్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ శోభ రెడ్డి, ఉపసర్పంచ్ చింతకింది బాలమణి వేణుగోపాల్, వార్డు సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగు నీరందించడమే లక్ష్యం

- కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్



నవతెలంగాణ- ఉప్పల్

ఇంటింటికీ తాగు నీరందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్‌లోని సీతారాం కాలనీలో ఓఆర్ఆర్ ఫేస్ 2 తాగునీటి పైపులైన్ పనులను గురువారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ నీరందించాలనే సంకల్పంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టిం దన్నారు. ఇందులో భాగంగానే చిలుకానగర్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాలలో ఉన్న పొల్యూషన్, లో ప్రెషర్ ఉన్న ప్రాంతాలను గుర్తించి కొత్త పైపులైన్లు వేస్తున్నట్లు తెలిపారు.పైప్ లైన్లు వేసేటప్పుడు లీకేజీ లేకుండా కనెక్షన్లు ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాన్నల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, మైనార్టీ ప్రెసిడెంట్ అబ్బు బాయ్, గూడూరు రమేష్, రామానుజం, నారాయణ రెడ్డి , ముద్దం శ్రీనివాస్, రవీందర్ గౌడ్, ఫోటో బాలు, హనీఫ్, మహ్మద్ గౌస్, శ్యామ్, బీరప్ప గడ్డ బాలు తదితరులు పాల్గొన్నారు.

మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ, బడంగ్‌పేట్

మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ సైదాబాద్ సరస్వతీ నగర్ కాలనీకి చెందిన విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత కోశాధికారి, మాతృ దేవోభవ అనాథ ఆశ్రమం ముఖ్య సలహాదారులు వలిశెట్టి లక్ష్మీశేఖర్ జన్మదినం సందర్భంగా..మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్ గుల్ మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలోని మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు సేవ చేస్తే.. ఆ భగవంతునికి సేవ చేసినట్లేనని అన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా హృదయం, సేవా భావంతో కష్టాల్లో ఉన్నవారికి సాయం చేయాలని సూచించారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి చేస్తున్న సేవలను కొనియాడారు. తమ శ్రీ శ్రీనివాసం సేవా ట్రస్ట్ ద్వారా భవిష్యత్‌లో అనాథలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిశెట్టి శారద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలి

- మోంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్



నవతెలంగాణ- ఉప్పల్

తెలంగాణలోని గృహ కార్మికులకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్ డిమాండ్ చేశారు. ఉప్పల్‌లోని మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ (ఎంఎస్ఐ)లో అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తెలంగాణలోని మూడు జిల్లాలు - రంగారెడ్డి, హైదరాబాద్ అండ్ మేడ్చల్ - మల్కాజిగిరికి చెందిన గృహ కార్మికులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ కార్మికుల హక్కులను గుర్తించి, పరిరక్షించడం తోపాటు హింస, వివక్షకు వ్యతిరేకంగా వారిని కాపాడేందుకు తెలంగాణాలో చట్టం అవసరమన్నారు. ట్రేడ్ యూనియన్‌గా రిజిస్టర్ అయిన గృహకార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్ (జీయూటీఎస్) ప్రపంచవ్యాప్తంగా ఉన్న గృహ కార్మికుల స్ఫూర్తిని స్మరించుకుంటూ 5 డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. చాలా మంది గృహ కార్మికులు కనీస వేతనం కంటే తక్కువ పొందుతున్నారన్నారు. వారానికోసారి సెలవు లేకుండా, యజమానుల నుంచి దూషణలకు కూడా గురవుతున్నారని, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఈ చట్టం వస్తే.. దేశంలోనే మొదటి స్థానంలో రాష్ట్రం నిలుస్తుందని పేర్కొన్నారు. గృహ కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలుపుతూ క్వీర్ బంధు వ్యవస్థాపకులు మాలా ముకుంద, ట్రాన్స్‌జెండర్లు మరియు వారు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష గురించి ప్రస్తావించారు. గృహ కార్మికులకు నగరంలో స్థిరనివాసం ఏర్పర్చాలన్నారు.

సామాజిక కార్యకర్త, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సజయ కాకర్ల మాట్లాడుతూ గృహ కార్మికులకు మంచి పని పరిస్థితుల గురించి మాట్లాడే ఐఎల్‌వో కన్వెన్షన్ 189ని ఆమోదించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రాజకీయ నాయకులు ఓట్లు అడగడానికి వచ్చిన ప్పుడు, ఓటు కోసం డబ్బు తీసుకోకుండా, కన్వెన్షన్ 189 గురించి ఏదైనా చేయాలని డిమాండ్ చేయాలని ఆమె కోరారు.

కుల నిర్మూలన సొసైటీ వ్యవస్థాపకురాలు జోష్న మాట్లాడుతూ గృహ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌లను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్య, సామాజిక భద్రత లేకపోవడంతో వారు తమ జేబులో నుండి ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం, ఈ శ్రమ్ కార్డ్ ద్వారా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2,00,000 అందుతుంది కానీ గృహ కార్మికులు అసంఘటిత రంగంలో అత్యంత దుర్బలమైన జీవితాన్ని గడుపుతున్నారని వాపోయారు. గట్స్ సెక్రటరీ మంజుల మాట్లాడుతూ గృహ కార్మికుల పోరాటం, సాధించిన విజయాలు మహిళా ఉద్యమానికి, కార్మిక ప్రపంచానికి స్ఫూర్తిని ఇస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంధ్య రాణి, సిస్టర్ లూర్దు మేరీ, నిర్మల, సిస్టర్ జానూ తదితరులు పాల్గొన్నారు.

నేడు డివిజన్ వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



ఆల్వాల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్‌లలో నూతనంగా నిర్మించిన డివిజన్ వార్డు కార్యాలయాలను ప్రారంభించనున్నట్టు అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. గురువారం ఆమె 134వ డివిజన్ వార్డు కార్యాలయానిన పరిశీలించి మాట్లాడారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నూతనంగా డివిజన్ వార్డు కార్యాలయంను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల పరిపాలన సౌలభ్యం కోసం ఈ కార్యాలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అన్ని పనులు కార్యాలయ పరిధిలోనే జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజు, డీఈ ప్రశాంతి, ఏఎంసీ స్వామి, 133 డివిజన్ ఏఈ రవళి అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

కనాజిగూడ చౌరస్తాలో అనుమతి లేకుండా బీటీ రోడ్డు తవ్వకాలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ పరిధిలోని కనాజిగూడ ఇందిరానగర్ దారిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా బీటీ రోడ్డు, సీసీ రోడ్డులను యథేచ్ఛగా తవ్విపోస్తున్నా పట్టించుకోనే నాథుడే లేడు. గతంలో ఓ ఇంటి యజమాని చిన్న నాలా కోసం కొంచెం సీసీ రోడ్డు తవ్వితే పెనాల్టీ కట్టించారు. కానీ ఇక్కడ 30 ఫీట్ల రోడ్డు ఏ పర్మిషన్ లేకుండా తవ్వినా చర్యలు తీసుకోవడం లేదు అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై అక్కడ ఉన్న లైన్మెన్‌ను ఫోన్ చేసి ఎందుకు తవ్వుతున్నారని అడగగా, వాటర్ బోర్డ్ వారు తవ్వుతున్నారు అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. వాళ్ల తవ్వుతారు వేస్తారు.. అంటూ పొంతన లేని సమాధానం ఇచ్చాడు తప్పితే ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం గమనార్హం.

ఘనంగా బోనాల ఉత్సవాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-బేగంపేట్



బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామనీ, అందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద వచ్చే నెల 9వ తేదీన నిర్వహించే బోనాలు, 10వ తేదీన నిర్వహించే రంగం, అంబారీ పై అమ్మవారి ఊరేగింపు నిర్వహణ, ఏర్పాట్ల పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సీఎం కేసీఆర్ ఆషాఢ బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారనీ, నాటి నుంచి అధికారికంగా అన్ని ఏర్పాట్లు చేస్తూ ఘనంగా నిర్వహిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామనీ, లక్షలాదిగా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో బోనాల ఉత్సవాలకు అరకొర ఏర్పాట్లు చేసేవారని పేర్కొన్నారు. మన సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను ప్రజలు సంతోషంగా, గొప్పగా జరుపుకోవాలనే ఆలోచనతోనే ప్రైవేట్ ఆలయాలకు కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందనీ, ఇందుకు ఈ ఏడాది రూ.15 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. బోనాల ఉత్సవాలకు ముందే ఈ ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. ఆలయ కమిటీల నిర్వాహకులు తమ దరఖాస్తులను త్వరితగతిన దేవాదాయ శాఖ అధికారులకు అందజేయాలని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాతనే మహంకాళి అమ్మవారి ఆలయాన్ని కూడా ఎంతో అభివృద్ధి చేసి ఇక్కడకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. బంగారు బోనం చేయించి అమ్మవారికి సమర్పిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది కూడా వెయ్యి మంది సాంస్కృతిక శాఖ కళాకారుల ప్రదర్శనతో అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నట్టు చెప్పారు. బోనాల సందర్భంగా 9వ తేదీన తెల్లవారు జాము నుండే మహిళలు అమ్మవారికి బోనాలు తీసుకొచ్చి సమర్పిస్తారని తెలిపారు. వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని వీధులు, ప్రధాన రహదారుల్లో స్ట్రీట్ లైట్ లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన భారికేడ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు, బోనాలు తీసుకొచ్చే వారి కోసం ప్రత్యేక క్యూ లైన్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. శివ సత్తులు అమ్మవారిని దర్శించుకోవడం కోసం ప్రత్యేకంగా మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో బోనాల ఉత్సవాలు జరిపేందుకు శాంతి భద్రతల నిర్వహణకు పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తామని చెప్పారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం తాత్కాలికంగా సీసీ కెమెరాలను అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా జనరేటర్లు, ట్రాన్స్ ఫార్మర్‌లను అందుబాటులో ఉంచనున్నట్టు చెప్పారు. ఆలయానికి వచ్చే రహదారుల్లో వాహనాలను మళ్ళించే విధంగా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను మంత్రి ఆదేశించారు. ఆలయ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండే విధంగా అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ హెల్త్ క్యాంప్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆర్య సమాజ్, దక్కన్ మానవ సేవా సమితి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తదితర స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్రతి ఏడాదీ బోనాల సందర్భంగా భక్తులకు తమ సేవలను అందిస్తారని ప్రశంసించారు. స్వచ్ఛంద సేవకులు, ఆలయ కమిటీ సభ్యులకు ఫోటోలతో కూడిన ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేస్తామని చెప్పారు. బోనాల ఉత్సవాలను వివిధ ప్రాంతాల్లోని ప్రజలు వీక్షించే విధంగా వివిధ టీవీ చానళ్ళలో ప్రత్యక్ష ప్రసారం జరిగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ పరిసరాల్లోని భక్తుల కోసం ఎల్ఈడీ స్క్రీన్‌లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తారని చెప్పారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, వాటర్ వర్క్స్ ఎండీ దాన కిషోర్, కార్పొరేటర్‌లు సుచిత్ర, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, ఆలయ ట్రస్టీ కృష్ణ, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి, డిప్యూటీ కమిషనర్ రామక్రిష్ణ, మహంకాళి ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి, నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రంగారావు, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ వసంత, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మహంకాళి ఏసీపీ రమేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, ఆర్అండ్‌బీ ఈఈ రవీంద్ర మోహన్, ట్రాన్స్ కో ఎస్ఈ రవి కుమార్, టూరిజం సీఈ వెంకటరమణ, సాంస్కృతిక శాఖ అధికారి నాగరాజు, ఆర్టీసీ రాణిగంజ్ డిపో మేనేజర్ లక్ష్మి ధర్మా, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి మధుసూదన్, ఐ అండ్ పీఆర్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాధాకృష్ణ, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి రమేష్ చందర్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీకి చర్యలు : డీఈఓ



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో ఫీజు రాయితీలను కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారి హామీనిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా కమిటీ ప్రతినిధులు గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డీఈఓను కలిసి జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ గతేడాది ఇచ్చిన విధంగా ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రొసిడింగ్‌ను ఇవ్వడంతో పాటు ఆయా మండలాల విద్యాధికారులకు తగిన సూచనలు చేసి ఉచిత విద్య అమలు జరిగేలా చూడాలని కోరారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు విద్యను అందించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన విద్యాశాఖ అధికారి విజయకుమారి మాట్లాడుతూ జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించేందుకు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. తగిన ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు జర్నలిస్టులు తమ గుర్తింపు కార్డులతో దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో కానీ, మండలంలో ఎంఈఓ కార్యాలయాల్లో కానీ అందించి సంబంధిత పాఠశాలలకు నేరుగా లేఖలను అందించేలా కూడా చూస్తామని హామీనిచ్చారు. ఇందుకు తగిన విధంగా మండలాల ఎంఈఓలకు సూచనలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్కయ్య, జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, బాల్‌రెడ్డి, కోశాధికారి భిక్షపతి, సహాయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొటగడ్డ శ్రీనివాస్, కోశాధికారి శేషారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్, శామీర్‌పేట ప్రెస్ క్లబ్ రవికుమార్, పలువురు జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతి సభ

నవతెలంగాణ-కాప్రా



తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతి సభ జరిగింది. సభా కార్యక్రమానికి గొడుగు యాద గిరిరావు అధ్యక్షత వహించా రు. సభా కార్యక్రమం ప్రారంభ సూచికగా ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు ప్రసాద్ బాబు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేశారు. మహిళా సంఘం నాయకులు వినోద శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేశారు. సామాజిక ఉద్యమ నాయకులు ప్రసాద్ బాబు మాట్లాడుతూ శ్రీశ్రీ ప్రజల భాషలో కవిత్వం రాసి నూతన శకాన్ని సృష్టించారని చెప్పారు. కష్టజీవుల పక్షాన నిలిచి ప్రజలకు అండదండగా అనేక గేయాలు రాశారని చెప్పారు. ప్రజా కవిత్వాన్ని చంద స్సు చట్రం నుంచి విడదీసి, సామాన్యుల భాషలో కొత్త కొత్త నుడికారాలతో అద్భుతాలు సృష్టించారని చెప్పారు. ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ మానవ చరిత్రలో కష్టజీవి పాత్రను వెలికి తీసి ఇదే నిజమైన చరిత్రగా ప్రకటించారని చెప్పారు. లింగస్వామి, రాజశేఖర్, విద్యార్థి నాయకులు బ్యాగరీ వెంకటేష్ ప్రసంగించారు. జగన్నాథ రథచక్రాలను భూమార్గం పట్టించాం నీ, హిట్లర్‌కు వ్యతిరేకంగా గర్జించు రష్యా గాండ్రించు రష్యా అని అంతర్జాతీయతను ప్రకటించారనీ, కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులు అంటూ యువకుల్లో ఉండాల్సిన లక్షణాలను వివరించాలని చెప్పారు. సభ అనంతరం సబీకులందరూ శ్రీశ్రీ చిత్రపటానికి పూలు అర్పించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మంగ, అశోక్, జి.శ్రీనివాస్, శ్రీనివాసరావు, జి.శివరామకృష్ణ, వెంకటేష్, సోమయాచారి పాల్గొన్నారు.

ప్రగతి పనులకు కేరాఫ్ జవహర్‌నగర్

నవతెలంగాణ-జవహర్‌నగర్



కార్పొరేషన్‌లోని ఏండ్ల నాటి కష్టాలు శాశ్వతంగా తీరనున్నడంతో ప్రగతి పనులకు కేరాఫ్‌గా జవహర్‌నగర్ మారుతుందని మేయర్ మేకల కావ్య అన్నారు. గురువారం కార్పొరేషన్‌లోని 15వ డివిజన్‌లో రూ.10 లక్షలతో డ్రయినేజీ పనులు, 8వ డివిజన్ సంతోశ్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో డ్రయినేజీ పనులు, 26వ డివిజన్ కార్పొరేటర్ పానుగంటి బాబు ఆధ్వర్యంలో సీసీ రోడ్డు రూ. 90 లక్షలతో ప్రగతి పనులను ప్రారంభించా రు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ లోని ప్రతి డివిజన్‌లో రూ.కోటితో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మట్టి రోడ్లు, సీసీ రోడ్లుగా మారుతున్నాయన్నారు. మురుగు నీరు రోడ్లపై కనిపించదన్నారు. మంత్రి మల్లారెడ్డి ఎల్లప్పుడు జవహర్ నగర్ నా గుండెకాయ అంటూనే గుండేకాయకు భారీ ఎత్తున నిధులు కేటాయించి పేద ప్రజల కష్టాలు తీర్చుతున్నారని పేర్కొన్నారు. అంతరించిపోతున్న కుల వృత్తులకు సీఎం కేసీఆర్ జీవం పోస్తూ రూ.లక్ష అందజేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, నాగభూషణం, శ్రీనాథ్, శ్రీమన్, కృష్ణరెడ్డి, సుధాకర్ గౌడ్, మల్లారెడ్డి, రజిత, కాలనీవాసులు పాల్గొన్నారు.

రసుల్‌పురాలో మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటన



నవతెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం కంటోన్మెంట్ వార్డు 2 రసూలుపురలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి వారు ఎదుర్కొంటున్న నాలా, మంచి నీరు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ అధికారులకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకు పోతూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మార్కెట్ డైరెక్టర్ నాయీమ్, బీఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, రాజు సింగ్, యాకూబ్, నాగేష్, భిక్షపతి, మహేష్ యాదవ్, జుబేద్, ఇషాద్ పాషా, కనకయ్య, శహద్ అలీ, శ్రీనివాస్, యాదగిరి, బంటి, లక్ష్మణ్, భాస్కర్, చౌహాన్, దఫెద, సూరి, తదితరులు పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మించండి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అల్వాల్ శ్రీ వెంకటేశ్వర ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ (ఎంహెచ్ ఆర్ కాలనీ) లో పార్కు కోసం కేటాయించిన 600 గజాల స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మించి పార్కును అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు కోరారు. గురువారం డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మహిపాల్ రెడ్డి, సంతోష్ రెడ్డి, విజయ్ రామ్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి క్రికెట్ ట్రోఫీ విజేతలకు బహుమతులు అందజేత

- మొదటి బహుమతి రూ.5వేలు
- రెండో బహుమతి రూ.25వేలు అందజేత



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో జరుగుతున్న మల్లారెడ్డి క్రికెట్ ట్రోఫీ విజేతకు రూ.50వేల మొదటి బహుమతిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి క్రీడాకారులకు అందజేశారు కీసర ధాయరలో పీజేఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో మల్లారెడ్డి క్రికెట్ టోర్నమెంట్-2023 నిర్వహించారు. 17వ వార్డు మోర మౌనిక నరహరి రెడ్డి టీంకి మొదటి బహుమతి, రెండో బహుమతి 9వ వార్డు రామారం కార్తీక్ గౌడ్, ఒర్సు రాములు గెలుపొందారు. మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.25వేలను క్రీడాకారులకు మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు నాను నాయక్, మంగళపూరి వెంకటేష్, కొత్త సురేఖ, మాదిరెడ్డి పావనిరెడ్డి, గురువెల్లి వెంకటరమణ, పాండాల అనురాధ, వసుపతి రమేష్, మాదిరెడ్డి నరసింహారెడ్డి, రామారం శ్రీహరి గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం ఏర్పాట్లు పూర్తి : ఈఓ

నవతెలంగాణ-బేగంపేట



రాష్ట్రంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈవో అన్నపూర్ణ తెలిపారు. గురువారం ఎల్లమ్మ ఆలమంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన జరిగే బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతుందని తెలిపారు. నెలరోజుల ముందు నుంచి రివ్యూ మీటింగ్‌లో ఏర్పాటు చేసి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రెండు గంటల వరకు వీఐపీ దర్శనం లభిస్తుందనీ, శివశక్తులకు ప్రత్యేక దర్శనం కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 5వేల మందికి రూ.50 టికెట్ ద్వారా దర్శనం కలిగిస్తున్నామని తెలిపారు. వీఐపీ ద్వారా ఇద్దరికి దర్శనం ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారనీ, అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామనీ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వివిధ శాఖల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో చైర్మన్ సాయిబాబా గౌడ్, పాలకమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు ఆఫీసులు ప్రారంభం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఆలోచనతో ఏర్పాటు చేస్తున్న వార్డు ఆఫీసులను నేటి నుంచి ప్రారభించనున్నట్టు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం అమీర్‌పేటలో 10, సనత్‌నగర్‌లో 18 చిరు వ్యాపారుల కోసం నిర్మించిన షాపులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. చిరు వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ షాపులను నిర్మించినట్టు తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలో వార్డు ఆఫీసులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ వార్డు ఆఫీసులో అందుబాటులో ఉంటారనీ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికో వెళ్ళాల్సిన అవసరం లేదనీ, వార్డు ఆఫీసులోనే ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఈ విధమైన వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదన్నారు. ప్రజలు ఈ వార్డు ఆఫీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక రాష్ట్రం



ఏర్పడిన తర్వాత సనత్ నగర్ నియోజకవర్గం పరిధిలో రూ.వందల కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల దీర్ఘకాలిక సమస్యలను కూడా చాలా వరకు పరిష్కరించినట్టు తెలిపారు నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఎర్రగడ్డ నుంచి ఫతేనగర్ ఫ్లై ఓవర్ వరకు ఉన్న రహదారి విస్తరణ చేసి డివైడర్‌ల నిర్మాణం చేయడంతో వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించినట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, మోహన్ రెడ్డి, ఇందిర, వాటర్ వర్క్స్ హరిశంకర్, డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, కొలన్ బాల్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహ, సరాప్ సంతోష్, సురేందర్ సింగ్, ఖలీల్, కరీం, పాజల్, రాజేష్, గోదాస్ కిరణ్, లలితా చౌహాన్, పుష్పలత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-దుండిగల్



ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు కార్యాలయంలో వ్యక్తిగత ఫొటో గ్రాఫర్ రాజేష్ (చంద్రకళ డిజిటల్స్)ను జన్మదినం సందర్భంగా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు సన్మానించి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊపిరి పోస్తున్న పాట

నవతెలంగాణ-కల్చరల్



పాట ఉద్యమాలకు ఊపిరి పిస్తుందని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలో కళాలలిత కళా వేదిక పై ప్రముఖ మహిళా సంస్థ రాగ రాగిణి నిర్వహణలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఇదే పాట ప్రతి చోట పేరిట గాన విభావరి జరిగింది. గాయని రమణ కుమారి నిర్వహణలో ఖాసీం రమాదేవి అంబదాసు, సుబ్బి రెడ్డి,ఉద్యమపాటలు, లలిత గీతలు ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని పాట ఉద్యమం అనే అంశం పై కీలక ప్రసంగం చేశారు పాట మనసుకు సూటిగా తగిలి ఆలోచనలకు కారణం అవుతుందన్నారు. కార్యదర్శి సుబ్బు లక్ష్మి వందన సమర్పణ చేశారు.

ఒకే గొడుగు కింద
ప్రభుత్వ సేవలు

నేటి నుంచి అందుబాటులోకి వార్డు కార్యాలయాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో సరికొత్త పాలన అందుబాటులోకి రానుంది. విద్యుత్, సివరేజ్, వాటర్, శానిటే షన్‌తోపాటు బస్తీలు కాలనీల్లో నెల కొన్న సమస్యలను ఒకే గొడుగు కింద పరిష్కరించేందుకు ప్రభుత్వం వార్డు కార్యా లయాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు అవి నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో సమస్యల పరిష్కారంలో నగర వాసులకు మరింతగా చేరువయ్యేందుకు పాలన వికేంద్రీకరణలో భాగంగా నగరం లో వార్డు పాలన చెయ్యాలనే వినూత్న ఆలోచనతో వార్డు కార్యాల యాలకు శ్రీకారం చుట్టారు. వార్డు పరిపాలన అధికారితో పాటు మొత్తంగా వార్డులో 10 మందిచొప్పున ఇంజనీరిం గ్, ఎంటోమాలోజి, యుబీడీ, యూసీడీ, టౌన్‌ప్లానింగ్ శానిటేషన్, విద్యుత్ జలమండలి రిసెప్షనిస్ట్ 150 వార్డుల లో అధికారులు నిత్యం ప్రజలకు అందు బా టులో ఉండనున్నారు. దాంతో ప్రజా సమస్యలు అక్కడి క్కడే పరిష్కారం అవుతాయని అధికారులు అభిప్రాయ పడుతు న్నారు. అయితే సమస్యలు ఎంత సమ యంలో ఎన్ని రోజుల్లో పరిష్కారం చేయ్యాలనే అంశంపై సిటిజన్ చార్టర్ ను అక్కడ ఏర్పాటు చేయనున్నారు. కాచిగూడలో వార్డు కార్యాల యాన్ని ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్ ప్రజలకు సువరిపాలన అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన వార్డు కార్యాలయాలు శుక్రవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర మునిసిపల్ పరిపాల, ఐటీ, పరిశ్రమల శాఖ మం త్రి కేటీఆర్ కాచిగూడ వార్డు కార్యాలయాన్ని ఉదయం 10 గంటలకు ప్రారం భించ నున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అ మీర్‌పేట్ బీకేగుడా వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. హోం మంత్రి మహమూద్ అలీ ఆజాంపుర వార్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అంతేకా కుండా రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మోండా మార్కెట్ డివిజన్ రెజిమెంటల్ బజార్ వద్ద ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని ముం దుగా ప్రారంభి స్తారు. ఆతర్వాతకవాడిగూడతాళ్ళబస్తీ, గోషామహల్ బేగం బజార్‌లో ప్రారంభిస్తారు. మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి బంజారాహిల్స్ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించను న్నారు. ఆ తర్వాత హిమాయత్ నగర్ మె ల్కోటే పార్కు పక్కన గల వార్డు కార్యాలయం ఎల్.బీనగర్ లోగోజిగూడ, రామంతపూర్ వివేక్ నగర్‌లో వార్డు కార్యా లయాలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించను న్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మంత్రులు, మేయర్, శాస న సభ్యులు, శాసన మండలి సభ్యులు, కార్పొ రేటర్లు, వార్డు కా ర్యాలయాలను ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి : ఇ.విజయ్‌కుమార్‌గౌడ్



తెలంగాణ-అంబర్‌పేట

మంచినీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్‌లో మంచినీటి సమస్యని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంబంధిత సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికి తిరుగుతూ లో-వాటర్ ప్రెషర్ సమస్యని పరిశీలించి, వెంటనే సిబ్బందితో మాట్లాడి సమస్యని పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే నరేంద్ర నగర్‌లో డ్రయినేజీ సమస్యని పరిశీలించి సంబంధిత సిబ్బందిని క్లీన్ చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు వాటర్ వర్క్ డీజీఎం, వాటర్ వర్క్స్ వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు లింగారావు, మహేష్ ముదిరాజ్, సింగ జోగి శ్రీను,కాలు,గుర్రం సాయికుమార్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలు అవసరం

నవతెలంగాణ-ఓయూ



సామాజిక సమస్యలకు పరిష్కారం చూపే ఉద్దేశంతోనే ఎంతో మంది సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలు చేస్తున్నారని భారత సామాజిక శాస్త్రాల పరిశోధనా సంస్థ (ఐసీఎస్ఎస్ఆర్) అదనపు సంచాలకులు డాక్టర్ రిచా శర్మ అభిప్రాయపడ్డారు. పరిశోధనా ప్రతిపాదన రచన-అనబంధ సమాచారం అనే అంశంపై ఓయూ ఆర్ట్స్ కళాశాల లో ఆమె ప్రసగించారు. దేశంలో ఐసీఎస్ఎస్ఆర్ పనితీరు, లక్ష్యాలు, సాధించిన విషయాలను వివరించారు. పరిశోధకులు ప్రాజెక్టులు, ఫెలోషిప్‌లు, ట్రావెల్‌గ్రాంట్‌లు సహా వివిధ అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. తమిళనాడు, ఢిల్లీల నుంచి ఎక్కువగా పరిశోధనా ప్రతిపా దనలు వస్తున్నాయని వారికి సంపూర్ణ అవగాహన ఉండటమే ఇందుకు కారణ మని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్,డైరెక్టర్ ప్రొఫెసర్ కె.స్టీవెన్సన్, ప్రొ.బి.నారాయణ, ప్రొ.ఐ. డైసీ, ప్రొ.బి. లావణ్య, పి. స్వాతి, డాక్టర్ వి.సమున్నత, డా.బి.సంధ్యారాణి, ప్రొ. ఎ. ప్యాట్రిక్, ప్రొ. జి. అంజయ్య, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



-ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

నూతనంగా నిర్మిస్తున్న అంబర్‌పేట డివిజన్ ప్రేమ్ నగర్‌లో రూ.18 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా వేయనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్‌పేట డివిజన్‌లో రోడ్లు పాడైపోయిన ప్రతి చోట నూతన సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని, స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చెయ్యాలని తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రేమ్ నగర్ లో ఇప్పటికే అనేక చోట్ల నూతన సిసి రోడ్లు ఏర్పాటు చేశామని, ప్రజల అవసరాల మేరకు అవసరమైన ప్రతి చోట నూతన సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో హలో డిపార్టుమెంట్ అధికారులు సిబ్బంది ఎలక్ట్రి సిటీ, వాటర్ వర్క్స్ యాదగిరిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు,మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

జూన్18 న తెలంగాణ స్టేట్ బౌల్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

బౌల్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ

నవతెలంగాణ-బంజారాహిల్స్



జూన్18 నతెలంగాణ స్టేట్‌బౌల్స్ ఛాంపియన్ షిప్ పోటీలనుహైదరాబాద్‌లోని ఆల్వా క్రికెట్ గ్రౌండ్ స్టేడియంలో నిర్వహిస్తున్నామని బౌల్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ తెలిపింది. ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.వరుణ్ కుమార్ మాట్లాడుతూ తమ ఫెడరేషన్ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డిబోల్స్, వరల్డ్ పెటాంక్ అండ్ బౌల్స్ ఫెడరేషన్‌కు అనుబంధమని తెలిపారు. 18న జరిగే క్రీడాలు 3 క్యాటగిరిలైన అండర్ 14,19,23 వయసు (పురుషులు, స్త్రీలు) గ్రూప్ లతో నిర్వహిస్తామన్నారు. నాకౌట్, సెమీఫైనల్, ఫైనల్ ద్వారా విజేతలను ఎంపిక చేసి మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. టీమ్‌ల ఎంపిక ప్రారంభించామ న్నారు. తెలంగాణ జిల్లాలోని అభ్యర్థులందరూ పాల్గొనాలని కోరారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవ దానికి సంప్రదించవలసినఫోన్ నెంబర్లు 8297201123, 9573843310, 9640806280 గా తెలియజేసారు.

'ప్రయాణం, పవర్ ఆఫ్ ప్రయార్టీ ఇన్ ఎ పోయట్రీ' పుస్తకం ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఎల్ఎల్‌బీ స్టూడెంట్ కార్తీక్ రాసిన 'ప్రయాణం' అనే తెలుగు కవితల పుస్తకం, 'పవర్ ఆఫ్ ప్రయార్టీ ఇన్ ఎ పోయట్రీ' అనే ఇంగ్లీష్ కవితల పుస్తకాలను కేంద్ర సంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి గంగపురం కిషన్‌రెడ్డి బర్కత్‌పురలోని మంత్రి కార్యాల యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రచయిత కార్తీక్‌ను అభినందించారు. అనంతరం మంత్రి మాట్లా డుతూ తన పుట్టిన రోజు ఈ పుస్తకాలను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. యువత సందేశ ఆధారిత పుస్తకాలను మరిన్ని రాయాలని ఆకాంక్షించారు. యువత జీవితంలో ఒత్తిడి లాంటి అంశాల ఆధారంగా మరిన్ని పుస్తకాలను రాయాలని సూచించారు.

వైద్య సిబ్బందికి అప్రిషియేట్ అవార్డులు, ప్రశంస పత్రాలు ప్రదానం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య దినో త్సవం ఘనంగా నిర్వహించారు. రోగులకు పండ్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత అం దజేశారు. అనంతరం రోగులకు వైద్య సేవలు అందించిన వైద్యులకు, వైద్య సిబ్బందికి అవార్డ్స్, ప్రశంస పత్రాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరిధర్, డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ సునీత, డాక్టర్ శ్రీలత, ఫెసిలిటీ మేనేజ్మెంట్ ఎం సదా నంద్, వై శ్రీనివాస్ పెద్ద ఎత్తున వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు అండగా కీర్తి రెడ్డి ఫౌండేషన్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని క్షయ వ్యాధి (టిబి) రోగులకు, కీర్తి రెడ్డి ఫౌండేషన్ ద్వారా వారికి బలమైన ఆహారం ఇవ్వటానికి, రోగులు పూర్తిగా కోలుకునే వరకు అండగా ఉంటామని, కీర్తిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మెన్ కీర్తిరెడ్డి అన్నారు.శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ హెల్త్ సెంటర్‌లో టీ.బి. సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గురువారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, ఈరోజు నుండి నియోజకవర్గంలో సుమా రు 65 మంది టీబీ రోగులు ఉన్నట్లు నిర్ధారించినట్లు, వారి కొరకు బలమైన ఆహారం అందించటానికి కావలసిన సరుకులతో కూడిన కిట్ బ్యాగులను రోగులకు అందించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ హైదరా బాద్ జిల్లా చైర్మన్ డాక్టర్ మామిడి భీమిరెడ్డి, టీబి సెంటర్ డాక్టర్ విజయభాస్కర్‌సిబ్బంది, టీబీ రోగులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడుగా టి.ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



మలిదశ ఉద్యమకారుడు తెలంగాణ ఉద్యమంలో నిజాం కాలేజ్ నుంచి ముందుండి పోరాడి మాదిగ జాతి కోసం దశాబ్దకాలంగా విద్యార్థుల కోసం విద్యార్థి సమస్యల కోసం అహర్నిశలు సమస్య పై పని చేస్తున్నా తప్పెట్ల ప్రవీణ్ కుమార్‌ను మాదిగ స్టూడెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులయ్యారు. నిజాం కాలేజ్ నుండి నేడు ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిగా చదువుతూ విద్యా రంగ సమస్యలపై పోరాడుతూ విద్యార్థి హక్కుల కోసం పోరాడుతున్న వ్యక్తి అని అన్నారు. మాదిగల హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రెగుంట సునిల్ మదిగకు ప్రవీణ్ కు మార్ శుభాకాంక్షల తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ పని చేస్తానన్నారు.మాదిగ హక్కులు అభ్యున్నతికి కోసం పోరాటం చేస్తానని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు వంటావార్పు, కాలేజీకి తాళం

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ యంపీఈడీ మెదటి సంవత్సరం విద్యార్థులు గురువారం కళాశాల, వసతి గృహ సమస్యలు పరిష్కరించాలని కాలేజ్ ప్రధాన ద్వారం కు తాళం వేసి, వంటావార్పు కార్యక్రమన్ని నిర్వహించారు. ఒక్కసారిగా విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మాస్టర్ ఆఫ్ ఫిజి కల్ ఎడ్యుకేషన్ విభాగం విద్యార్థులు సుమారు 40 మంది మెస్ ఓపెన్ కోసం డీడీలు చెల్లించిన, మెస్ ఓపెన్ చెయ్యట్లేదని, కాలేజీకి ప్రొఫెసర్స్ ఎవ్వరు రావట్లేరు అని, హాస్టల్ లో కనీస వసతులు కూడా కరువైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు.పలువురు మార్లు అధికా రుల దృష్టికి తీసుకు పోయిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించాలని విద్యార్థులు కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



కమ్యూనిటీ బేస్డ్ కేర్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుస్తే శ్రీకాంత్ ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లి దండ్రులు పిల్లల అభివృద్ధి కోసం ప్రభుత్వ సహకారం తీసుకోవాలని సూచించారు. ఉంటుందని తెలిపారు.ఎస్ ఆర్‌డి పార్వతి కమ్యూనిటీ కో ఆర్డినేటర్ క్రాంతి కిరణ్ మాట్లా డుతు. బస్తి సమస్యలపై బాలల సంరక్షణ చదువు ఆరోగ్యం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రిత డైరెక్టర్ నాగరాజ్. పాటశాల ప్రధానోపాధ్యాయులు ఏసియా సుల్తానా .అంగన్వాడీ సూపర్వై జర్, ఆశ్రిత కో-ఆర్డినేటర్ పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుపై ఆరోపణలు అవాస్తవం

-పులిజాల గేల్వయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

దళితబంధుపై తప్పుడు ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్ క్షమాపణలు చెప్పాలని లేనియెడల భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని బీఆర్ఎస్ నాయకులు పులిజాల గేల్వయ్య అన్నారు. గురువారం నల్లకుంట డివిజన్ పరిధిలోని న్యూ నల్లకుంటలో మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్ దళిత బంధుపై మూడు లక్షలు తీసుకొని ఇప్పించారని తప్పుడు ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని గరిగంటి రమేష్ శ్రీదేవి ఇల్లును ముట్టడించారు. నాయకులు పులిజాల గేల్వయ్య, ఆర్కే బాబు, రెడ్డ పాక రాము మాట్లాడుతూ సొంత పార్టీలో ఉండి ఎమ్మెల్యేపై దళిత నాయకులపై తప్పుడు ఆరోపణలు చేసిన గరిగంటి రమేష్ వెంటనే క్షమా పణలు చెప్పాలని ఆరోపణలు రుజువు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఆరోపణలు చేయకుండా పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆమనూరు సతీష్, ఎర్ర భీష్మ దేవ్, భూ పతి లక్ష్మణ్, ధర యోబు, ధనంజయ, సదానందు, నాయకులు పాల్గొన్నారు.

అమరవీరులందరి వివరాలు ప్రభుత్వం ప్రకటించాలి

- వారందరికీ ఐదెకరాల భూమి ఇవ్వాలి
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ
- 24న నిర్వహించనున్న ఉద్యమకారుల సదస్సు



నవతెలంగాణ-అడిక్‌మెట్

తెలంగాణ అమరవీరులందరి వివరాలు ప్రభుత్వం ప్రకటించాలని, వారందరికీ ఐదెకరాల భూమి ఇవ్వాలనీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం విద్యానగర్ బీసీ భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎర్ర సత్యనారాయణ హాజరై మాట్లా డుతూ ఆత్మహత్యలతో సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ విధానాల కారణంగా జనాలు తాగుడుకు బానిసై మహిళల పట్ల లైంగికదాడులకు పాల్పడుతున్నారని, అనాచారాలు పెరిగిపోయాయని తెలిపారు. ఈమధ్య బాసర ట్రిపుల్ ఐటి సంఘటన, దిల్‌షుఖ్‌నగర్, వికారాబాద్ అమ్మాయిల ఆత్మహత్యల దుర్ఘటనలో మద్యమే ప్రధానం కావటమే ప్రత్యక్ష ఉదాహరణ అని తేల్చారు. జరుగుతున్న ఆకృత్యాలపై 24న సమావేశంలో చర్చించి ప్రతిపాదన చేయాలని వక్తలు కోరారని తెలిపారు. సిద్దిపేట లేకపోతే కేసీఆర్ ఉండేవారా? కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ కేసీఆర్, కేటీఆర్‌లు లేక పోయిన తెలంగాణ ఉద్యమం ఉండేదని, తెలంగాణ నినాదం లేకపోతే కేటీఆర్ ఉండేవారు కాదన్నారు. ఈ సమావేశంలో 69 ఉద్యమకారులు, 78 జనతా అధ్యక్షులు డి శంకర్, నిర్మల, దేశ్ పాండే, ప్రఫుల్ రెడ్డి, శ్రీమతి అరుణ, చంద్రుడు యాదవ్, పి సుధాకర్ ముదిరాజ్, ధన్వంత, నీల వెంకటేష్, అనంతయ్య పాల్గొన్నారు

రూ.లక్ష సబ్సిడీ రుణం ఇతర బీసీ కులాలకు కూడా ఇవ్వాలి

- ప్రభుత్వం పది రోజుల్లో స్పందించాలి..లేదంటే ప్రగతిభవన్ ముట్టడి
- జాంబాగ్ యాదవ సంఘం డిమాండ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సమాజంలో ఉత్పత్తి కులలైన యదవులతో పాటు ఇతర బీసీ కులాలకు లక్ష రూపాయల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు యాదవ సంఘం రాష్ట్ర నాయకులు పాండు యాదవ్, జాంబాగ్ యాదవ సంఘం చైర్మెన్ నందకిషోర్ యాదవ్ అన్నారు. గురువారం జాంబాగ్‌లోని యాదవ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు తరహాలో బీసీలోని అన్ని కులాలకు బీసీ బంధు పథకం యాదవులతో పాటు ఇతర బీసీ కులాలకు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొర్రె పిల్లల పంపిణీ పేరిట రాష్ట్ర ప్రభుత్వం యాదవు లను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. చైర్మెన్ నందకిషోర్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవులకు పాడి పరిశ్రమ కోసం ప్రభుత్వం భూమి కేటాయించేలా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సీఎం కేసీఆర్‌కు చెప్పి భూమి యాదవులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రజకులకు, సెలూన్ షాపులకు ఉచిత కరెంట్ ఇస్తూ యాదవులు పశువులను పెంచుకుంటే కమర్షియల్ కరెంట్ చార్జీలు వేస్తున్నారని మండిపడ్డారు. 10 రోజుల్లో యాదవులతో పాటు ఇతర బీసీ కులాలకు రుణాలుపై సానుకూల ప్రకటన చేయకపోతే బీసీలను ఐక్యం చేసి ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తమ మాట వినకుంటే బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాంబాగ్ యాదవ సంఘం నాయకులు బి గోపాల్ యాదవ్, వి.రమేష్ యాదవ్. పి.రాజు యాదవ్. సత్యం యాదవ్. శ్రీశైలం యాదవ్, అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

బీఎడ్ విద్యార్థులకు న్యూ కోర్స్



నవతెలంగాణ-ఓయూ

బీఎడ్ విద్యార్థుల కోసం హోల్ చైల్డ్ డెవలప్‌మెంట్ కోర్సును అందించేందుకు అమెరికాలోని నోట్రే డామ్ విశ్వవిద్యాలయ అధ్యాపకుల బృందం గురువారం ఓయూ అధ్యాపకుల బృందంతో చర్చలు జరిపింది. ఈ మేరకు నోట్రే డేమ్ విశ్వవిద్యా లయ ఉపాధ్యక్షుడు, అసోసియేట్ ప్రొవోస్ట్ మైఖేల్ పిప్పెంగర్ నాయకత్వంలోని విద్యార్థుల సమగ్రాభివృద్ధి అంతర్జాతీయ కేంద్రం ప్రతినిధి బృందం ఓయూతో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకునేందుకు ప్రతిపాదించారు. ఇండియా ఇంటర్వెన్షన్స్ డైరెక్టర్ ధీరజ్ మెహ్రా, రుబీనా పాల్గొన్నారు. ఓయూ ప్రతినిధి బృందానికి వీసీ ప్రొ రవిందర్ యాదవ్, రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ, ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు ప్రొ. రవీంద్రనాథ్ కె. మూర్తి, ప్రొఫెసర్ మృణాళిని, ప్రొ. రామకృష్ణ సహా ప్రొ. ప్యాట్రిక్ పాల్గొన్నారు. యూనివర్శిటీ ఆఫ్ నోట్రే డామ్ ఫ్యాకల్టీ, హైదరాబాద్‌లోని ఇన్-పర్సన్ టీమ్ ద్వారా తరగతు లు ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహించాలని సమావేశంలో అంగీకరించారు. తరగతి గదిలో సంపూర్ణ శిశు అభివృద్ధి నమూనాల ఏకీకరణ రాష్ట్రంలోని భవిష్యత్తు విద్యావేత్తలకు ప్రయోజనం చేకూరుస్తుందని ఇరు పక్షాలు అభిప్రాయపడ్డాయి. తరగతి గదిలో బోధన సామాజిక-భావోద్వేగాల నుండి విద్యా నైపుణ్యాల వరకు విద్యార్థుల అభివృద్ధి అభ్యాసానికి సంబంధించిన అన్ని రంగాలకు మద్దతునిస్తుందని, తద్వారా పునాదులను సృష్టిస్తుందని వారు తెలియజేశారు.నోట్రే డామ్ విశ్వవిద్యాలయంలోని గ్లోబల్ సెంటర్ ఫర్ ది హోల్ చైల్డ్ చేస్తున్న కృషి, కార్యక్రమాలను ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి. లక్ష్మీనారాయణ అభినందించారు.

లాల్ దర్వాజా బోనాలు జూలై 7 నుండి ప్రారంభం



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

తెలంగాణలో అత్యంత వైభవంగా ప్రతిష్టాత్మకంగా జరుపుకునే పాతబస్తీ లాల్‌దర్వాజా శ్రీసింహ వాహిని అమ్మవారి బోనాల జాతర జూలై 7 నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సంవత్సరం 115వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయని దేవాలయ కమిటీ ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో తెలియజేశారు. తొలి రోజు శుక్రవారం ఉదయం గణపతి హోమం సప్తశతి పారాయణం, దేవి అభిషేకం, ధ్వజారోహణం, శిఖరపూజ సాయంత్రం కలిసోస్థాపన ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. జూలై 9వ తేదీ ఆదివారం సాయంత్రం శాలిబండ కాశి విశ్వేశ్వర దేవాలయం నుండి ఘటాలు ఊరేగింపుగా డబ్బు వాయిదాల మధ్య తీసుకొని వచ్చి ప్రతిష్టాపన జరుపుతారు తొమ్మిది రోజులపాటు వివిధ రూపాలలో అమ్మవారిని పూజలు నిర్వహిస్తారు. జూలై 16వ తేదీ అమ్మవారికి బోన సమర్పించి రాత్రికి ప్రపంచ శాంతి కోసం శాంతి కళ్యాణ్ చేస్తారు జూలై 17న పోతురాజు స్వాగతం భవిష్యవాణి వినిపించే రంగం అమ్మవారి బ్రహ్మాండమైన ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి. దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో జూన్ 19,20, 21 తేదీల్లో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించను న్నారు. 19వ తేదీ జులై తేదీన సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తెలంగాణ భవన్‌లో ఫోటో ఎగ్జిబిషన్ ప్రముఖులచే ప్రారంభోత్సవం. మంగళవారం 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఇండియా గేట్ నుండి అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకొని వచ్చి తెలంగాణ భవన్లో ప్రతిష్టాపన చేస్తారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు బంగారు బోనం సమర్పిస్తారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 100 మంది సంస్కృతి కళాకారులచే వివిధ రకాల కళారూపాలను ప్రదర్శిస్తారు సాయంత్రం 6 గంటలకు అంబేద్కర్ ఆడటోరియంలో ముగింపు కార్యక్రమం జరగనున్నాయి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ మెంబర్స్ ఈ వివరాలను తెలియజేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు చెన్నబోయిన రాజేందర్ యాదవ్ జనరల్ సెక్రటరీ మారుతి యాదవ్ సభ్యులు సదనన్ ముదిరాజ్ అరవింద్ కుమార్ గౌడ్ మాణిక్ ప్రభు మాజీ చైర్మన్ విజయానంద్ లక్ష్మి నారాయణ సిరరాజ్ కుమార్ సదానంద ముదిరాజ్ బంగ్లా రాజు తదితరులు పాల్గొన్నారు

దాడిని ఖండించిన ఎడ్ల సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్ ఇంటిని ముట్టడించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని బీఆర్ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్ రెడ్డి తెలిపారు. సిక్స్ నెంబర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత పార్టీ నాయకుల ఇండ్లపై దాడి చేయడం కరెక్ట్ కాదని ఏదైనా ఆరోపణలు చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చా అని ఇంటి ముట్టడి ఇంటిపై దాడి చేయడం కరెక్ట్ కాదని అన్నారు. గరిగంటి శ్రీదేవి రమేష్ మాట్లాడుతూ దళితులపై ఎక్కడ కించపరచలేదని వారి సంక్షేమ కోసం నా శాయశక్తుల వరకు కృషి చేశానని, నాఎదుగుదలకు వారే కారణం అని, దళితబంధులో బిల్డింగ్‌లు ఉన్నవారికి ఇచ్చి ఏమి లేని వారికి ఇవ్వలేదని అని మాత్రమే అన్నానని, అందువల్లే నా పైన దాడికి ప్రయత్నించడం దురదృష్టకరమని, దాడి చేసిన వారిపై స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని వారి పైన పార్టీ కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవి రెడ్డి విజితా రెడ్డి, నగేష్ గౌడ్, కే. మురళీ కృష్ణ, బోయ వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలనుపుర స్కరిం చుకొని కోఠి ఈఎన్‌టి ఆస్పత్రిలో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆడియా లజిస్ట్ డాక్టర్ డి.కే. వీణకు అవార్డు, ప్రశంస పత్రం అందజేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టం.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరిం చుకొని కోఠి ఈఎన్‌టి ఆస్పత్రిలో తెలంగాణ వైద్య ఆరోగ్య దినో త్సవం సందర్భంగా జూనియర్ అసిస్టెంట్ రవికి అవార్డు అందించి శాలువాతో ఘనంగా సన్మా నిస్తున్న సూపరింటెండెంట్ డాక్ట ర్ శంకర్. ఆర్ఎంఓ డాక్టర్ జయ మనోహరి తది తరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి

కౌన్సిలర్ తుడుం గణేష్

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ 4వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కౌన్సిలర్ తుడుం గణేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వార్డు పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు లైట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన వార్డు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. వార్డు అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి మల్లారెడ్డి, మున్సిపాల్టీ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డిలకు రుణపడి ఉంటానని తెలియజేశారు. వార్డులో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు

కలుషిత నీటి సమస్యను పరిశీలించిన జలమండలి మేనేజర్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గాంధీ నగర్ అంతంలోని నిశాంత్ పాఠశాల వీధిలో (రోడ్ నెంబర్ 8 రోడ్ నెంబర్) గత వారం రోజులుగా మంచినీటిలో కలుషిత నీరు సరఫరా కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక బస్తీవాసులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే స్థానిక సంక్షేమ సంఘం యువజన నాయకులు జల్దా లక్ష్మి నాథ్ జలమండలి మేనేజర్ పూజితతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. అందుకు స్పందించిన జలమండలి మేనేజర్ గురువారం జలమండలి సిబ్బందితో అక్కడికి చేరుకొని సమస్యను పరిశీలించారు. సిబ్బంది పైప్ లైన్ తొవ్వి కలుషిత నీరు ఎక్కడి నుండి వొస్తున్న దని గుర్తించారు. నీరు శుద్ధిగా వచ్చెల చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

దోపిడికి అడ్డాగా ప్రయివేట్ స్కూళ్లు..!

- పాఠశాలలను దుకాణాలుగా మార్చేసిన వైనం
- పుస్తకాల నుంచి షూస్ దాకా విక్రయం!
- మార్కెట్ కంటే రెండింతలు ధరలతో కోట్లలో దోపిడీ
- అడ్డగోలు ధరలకు బెంబేలెత్తుతున్న తల్లిదండ్రులు
- ఇంత జరుగుతున్న.. దిక్కులు చూస్తున్న విద్యాశాఖ



నవతెలంగాణ-సిటీబ్యూరో

బడులు షురువయ్యాయి. విద్యార్థులు ఇప్పుడిప్పుడే బడిబాట పడుతుండగా.. మరోవైపు ప్రయివేట్ విద్యాసంస్థల దోపిడీ పర్వం మొదలైంది. రకరకాల పేర్లతో పుట్టగొడుగులుగా పుట్టుకొస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్ల ధనార్జనే లక్ష్యంగా ఇబ్బడిముబ్బడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్ మొదలుకొని పిల్లలకు అందించే టై, బెల్టు, బూట్లు, దుస్తులు, వరకు ఆయా యాజమాన్యాలు నిర్ణయించిన ధర చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇంత బహిరంగంగా విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నా.. ఈ విషయం తెలిసినా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు సర్కారు బడుల్లోనే తమ పిల్లలను చదివించాలంటూ ఎంతో ఉత్సాహంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిలువు దోపిడీ షురూ చేశాయి. పుస్తకాలు, యూనిఫాంలు, బెల్ట్, టై, సాక్స్, షూస్ తదితర ధరలతో పాటు ఫీజులను 20 నుంచి 30శాతం వరకు పెంచి అందినకాడికి దండుకుంటున్నాయి. బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తామంటే వీల్లేదని నిబంధనలు పెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదులుతున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లు పడుతుండగా.. ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలు పండుగ చేసుకుంటున్నాయి.

మార్కెట్‌లో కంటే రెండింతల ధరలకు..

నగరంలో 1896 ప్రయివేట్ విద్యాసంస్థల్లో 6.86 లక్షల మంది చదువుతున్నారు. 691 ప్రభుత్వ పాఠశాలల్లో 1,14,607 మంది, ఎయిడెట్ పాఠశాలల్లో 50వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు ఉచితంగా సరఫరా చేస్తుండగా.. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు మాత్రం వారికి ఇష్టమైన ధరలకు అమ్ముకుంటున్నారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు, బూట్లు, దుస్తులు, టైలు, బ్యాడ్జీలు, గుర్తింపు కార్డులు, బ్యాగులు, పెన్నులు, కవర్లు, పెన్సిళ్లు ఇలా అన్ని రకాల వస్తు సామాగ్రికి రూ. 6వేల నుంచి 10వేల వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలకు ధరల్లో వేలల్లో వ్యత్యాసం ఉంటుంది. అంతేగాక ఈ పాఠశాలల్లో విక్రయించే పాఠ్యపుస్తకాలు మార్కెట్‌లో ఎక్కడా దొరక్కుండా జాగ్రత్త పడుతున్నారు. తమ వద్ద అన్ని కొనుగోలు చేస్తేనే పాఠ్యపుస్తకాలు ఇస్తామని మెలిక పెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

తనిఖీలేవి..?

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ.. యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నా.. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ దోపిడీపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేస్తే.. తూతుమంత్రంగా ఆ పాఠశాలను తనిఖీ చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. నిజానికి ప్రయివేట్ స్కూళ్ల యాజమాన్యాల బహిరంగ దోపిడీ గురించి అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమంగా పుస్తకాలు, యూనిఫామ్స్ తదితర వస్తువులు అమ్ముకుంటూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రయివేట్ కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

హైదరాబాద్ జిల్లాలోని ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ముషీరాబాద్‌లోని కార్పొరేట్ శ్రీచైతన్య స్కూల్ గుర్తింపు లేకుండా నడుస్తుండటంతో పాటు బుక్స్, యూనిఫాంల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నదని గురువారం ఆ స్కూల్ ఎదుట నగర ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాంలు కిరాణా దుకాణాల్లో అమ్మినట్టుగా విక్రయిస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఒకే గుర్తింపుతో అనేక శాఖలు నిర్వహిస్తూ.. అడ్మిషన్లు తీసుకుంటూ తల్లిదండ్రులను మోసం చేస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడిపిస్తున్న ప్రయివేట్ స్కూళ్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ చేగువేరా, అంబర్‌పేట్ సెక్రెటరీ నాగేందర్, స్టాలిన్ ఏసుదాసు, శివ తదితరులు పాల్గొన్నారు.



దిల్ కుష్ నగర్ అంతర్గత రోడ్లకు మహర్దశ



- ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు
- వీడీసీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్ కుష్ నగర్, జేపీఆర్ కాలనీలలో ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి రూ.1 కోటి 24 లక్షల వ్యయంతో పలు వీడీసీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీరోజు నియోజకవర్గంలో ఎక్కడో ఒకచోట అభివృద్ధి కార్యక్రమం జరుగుతూనే ఉందని, అంతేకాకుండా ప్రజలు ఫలానా ప్రాంతంలో సమస్య ఉందని చెప్పగానే సంబంధిత అధికారులతో పర్యవేక్షించి వెంటనే నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా ప్రజలకు సంబంధించిన మౌలిక సదుపాయాలకు ఇబ్బందులు ఉన్న ఎడల తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అలాగే నియోజకవర్గంలో మంచినీటి సమస్య రాకుండా ఎక్కడికక్కడ అతిపెద్ద నీటి ట్యాంకులు నిర్మించామన్నారు. ప్రతి ఒక్కరూ జరుగుతున్న అభివృద్ధిని గమనించాలన్నారు. ఒకప్పుడు రోడ్లు వేయాలంటే నిధులు మంజూరుకు రోజులు తరబడి వేచి ఉండాల్సి వచ్చే దని, కానీ నేడు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసి చకచకా పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా దిల్ఖుష్ నగర్‌లో విద్యుత్ సమస్య ఉందని ప్రజల విజ్ఞప్తి మేరకు తగిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అధికారులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులు, ఎలక్ట్రికల్ అధికారులతో పాటు స్థానిక కాలనీల అసోసియేషన్ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్స్ ప్రారంభం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

"లక్ష్యం ది స్కూల్" 2023 - 2024కు గాను అడ్మిషన్స్ ప్రారంభం అయినట్టు స్కూల్ ప్రిన్సిపల్ అనుపమ మహి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా పదో తరగతి ప్రారంభించినట్లు తెలిపా రు. ఈ స్కూల్లో ప్రాక్టికల్ బోధన విధానం, స్పోర్ట్స్, కమ్యూనికేషన్ మెగా ఆకర్షణీయం. గత సంవత్సరం సైన్స్ ఎక్స్ పో, సాంస్కృతిక కార్యక్రమాలు మండల్ లెవల్‌లో వివిధ విభాగాల్లో విజేతలుగా విద్యార్థులు నిలిచారన్నారు. ఈ సంవత్సరం అడ్మిషన్స్‌కు సంప్రదించవ లసిన ఫోన్ నంబర్లు : 9640265678, 9866523338 అని తెలిపారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తున్నాం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాజకీయాలకతీతంగా ప్రజల సహాయ సహకారాలతో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలో "ప్రగతి యాత్ర"లో భాగంగా 77 వ రోజుకార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్‌తో కలిసి పట్వారి ఎంక్లేవ్ లో పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులు, పార్క్‌ను పరిశీలించారు. ముందుగా రూ.35 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాగా భూగర్భ డ్రయినేజీ అభివృద్ధి చేసినందుకు, సీసీ రోడ్డు ఏర్పాటుకు సహకారం అందిస్తున్నందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. పార్క్ అభివృద్ధికి కృషి చేయాలని కోరగా.. అక్కడే ఉన్న అధికారులకు సత్వరమే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె. జయరామ్, పట్వారి ఎంక్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మద్దునూరి వెంకటేష్, బీఆర్ఎస్ స్థానిక డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్ లను కాలనీవాసులు సన్మానించారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శంభీపూర్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్దేశించిన సమయం లోపల పరిష్కరించాలి

- కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన సమయం లోపల పరిష్కరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత వార్డు అధికారులను ఆదేశించారు. గురువారం మూసాపేట, కూకట్ పల్లి సర్కిళ్ళ వార్డు కార్పొరేటర్లకు, వారి వార్డుకు సంబంధించిన వార్డు అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ వార్డు అధికారులంతా ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. కార్యాలయం సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. కార్పొరేటర్లు మాట్లాడుతూ అధికార వికేంద్రీకరణలో భాగంగా పౌరుల వద్దకే పరిపాలన తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు. పౌరుల సమస్యలను తక్షణమే పరిష్కరించి హైదరాబాద్ మహనగరంలో పౌర సదుపా యాలు మెరుగుపరచడం జరుగుతుందన్నారు. వివిధ శాఖలకు చెందిన వార్డు అధికా రులంతా సమన్వయంతో పని చేసి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఎం.శ్రీనివాస్ రావు, శీరిష, సభిహా బేగం, మహేందర్, సతీష్ గౌడ్, ఎం.నర్సింహ యాదవ్, రవీందర్ రెడ్డి, జె.సత్యనారాయణ రావు, ఎస్.శ్రీనివాస్ రావు, ఎస్ఈ చిన్న రెడ్డి, ఉప కమిషనర్లు రవికుమార్, రవీందర్ కుమార్, ఈఈ గోవర్ధన్, డీడీ పద్మనాభం, కె.శ్రీకాంత్ రెడ్డి, సొల్మెన్ రాజు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, సహాయ మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కాంగ్రెస్ ఎప్పుడూ ప్రాధాన్యత కల్పిస్తుంది

- టీపీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్‌లోని రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి నివాసంలో గురువారం పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి చేతుల మీదుగా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన మహిళా బ్లాక్ డివిజన్ కమిటీ అధ్యక్షులకు నియామ కప త్రాలను అందజేశారు. ఏ బ్లాక్ అధ్యక్షురాలుగా రమాదేవి, బీబ్లాక్ అధ్యక్షురాలిగా శోభ, బోయిన్‌పల్లి డివిజన్ అధ్యక్షు రాలు విజయ లక్ష్మి, బాలానగర్ డివిజన్ అధ్యక్షురాలు రేణుక, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షురాలు క్రిష్ణవేణి, బాలాజీ డివిజన్ అధ్యక్షురాలు మారుతీ, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షు రాలు భారతమ్మలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ మహిళలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉంటూ సమాన గౌరవమి స్తుందని, మహిళ లకు వడ్డీ లేని ఋణాలను కల్పించింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తిచేసింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి మండలిలో మహిళలకి ఎక్కువ స్థానాలను ఇచ్చి గౌరవం కల్పించిందని తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరి కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరచాలని, మహిళలు రాజకీయాల్లో రాణించటానికి కాంగ్రెస్ మొదటి నుంచి కృషి చేసిందని, సహాయ సహకారాలు అందిస్తామన్నారు.



జెన్ నెక్స్ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పాఠశాలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో కూడుకొన్న సదుపాయం అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో జెన్ నెక్స్ స్కూల్ ప్రారంభోత్సవానికి ఆయనతో పాటు స్థానిక కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ మహమ్మద్ గౌసుద్దీన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి స్కూల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పాఠశాలలు నిర్వ హించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల అయిలయ్య, కో ఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, పిల్లి తిరుపతి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, కాశీనాథ్ చారి, వెంకటేశ్వర్లు, సుదర్శన్ గుప్తా, యూసఫ్, రమేష్, శ్రీనివాస్ చారి, రవీందర్ రెడ్డి, కమ్మరి శ్రీనివాస్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్ నగర్, ఆదిత్య నగర్, జై భారత్ నగర్, హైదర్ నగర్ కాలనీలలో రూ. 1 కోటి 93 లక్షల 40 వేల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్లు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావులు ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గ దర్శకంలో, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ వంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాన న్నారు. సాయి ప్రశాంత్ నగర్ కాలనీ లో రూ.21.60 లక్షలతో సీసీ రోడ్డు పునరు ద్ధరణ నిర్మాణ పనులకు, ఆదిత్య నగర్ కాలనీలో రూ.82.00 లక్షల తో సీసీ రోడ్డు పునరుద్ధరణ నిర్మాణ పనులకు, జై భారత్ నగర్ కాలనీలో రూ.32.50 లక్షల వ్య యంతో సీసీ రోడ్డు పునరుద్దరణ నిర్మాణ పనులకు, హైదర్ నగర్‌లో రూ.57.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పునరు ద్ధరణ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ హైదర్ నగర్ డివిజన్ నాయ కులు, కార్యకర్తలు, వార్డ్ మెంబర్లు, ఏరియా కమిటీ మెంబ ర్లు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల ప్రతిని ధులు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్, ప్రణయ్

● రెండో రౌండ్లో సింధు పరాజయం ● ఇండోనేషియా ఓపెన్

జకర్తా (ఇండోనేషియా)



భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారిణి, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి సింధు వైఫల్య యాత్ర కొనసాగుతుంది. గత రెండు టోర్నీల్లో తొలి రౌండ్లోనే నిష్క్రమించిన సింధు.. తాజాగా ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్‌లో రెండో రౌండ్లో ఓటమి పాలైంది. పి.వి సింధు పరాజయంతో మహిళల సింగిల్స్‌లో భారత టైటిల్ ఆశలకు తెరపడింది. చైనీస్ తైపీ స్టార్ షట్లర్ తైజుయింగ్‌తో ప్రీ క్వార్టర్‌ఫైనల్లో 18-21, 16-21తో సింధు తడబాటుకు గురైంది. 39 నిమిషాల్లో ముగిసిన ప్రీ క్వార్టర్స్‌లో సింధు పెద్దగా ప్రతిఘటించలేదు. రెండు గేముల్లోనూ తైజుయింగ్ అలవోకగానే గెలుపొందింది. ఈ విజయంతో సింధుపై ముఖాముఖి రికార్డును 19-5తో మరింత మెరుగుపర్చుకుంది. సైనా నెహ్వాల్ ఇండోనేషియా ఓపెన్‌కు దూరం కాగా, యువ షట్లర్ ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్లో కొరియా అమ్మాయి యంగ్ చేతిలో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

పురుషుల సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్ ప్రణయ్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. తొలుత ఆల్ ఇండియన్ క్వార్టర్‌ఫైనల్లో సహచర, యువ షట్లర్ లక్ష్యసేన్‌పై కిదాంబి శ్రీకాంత్ వరుస గేముల్లో గెలుపొందాడు. 21-17, 22-20తో 45 నిమిషాల్లోనే క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు. తొలి గేమ్‌లో 16-16 వరకు శ్రీకాంత్, లక్ష్యసేన్ సమవుజ్జీలుగా నిలిచినా.. ఆ తర్వాత కిదాంబి అనుభవంతో ముందంజ వేశాడు. వరుస పాయింట్లతో 21-17తో తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లోనూ 13-13 వరకు ఆధిపత్యం ఎవరికీ దక్కలేదు. ఈ సమయంలో వరుసగా ఆరు పాయింట్లు సాధించిన కిదాంబి శ్రీకాంత్ 19-13తో తిరుగులేని ఆధిక్యం సాధించాడు. గొప్పగా పుంజుకున్న లక్ష్యసేన్ తనూ వరుసగా ఆరు పాయింట్లు కైవసం చేసుకుని.. కిదాంబిని మ్యాచ్ పాయింట్ వద్ద నిలువరించాడు. 20-20తో స్కోరు సమం చేశాడు. వరుస పాయింట్లతో ఉత్కంఠకు తెరదించిన శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ 21-18, 21-16తో ప్రీ క్వార్టర్స్‌లో గెలుపొందాడు. హాంగ్‌కాంగ్ ఆటగాడు ఆంగస్ లాంగ్‌పై వరుస గేముల్లోనే పైచేయి సాధించాడు. యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ ప్రీ క్వార్టర్స్‌లో పరాజయం పాలయ్యాడు. ఇండోనేషియా ఆటగాడు ఆంటోనితో మూడు గేముల పోరులో పోరాడి ఓడాడు. 22-20, 15-21, 15-21తో ఆంటోనికి గట్టి పోటీ ఇచ్చాడు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ 21-17, 21-15తో విజయం సాధించింది. చైనా జోడీ హీ జి టింగ్, హావో డాంగ్‌లపై వరుస గేముల్లో గెలుపొంది క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లారు. నేడు జరిగే మ్యాచ్‌లో టాప్ సీడ్ జోడీతో మనోళ్లు పోటీపడనున్నారు.

నవచిత్రం



ఓ అందగత్తె ప్రేమ కథ

చిగురుపాటి క్రియేషన్స్ బ్యానర్‌పై ఎం.ఎస్. చంద్ర, హరిలు హీరోలుగా అక్షఖాన్ హీరోయిన్‌గా చిగురుపాటి సుబ్రమణ్యం రచన, సాహిత్యం, స్క్రీన్‌ప్లేతో స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'నెల్లూరి నెరజాణ'. 'ఓ అందగత్తె ప్రేమకథ' అనేది ట్యాగ్‌లైన్. 175 మందికి పైగా కొత్త వారితో, ఐదుగురు ప్యాడింగ్ ఆర్టిస్టులతో నిర్మించిన ఈ చిత్రం టీజర్, ఫస్ట్‌లుక్ కార్యక్రమం ప్రసాద్‌ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. డైరెక్టర్ నాగ్‌అశ్విన్ ముఖ్య అతిథిగా విచ్చేసి టీజర్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం నాగ్ అశ్విన్ మాట్లాడుతూ... చిగురుపాటి సుబ్రమణ్యం నా దగ్గర ఓ వెబ్ సిరీస్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ఈ సినిమాను తెరకెక్కించటానికి చాలా కష్టపడ్డాడు. ఇంతకు ముందు ఒక సినిమా డైరెక్ట్ చేశాడు. మంచి టాలెంట్ ఉన్న వ్యక్తి. టీం అందరూ ఎంత కష్టపడ్డారో ఈ ట్రైలర్ చూస్తుంటేనే అర్థమౌతోంది. తప్పకుండా ఈ సినిమా మంచి విజయం సాధించి అందరికీ గొప్ప లైఫ్‌ను ఇవ్వాలని కోరుకుంటున్నా అన్నారు.

హీరో ఎం.ఎస్. చంద్ర మాట్లాడుతూ... మమ్మల్ని ఆశీర్వదించటానికి వచ్చిన నాగ్ అశ్విన్ గారికి కృతజ్ఞతలు. నాకు ఈ అవకాశం ఇచ్చిన చిగురుపాటి సుబ్రమణ్యంకి థ్యాంక్స్. ఆయన మా దర్శకుడు అనడం కన్నా.. గురువు అంటేనే బాగుంటుంది అన్నారు.

మరో హీరో హరి మాట్లాడుతూ... నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ సుబ్రమణ్యంకి ఎప్పటికీ రుణపడి ఉంటా. అందరం చాలా కష్టపడి సినిమా చేశాం. ప్రేక్షకులు సూపర్‌హిట్ చేస్తారని ఆశిస్తున్నాను అన్నారు.

దర్శక, నిర్మాత చిగురుపాటి సుబ్రమణ్యం మాట్లాడుతూ... మమ్మల్ని ఆశీర్వదించటానికి వచ్చిన నాగ్ అశ్విన్‌కి మా యూనిట్ తరపున కృతజ్ఞతలు. ఈ చిత్రానికి నాతోపాటు యూనిట్ మొత్తం చాలా కష్టపడింది. సంవత్సర కాలంగా మాకు ఈ సినిమానే జీవితం అయిపోయింది. ఇందులో నటించిన ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ అందరూ డబ్బులు ప్రధానంగా చూడకుండా పని చేశారు. సినిమా అంతా నెల్లూరు యాసలో సాగుతుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా మొత్తం మాకు చాలా సహకరించింది. ఈ సినిమాను ఆదరించండి... తప్పకుండా ప్రేక్షకులకు నచ్చే సినిమాలనే తీస్తాను. మొత్తం 5 పాటలు, 6 ఫైట్‌లు ఉంటాయి. ప్రతి ఆర్టిస్ట్, టెక్నీషియన్ తమ స్వంత సినిమాగా భావించి పనిచేశారు. ఇంతమంది ఇంత ప్రేమతో చేసిన ఈ 'నెల్లూరి నెరజాణ'ను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం నాకుంది అన్నారు.

4 పాక్‌లో, 9 లంకలో..

● ఆసియా కప్ హైబ్రిడ్ మోడల్
● సెప్టెంబర్ 17న ఫైనల్ పోరు



దుబాయ్ : ఆసియా కప్ 2023పై పీటముడి వీడింది. పాకిస్థాన్ గడ్డపై ఆడేందుకు భారత్ నిరాకరించటంతో.. హైబ్రిడ్ మోడల్ ఆతిథ్య ప్రతిపాదనతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) రాజీకొచ్చిన సంగతి తెలిసిందే. పీసీబీ రూపొందించిన హైబ్రిడ్ మోడల్‌ను ఆసియా క్రికెట్ కమిటీ (ఏసీసీ) తాజాగా ఆమోదించింది. ఆగస్టు 31న తొలి మ్యాచ్‌తో ఆరంభ కానున్న ఆసియా కప్.. సెప్టెంబర్ 17న టైటిల్ పోరుతో ముగియనుంది. హైబ్రిడ్ మోడల్ విధానంలో భాగంగా ఫైనల్ సహా 13 మ్యాచుల ఆసియా కప్‌లో.. నాలుగు మ్యాచులు పాకిస్థాన్‌లో జరుగనుండగా.. తొమ్మిది మ్యాచులకు శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు ఏసీసీ అధికారిక ప్రకటనలో తెలిపింది. 2008 తర్వాత తొలిసారి మల్టీ నేషన్ టోర్నమెంట్ పాకిస్థాన్‌లో జరుగనుంది. హైబ్రిడ్ మోడల్ విధానం ఆవిష్కరించిన ఏసీసీ.. పూర్తి స్థాయి షెడ్యూల్‌ను ఇంకా విడుదల చేయాల్సి ఉంది. 2023 ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్, నేపాల్ ఓ గ్రూప్‌లో ఉండగా.. డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లో మరో గ్రూప్‌లో ఉన్నాయి. గ్రూప్ దశలో టాప్-2 జట్లు సూపర్ 4 దశకు చేరుకుంటాయి. సూపర్ 4 దశలో ప్రతి జట్టు మరో జట్టుతో ఓ మ్యాచ్‌లో తలపడనుంది. సూపర్ 4లో టాప్-2 జట్లు ఫైనల్లో తలపడతాయి.

టీటీ ఆడుతూ, స్విమ్మింగ్ చేస్తూ!

వేగంగా కోలుకుంటున్న రిషబ్ పంత్



బెంగళూర్ : కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న యువ క్రికెటర్ రిషబ్ పంత్.. అంచనాలను మించి ఆరోగ్య పురోగతి సాధిస్తున్నట్టు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) వర్గాలు చెబుతున్నాయి. గత డిసెంబర్‌లో ప్రమాదానికి గురైన పంత్ ముంబయిలోని ఓ ఆసుపత్రిలో పలు శస్త్రచికిత్సలు చేసుకున్నాడు. అనంతరం బెంగళూర్‌లోని ఎన్‌సీఏలో రిహాబిలిటేషన్‌లో గడుపుతున్నాడు. రిషబ్ పంత్ వైద్య బృందం ఊహించిన గడువుకు ముందే మంచిగా కోలుకుంటున్నాడు. సాధారణ కసరత్తులతో పాటు టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్‌ను రిషబ్ పంత్ క్రమంగా పాటిస్తున్నట్టు ఎన్‌సీఏ వర్గాల సమాచారం. కర్ర సాయం లేకుండానే నడుస్తున్న పంత్.. ఇటీవల మెట్లను సైతం అవలీలగా ఎక్కుతున్నాడు. ఈ ఏడాది వన్డే వరల్డ్‌కప్‌కు సిద్ధమయ్యేలా రిషబ్ పంత్ రిహాబిలిటేషన్ ప్రణాళిక రూపొందించారు. ఇక శస్త్రచికిత్సలు విజయవంతం కావటంతో జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్ సైతం ఎన్‌సీఏకు చేరుకున్నారు. రిహాబిలిటేషన్‌లో భాగంగా బుమ్రా ఇప్పటికే తేలికపాటి బౌలింగ్ సాధన చేస్తుండగా.. శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ సాధనకు సిద్ధమవుతున్నాడు. బుమ్రా, శ్రేయస్‌లు ఆసియా కప్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తుంది.

అగ్రస్థానంలో తెలుగు టాలన్స్




జైపూర్ : తెలుగు టాలన్స్ టాప్ లేపింది. ఢిల్లీ పాంజర్స్‌పై 26-23తో ఘన విజయం సాధించిన తెలుగు టాలన్స్.. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్) పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్ దశలో ఆరు మ్యాచుల్లో నాల్గో విజయం నమోదు చేసిన టాలన్స్ సత్తా చాటింది. గోల్‌కీపర్ రాహుల్ మెరుపు ప్రదర్శనకు తోడు దేవిందర్ సింగ్ భుల్లార్, నసీబ్, రఘు, మోహిత్ కుమార్‌లు రాణించటంతో ఢిల్లీ పాంజర్స్‌పై తెలుగు టాలన్స్ ప్రతీకార విజయం సాధించింది.



నేడు దోస్త్ సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ, బీసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) తొలివిడత సీట్ల కేటాయింపు శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ హాజరవుతారు. దోస్త్ తొలివిడతలో 1,05,933 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 96,361 మంది ఫీజు చెల్లించారని, 88,181 మంది దరఖాస్తు ఫారం నింపారు. వారిలో 78,495 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారు.





లాసెట్‌లో 29,049 మంది ఉత్తీర్ణత

● ఫలితాలు విడుదల చేసిన లింబాద్రి
● 26 లా కాలేజీల్లో 7,560 సీట్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ రాతపరీక్షల ఫలితాలను గురువారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. లాసెట్‌కు 43,692 మంది దరఖాస్తు చేయగా, 36,218 మంది పరీక్ష రాశారు. వారిలో 29,049 (80.21 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 31,022 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 25,586 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 20,930 (81.80 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 12,667 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 10,629 మంది పరీక్ష రాశారు. వారిలో 8,117 (76.37 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు చేస్తే, ముగ్గురూ పరీక్షకు హాజరయ్యారు. వారిలో ఇద్దరు (66.67 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మూడేండ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సుకు 31,485 మంది దరఖాస్తు చేయగా, 25,747 మంది పరీక్ష రాశారు. వారిలో 20,234 (78.59 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఐదేండ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సుకు 8,858 మంది దరఖాస్తు చేస్తే, 7,529 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 6,039 (80.21 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఎల్‌ఎల్‌ఎం కోర్సుకు 3,349 మంది దరఖాస్తు చేయగా, 2,942 మంది పరీక్ష రాశారు. వారిలో 2,776 (94.36 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ర్యాంకు కార్డుల కోసం https://lawcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. లింబాద్రి, ఓయూ వీసీ డి రవీందర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 26 లా కాలేజీలున్నాయని చెప్పారు. మూడేండ్ల లా కోర్సుకు సంబంధించి 23 కాలేజీల్లో 4,630 సీట్లు, ఐదేండ్ల లా కోర్సులకు చెందిన 18 కాలేజీల్లో రెండు వేల సీట్లు, ఎల్‌ఎల్‌ఎం లా కోర్సుకు సంబంధించిన 19 కాలేజీల్లో 930 సీట్లు కలిపి మొత్తం 7,560 సీట్లున్నాయని వివరించారు. గతేడాది 6,235 సీట్లు భర్తీ అయ్యాయని అన్నారు. 1,325 సీట్లు మిగిలాయని వివరించారు. రాష్ట్రంలోని లా కాలేజీలన్నింటికీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) గుర్తింపు ఉందన్నారు. రాష్ట్రంలో గుర్తింపు లేకుండా లా కాలేజీల్లేవని చెప్పారు.

లాసెట్ ఫలితాల వివరాలు


	దరఖాస్తు	హాజరు	ఉత్తీర్ణత	శాతం
అబ్బాయిలు	31,022	25,586	20,930	81.80
అమ్మాయిలు	12,667	10,629	8,117	76.37
ట్రాన్స్‌జెండర్లు	3	3	2	66.67
మొత్తం	43,692	36,218	29,049	80.21

లా కోర్సుల వారీగా ఉత్తీర్ణత వివరాలు

కోర్సు	దరఖాస్తు	హాజరు	ఉత్తీర్ణత	శాతం
ఎల్‌ఎల్‌బీ 3 ఏండ్లు	31,485	25,747	20,234	78.59
ఎల్‌ఎల్‌బీ 5 ఏండ్లు	8,858	7,529	6,039	80.21
ఎల్‌ఎల్‌ఎం	3,349	2,942	2,776	94.36
మొత్తం	43,692	36,218	29,049	80.21

64 ఏండ్ల అభ్యర్థి దరఖాస్తు

లా కోర్సుకు భారీగా డిమాండ్ ఉందని లింబాద్రి, రవీందర్ అన్నారు. ఎల్‌ఎల్‌ఎం కోర్సులో చేరేందుకు 64 ఏండ్ల అభ్యర్థి దరఖాస్తు చేశారని వివరించారు. దీనికి 16 నుంచి 22 ఏండ్ల వారు 126 మంది దరఖాస్తు చేస్తే, 120 మంది, 23 నుంచి 30 ఏండ్ల వారు 1,365 మంది దరఖాస్తు చేయగా, 1,175 మంది, 31 నుంచి 40 ఏండ్ల వారు 1,100 మంది దరఖాస్తు చేస్తే, 878 మంది, 41 నుంచి 50 ఏండ్ల వారు 530 మంది దరఖాస్తు చేయగా, 422 మంది, 51 నుంచి 60 ఏండ్ల వారు 151 మంది దరఖాస్తు చేస్తే, 116 మంది, 60 ఏండ్లు పైబడిన వారు 77 మంది దరఖాస్తు చేయగా, 65 మంది ఉత్తీర్ణత పొందారని వివరించారు. ఎల్‌ఎల్‌బీ మూడేండ్ల కోర్సుకు సంబంధించి 1961లో పుట్టినతేదీ వ్యక్తి (62 ఏండ్లు) దరఖాస్తు చేశారని అన్నారు. దీనికి 16 నుంచి 22 ఏండ్ల వరకు 3,380 మంది దరఖాస్తు చేస్తే, 2,225 మంది, 23 నుంచి 30 ఏండ్ల వారు 12,689 మంది దరఖాస్తు చేయగా, 8,421 మంది, 31 నుంచి 40 ఏండ్ల వరకు 11,239 మంది దరఖాస్తు చేస్తే, 7,013 మంది, 41 నుంచి 50 ఏండ్ల వరకు 3,243 మంది దరఖాస్తు చేయగా, 1,999 మంది, 51 నుంచి 60 ఏండ్ల వరకు 691 మంది దరఖాస్తు చేస్తే, 427 మంది, 60 ఏండ్లకుపైగా 243 మంది దరఖాస్తు చేయగా, 149 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఐదేండ్ల లా కోర్సుకు 16 నుంచి 22 ఏండ్ల వారు 5,566 మంది దరఖాస్తు చేస్తే, 3,767 మంది, 23 నుంచి 30 ఏండ్ల వారు 1,958 మంది దరఖాస్తు చేయగా, 1,338 మంది, 31 నుంచి 40 ఏండ్ల వారు 985 మంది దరఖాస్తు చేస్తే, 685 మంది, 41 నుంచి 50 ఏండ్ల వారు 264 మంది దరఖాస్తు చేయగా, 187 మంది, 51 నుంచి 60 ఏండ్ల వారు 71 మంది దరఖాస్తు చేస్తే 53 మంది, 60 ఏండ్లు పైబడిన వారు 14 మంది దరఖాస్తు చేయగా, తొమ్మిది మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి, మాజీ కన్వీనర్ జీబీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఆర్జీయూకేటీకి ఏమైంది..?



ఏడాదిలో నలుగురు విద్యార్థులు బలవన్మరణం

- నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృతి
- యూనివర్సిటీలో వరుస వివాదాలతో అప్రతిష్ట
- సమస్యలపై స్పందించని యాజమాన్యం, ప్రభుత్వం
- గతేడాది వారం రోజులు ఆందోళన చేసిన విద్యార్థులు
- అమలుకాని విద్యాశాఖ మంత్రి హామీలు

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. తరచూ విషాద ఘటనలు జరుగుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. వరుస వివాదాలతో యూనివర్సిటీ అప్రతిష్టపాలవుతోంది. నాలుగు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు మృతిచెందడం తోటి విద్యార్థులు, తల్లిదండ్రులను కలిచివేస్తోంది. నాలుగు రోజుల కిందట దీపిక ఆత్మహత్య చేసుకుంది. తాజాగా పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన బూర లిఖిత గురువారం హాస్టల్ భవనం నుంచి పడి మృతిచెందడం తీవ్ర విషాదం నింపింది. ఏడాదిలో నలుగురు విద్యార్థులు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ యూనివర్సిటీ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 20మంది వరకు మృతిచెందినట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, సమస్యలపై గతేడాది విద్యార్థులు వారం రోజులు నిరవధికంగా ఆందోళన చేసిన విషయం విదితమే. చివరకు విద్యాశాఖ మంత్రి స్పందించి విద్యార్థులతో చర్చలు జరిపి.. డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఒక్కటీ అమలు చేయలేదు.

నవతెలంగాణ-బాసర

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తలమానికంగా ఉన్న బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీ తరచూ వివాదాలతో వార్తల్లోకెక్కుతోంది. ముఖ్యంగా విద్యార్థుల వరుస మరణాలు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థులు వివిధ కారణాలతో మృతిచెందారు. రాథోడ్ సురేష్, భానుప్రసాద్ వ్యక్తిగత కారణాలు, ప్రేమ వ్యవహారాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలియగా.. యూనివర్సిటీ అధికారుల వేధింపులు కారణంగానే బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరేసుకొని దీపిక ఆత్మహత్య చేసుకుందని తండ్రి వీరన్న ఆరోపించారు. వార్షిక పరీక్షల సందర్భంగా దీపిక సెల్‌ఫోన్‌లో కాపీయింగ్ పాల్పడుతుండగా పట్టుబడినట్టు యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా, లిఖిత గురువారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో నాల్గో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్టు యూనివర్సిటీ అధికారులు చెబుతుండగా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. విద్యార్థుల మరణాలు తల్లిదండ్రులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయి. యూనివర్సిటీ హాస్టళ్లలో వార్డెన్ల సరైన పర్యవేక్షణ లేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలపై స్పందించని ప్రభుత్వం

విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం గత సంవత్సరం ఇదే నెలలో వారం రోజులపాటు ఆందోళన చేపట్టారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిరసన చేపట్టారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. చివరకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి యూనివర్సిటీకి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని తరగతులకు హాజరుకావాలని సూచించారు.

ప్రధానంగా యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ ఛాన్స్‌లర్‌ను నియమించాలని, విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకుల భర్తీ, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, నూతనంగా మెస్‌లు ఏర్పాటు చేయాలని, యూనిఫామ్స్ అందజేయాలని, పీఈటీలను నియమించాలని కోరారు. ఈ డిమాండ్లలో ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్కటీ నెరవేర్చలేదు. రెగ్యులర్ వీసీకి బదులు ఇన్‌చార్జి డైరెక్టర్‌ను నియమించి చేతులు దులుపుకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డైరెక్టర్ పదవీ కాలం కూడా మరికొన్ని రోజుల్లో ముగియనుందని తెలుస్తోంది. మిగతా డిమాండ్లను పట్టించుకోవడం లేదు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ యూనివర్సిటీలో పర్యటించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. త్వరలోనే మెస్‌లను మారుస్తామని హామీ ఇచ్చినా అది కూడా నెరవేరకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

యువత నిరంతరం పోరాటాలు సాగించాలి

- ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

నిరుద్యోగులను మోసం చేసే పాలకులపై యువత నిరంతరం పోరాటాలు కొనసాగించాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ పిలుపునిచ్చారు. ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో గురువారం ఏఐవైఎఫ్ రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి నిరుద్యోగుల భవిష్యత్‌పై చిత్తశుద్ధి లేదని, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రిక్రూట్‌మెంట్ బోర్డ్ పోటీ పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించలేక పోయిందని ఆరోపించారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపర్చలేని ప్రభుత్వ పథకాలు అవసరం లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలను నిర్మించాలని తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సీఎం కేసీఆర్ నిరంకుశ విధానాలపై యువత సంఘటిత ఉద్యమాల్లో పాల్గొనాలని, ఉపాధి కల్పించే వారికే రానున్న ఎన్నికల్లో ఓటు అనే నినాదంతో యువతను చైతన్యపర్చనున్నామని తెలిపారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఆఫీస్ బేరర్స్ నెర్లకంటి శ్రీకాంత్, కనుకుంట్ల శంకర్, లింగం రవి, వెంకటేశ్వర్లు, యుగంధర్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, సత్యప్రసాద్, ఆర్.బాలకృష్ణ, బిజ్జ శ్రీనివాస్, లక్ష్మణ్, కిషోర్, సల్మాన్, మహేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీ 20 దేశాలతో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధం

- వ్యవసాయ మంత్రుల సమావేశంలో తోమర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయంలోని వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలను కనుగొనేందుకు జీ 20 దేశాలతో కలిసి పని చేసేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీనోవాటెల్‌లో నిర్వహించిన జీ20-వ్యవసాయ మంత్రుల సమావేశానంతరం తోమర్ మాట్లాడారు. వ్యవసాయ రంగంలో భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను కనుగొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఎక్కువ ఆదాయాన్ని పొందేందుకు, నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. రాబోయే సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా కూడా రైతులు ఈ మార్పులను స్వీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సేంద్రియ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామనీ, వీటి అమలు కోసం ఇప్పటివరకు రూ.1500 కోట్లు ఖర్చు చేశామన్నారు. వాతావరణ మార్పుల వల్ల జరిగే పంట నష్టాలను తగ్గించేందుకు భారతదేశం వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలను అభివృద్ధి చేస్తున్నదని చెప్పారు. ఇలాంటి వాతావరణ మార్పు సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్న ఇతర దేశాలకు కూడా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. శుక్రవారం ఆహార భద్రత, పోషకాహారం, డిజిటల్ టెక్నాలజీలు, వ్యవసాయ వ్యాపారం, వాతావరణ మార్పులు, సుస్థిర వ్యవసాయం మొదలైన అంశాలకు సంబంధించిన ఎజెండాపై చర్చ జరగనుందని చెప్పారు. జూన్17న జీ 20 వ్యవసాయ మంత్రులు వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రకటనతోపాటు రోడ్ మ్యాప్‌ను విడుదల చేస్తారని తెలిపారు.

ఓటమి భయంతోనే దర్యాప్తు సంస్థలతో దాడులు

- తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ఓటమి భయంతోనే బీజేపీ దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నతని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఖమ్మం సభలో ప్రజలు నిలదీస్తారని తెలిసే అమిత్ షా సభను రద్దు చేసుకున్నారని పేర్కొన్నారు. బీజేపీ పార్టీలోకి వెళ్లని నేతలపై దర్యాప్తు సంస్థలు దాడులు జరిపి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు బీజేపీ చిల్లర రాజకీయాలకు భయపడరని స్పష్టం చేశారు. బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా తెలంగాణలో వారి ఆటలు సాగవని హెచ్చరించారు. బీజేపీయేతర రాష్ట్ర సర్కార్‌లను ఇబ్బంది పెట్టేందుకే దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు.

బంగారు తెలంగాణలో రైతు ఆత్మహత్యలుంటాయా?

- మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బంగారు తెలంగాణలో రైతు ఆత్మహత్యలుంటాయా? అని టీపీసీసీ కార్యనిర్వహణ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నాయకులను కలిసేందుకు వెళ్లిన వారికి బేడీలు వేస్తారా? అని నిలదీశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతుల చేతులకు బేడీలు వేసి వాళ్లురైతులే కాదని బుకాయిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో రైతులకున్న కష్టాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. అప్పట్లో ఖమ్మం రైతులకు బేడీలు వేశారనీ, ఇప్పుడు భువనగిరి రైతులకు బేడీలు వేశారని గుర్తు చేశారు. ధరణి పేరిట బీఆర్ఎస్ నేతలు భూములు కొల్లగొడుతున్నారని చెప్పారు. కొంత మంది కలెక్టర్లు ధరణి పేరుపై పేదల భూములను కాజేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా జూలై2న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ జరుగుతుందనీ, యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నేటికీ తగ్గని శ్రీశ్రీ సాహిత్య సమకాలీనత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్నార్తులు, నిరు పేదలు, కార్మిక, కర్షక శక్తులే తన కవితా వస్తువులంటూ మహాకవి శ్రీశ్రీ గొప్పగా చెప్పుకునేవారని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ మోతుకూరి నరహరి అన్నారు. సామాన్యుడి పక్షపాతిగా ఆయన భూస్వామ్య శక్తులపై తన కవితా ఖడ్గాన్ని ఎత్తారని తెలిపారు. అందువల్లే శ్రీశ్రీ సాహిత్య సమకాలీనత నేటికీ తగ్గలేదని వివరించారు. తెలంగాణ సాహితీ, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాకవి శ్రీశ్రీ 40వ వర్థంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ... శ్రీశ్రీ మన నుండి దూరమై 40 ఏండ్లు గడిచినా ఇప్పటికీ ఆయన సాహిత్య సమకాలీనత, ప్రాసంగికత మన ముందే ఉందని చెప్పారు. అట్టడుగు శ్రామికవర్గపు దైన్య జీవితాన్ని మార్చాలంటూ పదండి ముందుకు.. పదండి తోసుకు... అంటూ ఆయన తన అక్షరాలతో విప్లవ జయభేరి మోగించారని నివాళులర్పించారు. టీపీఎస్‌కే నిర్వాహకులు, కవి భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... శ్రీశ్రీ కవిత్వాన్ని, రచనలను అధ్యయనం చేయాలంటూ యువతకు సూచించారు. శ్రీశ్రీకి నివాళులర్పించిన వారిలో తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి, కోశాధికారి అనంతోజు మోహనకృష్ణ, సహాయ కార్యదర్శి ఎస్‌కే సలీమా, ప్రముఖ కవి ప్రభాకరాచారి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేశ్, మహేశ్ దుర్గే, వెంకటేశ్, మహేశ్ తదితరులున్నారు.

రోగులకు సపోర్ట్ సరే...మరి సిబ్బందికి సాయమేది?

- రూ.10 వేలతో పట్నంలో బతికేదెట్లా?
- బస్తీ దవాఖానాల్లో ఇబ్బంది పడుతున్న సహాయక సిబ్బంది



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బస్తీ దవాఖానాల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్ జీతాలు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర జీతాలతో పట్టణాల్లో నెట్టుకురావడం కష్టంగా మారుతుండటంతో తమ జీతాలను పెంచాలని వేడుకుంటున్నారు. పెరిగిన ధరలు, ఇంటి అద్దెలు, స్కూళ్ల ఫీజులు, నెలవారీ చెల్లింపులు తదితర వాటితో సతమతమవుతున్నారు. బస్తీ దవాఖానాల ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందనీ, అందులో తామందించిన సేవలు కూడా కారణమని గుర్తుచేస్తున్నారు. 2018, 2019లో కాంట్రాక్టు ప్రాతిపదికన, 2020, 2021, 2022లో పొరుగుసేవల ప్రాతిపదికన సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించుకున్నారు.

పట్టణ ప్రాంతాల్లోని బస్తీవాసులకు ప్రాథమిక వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన వాటిలో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్ సేవలందిస్తున్నారు. బోధనాస్పత్రులు, జిల్లా, ఏరియా ఆస్పత్రులపై భారం తగ్గించడం, చిన్న, చిన్న రోగాలకు బస్తీవాసులకు అందుబాటులోనే వైద్యమందించడం వీటి లక్ష్యం. ఢిల్లీలో అక్కడి ప్రభుత్వం నిర్వహిస్తున్న మొహల్లా క్లినిక్‌లను స్ఫూర్తిగా తీసుకుని అందుబాటులోకి తెచ్చిన బస్తీ దవాఖానాలు ఆ లక్ష్యం దిశగా పని చేస్తున్నాయి. జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన ఈ బస్తీ దవాఖానాలు ప్రజలు, రోగుల నుంచి ప్రశంసలందుకుంటున్నాయి. 2018లో జీహెచ్ఎంసీ పరిధిలో ప్రారంభమై రాష్ట్రంలో దాదాపు 400కు విస్తరించాయి. మున్సిపాల్టీలలోని బస్తీలే కేంద్రంగా వీటిని అందుబాటులోకి తెస్తున్నారు. మరో వంద బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి వీటి సంఖ్యను 500కు పెంచాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తున్నాయి. ప్రతి ఏడాది 50 లక్షల మంది రోగులు వీటి సేవలు పొందుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. పూర్తిస్థాయి సేవలందిస్తున్న అదే స్థాయిలో జీతాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లకు రూ.35 వేల నుంచి రూ.52 వేలకు (రూ.17 వేలు), స్టాఫ్ నర్సుకు రూ.14 వేల నుంచి రూ.29,700కు (రూ.15,700) పెరిగాయి. 2018లో నియమితులైన సపోర్టింగ్ స్టాఫ్‌కు రెండేండ్లకు ఐదు శాతం ఇంక్రిమెంటులతో కలిపి 30 శాతం పీఆర్సీ ఇంక్రిమెంటు 30 శాతం ఇవ్వగా రూ.10 వేల నుంచి రూ.13 వేలకు (కేవలం రూ.3,000) మాత్రమే పెరిగింది. ఇక 2019లో చేరిన వారికి ఐదు శాతం ఇంక్రిమెంటు మంజూరు చేసి రూ.10 వేల నుంచి రూ.10,500 (కేవలం రూ.500) మాత్రమే పెంచారు. 2020, 2021, 2022లో ఉద్యోగుల్లో చేరిన వారికి వేతనాల పెరుగుదలే లేకపోవడం వారింకా రూ.10 వేలకే పని చేస్తున్నారు. వేతన పెరుగుదలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు తమకు వర్తింపజేయకపోవడం, జీవో 510తో లబ్ది జరగలేదని వాపోతున్నారు. శానిటేషన్ వర్కర్లకు లభించే వేతనం కూడా సపోర్టింగ్ స్టాఫ్‌కు ఇవ్వడం లేదని చెబుతున్నారు. అన్ని విషయాలను పరిశీలించి తమ వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు.

మాల్దీవులకు మా సహకారం

- ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు అనిల్ అగర్వాల్
- ఎఫ్‌టీసీసీఐని సందర్శించిన మాల్దీవుల ప్రతినిధులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాల్దీవులకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు అనిల్ అగర్వాల్ అన్నారు. ఎఫ్‌టీసీసీఐ మహిళా సాధికారత కమిటీ గురువారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో మాల్దీవుల అడ్డూ సిటీ మహిళా అభివద్ధి కమిటీ సభ్యులు, మాల్దీవుల ఆర్థికాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సమావేశాన్ని నిర్వహించింది.

తొమ్మిది మంది సభ్యుల మహిళా ప్రతినిధి బందానికి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి శాఖ మంత్రి నీజా ఇమాద్, సహాయ మంత్రి మరియం నజిమా నాయకత్వం వహించారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనీల్ ముఫీద్, మహిళా అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు నుస్రత్ రషీద్, మాల్దీవుల ఆర్థికాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు ఎఫ్‌టీసీసీఐని సందర్శించారు. ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌అగర్వాల్, సీనియర్ ఉపాధ్యక్షులు మీలా జయదేవ్, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్ సింఘాల్, నేతత్వంలోని ఎఫ్‌టీసీసీఐ బందంతో సంభాషించారు. ఇందులో మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ భగవతీదేవి బల్ద్వా, సీఈఓ ఖ్యాతినరవాణే, డిప్యూటీ సీఈఓ సుజాత పాల్గొన్నారు. ప్రతినిధులకు స్వాగతం పలికిన అనిల్‌అగర్వాల్ మాట్లాడుతూ స్టార్టప్ స్టేట్ తెలంగాణ మంచి పనితీరును కనబరుస్తోందని అన్నారు. 1967లో ద్వీప దేశం మాల్దీవులు స్వాతంత్ర్యం పొందినప్పుడు గుర్తించిన మొదటి దేశం భారతదేశమని గుర్తుచేశారు. 1981 నుంచి మాల్దీవులతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కలిగి ఉన్నామని తెలిపారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం బాగానే ఉందన్నారు. మాల్దీవులతో భారతదేశం 3వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అన్నారు. భౌగోళికంగా చిన్నదైనప్పటికీ మాల్దీవులు పర్యాటకంలో పరిగణించదగిన పేరు, అభివృద్ధి అభినందనీయమన్నారు. డబ్ల్యూడీసీ ప్రెసిడెంట్ నుస్రత్ రషీద్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు వ్యాపార అవకాశాలను అన్వేషించడానికి ఇది మాకు గొప్ప అవకాశమని అన్నారు. మహిళా వ్యవస్థాపకత అభివృద్ధికి ఆసక్తి కలిగి ఉన్నామని తెలిపారు. భారతదేశం, తెలంగాణలోని మహిళా పారిశ్రామికవేత్తలతో సంబంధాలు కలిగి ఉన్నామని చెప్పారు.

ఫైనాన్షియల్ ప్లానింగ్, ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలపై సెమినార్

దేశంలో కేవలం 2300 మంది రిజిస్టర్డ్ ఫైనాన్షియల్ ప్లానర్లు ఉన్నారని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ డైరెక్టర్ ఆంజనేయ గౌతమ్ తెలిపారు.

రిమూవ్‌పై ఆలస్యమేల?

ప్రభుత్వ ఉద్యోగ నుంచి మధుసూదన్‌రెడ్డి తొలగింపునకు ఇంటర్ కమిషనరేట్ పూర్తి ఆధారాలు సేకరణ

- ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక పంపిన అధికారులు
- మంత్రి వద్దే ఫైల్ ఆగిందని ఆరోపణలు
- వెంటనే చర్యలు తీసుకోవాలని
- తెలంగాణ ఇంటర్ విద్యాపరిరక్షణ సమితి, ఎస్సీ, ఎస్టీ సంఘాల డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్

సస్పెండ్‌లో ఉన్న ప్రభుత్వ జూనియన్ కాలేజీ లెక్చరర్, యూనియన్ నేత మధుసూదన్‌రెడ్డిని శాశ్వతంగా తొలగించేందుకు ఇంటర్ కమిషనరేట్ ఏర్పాట్లు చేసింది. ఆయనకు సంబంధించి పూర్తి ఆధారాలతో సహా ఫైల్‌ను సిద్ధం చేసి ఇంటర్‌మీడియట్ విద్య కమిషనర్ నవీన్‌మిట్టల్ ప్రభుత్వానికి పంపినట్టు సమాచారం. సస్పెన్స్‌లో ఉన్న ఉద్యోగిని శాశ్వతంగా తొలగించే అధికారాలకు సంబంధించి జీవోలను కూడా జత చేసి పంపారని అధికారవర్గాల సమాచారం. మధుసూదన్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న క్రమంలో ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు రావడంతో 2019 సంవత్సరం అక్టోబర్ నెలలో అతని ఆస్తులపై రైడ్స్ చేసింది. అరెస్ట్ చేసి జైలుకు పంపింది. ప్రభుత్వం మధుసూదన్ రెడ్డిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సస్పెన్షన్‌లోనే ఉన్నారు. అదేవిధంగా మధుసూదన్‌రెడ్డిపై సెక్స్‌వల్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ క్రిమినల్ కేసులున్నాయి. సస్పెన్షన్‌లో ఉన్నా పలువురిని బెదిరిస్తూ అసభ్య పదజాలలతో దూషిస్తున్నారన్న ఆరోపణలు రావడం, మహిళా కమీషన్ సూచనలతో ఇంటర్మీడియట్ కమిషనర్ నవీన్ మిట్టల్ మధుసూదన్ రెడ్డిని కమిషనర్ కార్యాలయం, బోర్డు కార్యాలయం పరిసర ప్రాంతాలకు రాకుండా నిషేధ ఆజ్ఞలు విధిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించవచ్చని ప్రభుత్వానికి ఏప్రిల్ 6,2023 రోజున పూర్తి నివేదిక పంపినా ఈ విషయంలో సంబంధింత శాఖ మంత్రి చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం కావడం పట్ల ఇంటర్ విద్యాపరిరక్షణ సమితి, ఎస్సీ, ఎస్టీ సంఘాలు, తెలంగాణ ఇంటర్మీడియట్ లెక్చరర్స్ అసోసియేషన్, ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించాలని కోరుతున్నారు. లేకపోతే ఉద్యోగులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

- పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్, మహేశ్వరం, షాద్‌నగర్, ఉప్పల్ ప్రాంతాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున తరలించారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి చెందిన కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదిలాబాద్, ఆదిలాబాద్ రూరల్, బేలా, జైనత్, మావాలా మండలాలకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జోగు రామన్నను జోకుడు రామన్న అంటే బాగుంటదన్నారు. ఆయన్ను సీఎం కేసీఆర్ చెల్లని రూపాయిగా నిర్ణయించారని ఎద్దేవా చేశారు. అందుకే ఆయనకు మళ్లీ మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. ఆదిలాబాద్ జిల్లాను కాంగ్రెస్ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తుందని హామీ ఇచ్చారు. జిల్లాలో గృహ నిర్మాణ శాఖ మంత్రి ఉన్నా... అక్కడి ప్రజలకు ఇల్లు రాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇల్లు కట్టుకునే పేదలకు రూ.5లక్షలు అందిస్తామని చెప్పారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వరకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తామనీ, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డల కష్టాలు తీరుస్తామన్నారు. తెలంగాణలో కూడా మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో 8 అసెంబ్లీ స్థానాలను గెలిపించాలనీ, రాష్ట్రంలో 80 అసెంబ్లీ స్థానాలు గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించి సోనియమ్మకు జన్మదిన కానుక ఇద్దామని ఆశాభావం వ్యక్తం చేశారు.

వెరిఫికేషన్ లేకుండా షెడ్యూల్ విడుదల చేస్తారా?
ఎన్నికల షెడ్యూల్ మార్చాలి : జి నిరంజన్

క్షేత్రస్థాయిలో ఎన్నికల వెరిఫికేషన్ లేకుండా షెడ్యూల్ ఎలా విడుదల చేస్తారని టీపీసీసీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ ప్రశ్నించారు. వెంటనే ఎన్నికల షెడ్యూల్ మార్చాలని కోరారు. ఐదు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల కోసం స్పెషల్ సమ్మరి డివిజన్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దీని ప్రకారం మే 25 నుంచి జూన్ 23 వరకు బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితాలో ఉన్న పేర్లు పరిశీలన చేయాలన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు.

అన్నం పెట్టండి

- భోజనం కోసం విద్యార్థుల భిక్షాటన
- ఖాళీ ప్లేట్లతో టీయూ మెయిన్ గేట్ ఎదుట నిరసన
- నిరవధిక సమ్మెలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది



నవతెలంగాణ-డిచ్‌పల్లి

'అన్నం పెట్టండి' అంటూ తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేశారు. టీయూలోని మెస్‌వర్కర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో మూడు రోజులుగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. దాంతో టీయూ విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెట్టకపోవడంతో జాతీయ రాహదారి పక్కనున్న నడ్పల్లి తండాలో ఇంటింటికీ వెళ్లి.. 'అమ్మా.. అన్నం పెట్టండి' అంటూ విద్యార్థులు భిక్షాటన చేశారు. అంతకుముందు విద్యార్థులు టీయూ మెయిన్ గేటు ఎదుట ఖాళీ ప్లేట్లతో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. వీసీ నిర్లక్ష్యం వల్ల ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు రాక నిరవధిక సమ్మె చేస్తున్నారని, దాంతో యూనివర్సిటీలో ఉన్న 650 మంది విద్యార్థులు అన్నం లేక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే వైస్ ఛాన్స్‌లర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, తక్షణమే అవినీతి వీసీని బర్తరఫ్ చేసి యూనివర్సిటీని కాపాడాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాలు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

4వ రోజుకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె..

తెలంగాణ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె గురువారం 4వ రోజుకు చేరుకుంది. 273 మంది సిబ్బంది టీయూ పరిపాలన భవనం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. వీసీ, రిజిస్ట్రార్‌ల నిర్లక్ష్యంతో మే నెల వేతనాలు 15 రోజులు గడుస్తున్నా నేటికీ అందలేదని యూనివర్సిటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ప్రతినిధులు సురేష్, బికోజీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైస్ ఛాన్స్‌లర్ నిర్లక్ష్యం కారణంగానే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు అందడం లేదని ఆరోపించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఒకరిని, పాలకమండలి మరొక రిజిస్ట్రార్‌ను నియమించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వేతనాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు అందేలా చూడాలని కోరారు. బుధవారం యూనివర్సిటీకి వచ్చిన వైస్ ఛాన్స్‌లర్‌ను ఔట్ సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు ఘెరావ్ చేయగా గురువారం వేతనాలు చెల్లించే విధంగా చూస్తానని హామీనిచ్చినా మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజినెస్



ఎగిసిన వాణిజ్య లోటు

- మేలో 22 బిలియన్ డాలర్లుగా నమోదు

న్యూఢిల్లీ: ప్రపంచ మార్కెట్ లో భారత సరకులకు డిమాండ్ పడిపోతోంది. వరుసగా నాలుగు నెలలుగా ఎగుమతులు డీలాపడ్డా యి. ఎగుమతులు తగ్గడం, మరో వైపు దిగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయి. తద్వారా వాణిజ్య లోటు ఎగిసిపడుతోంది. ప్రస్తుత ఏడాది మేలో భారత సరుకుల వాణిజ్య లోటు 22.12 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుందని గురువారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణంకాలు వెల్లడించింది. 2022 డిసెంబర్ తర్వాత ఇంత గరిష్ట స్థాయిలో లోటు చోటు చేసుకోవడం ఇదే తొలిసారి. గడిచిన ఏప్రిల్‌లో వాణిజ్య లోటు 15.24 బిలియన్ డాలర్లుగా ఉంది. కాగా.. గతేడాది డిసెంబర్‌లో గరిష్టంగా 23.76 బిలియన్ల లోటు చోటు చేసుకుంది. 2023లో తొలిసారి మేలో అత్యధికంగా నమోదయ్యింది. వరుసగా నాలుగు నెలలుగా ఎగుమతులు పడిపోవడం ఆందోళనాకరం. గడిచిన మే నెలలో దిగుమతులు 6.6 శాతం తగ్గి 57.1 బిలియన్లుగా, ఎగుమతులు 10.3 శాతం తగ్గి 34.98 బిలియన్లుగా చోటు చేసుకుంది. "అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో మందగమనం చోటు చేసుకుంటుంది. జిడిపి కూడా పడిపోతోంది. ఇదే క్రమంలో వరుసగా దిగుమతులకు డిమాండ్ తగ్గుతోంది." అని వాణిజ్య శాఖ సెక్రటరీ సునీల్ బరత్వాల్ పేర్కొన్నారు. పస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ - మే కాలంలో సరుకుల ఉత్పత్తులు, సేవల వాణిజ్య లోటు 13.28 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకోగా.. గతేడాది ఇదే కాలంలో 20.56 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

ఐదు నెలల్లో ఆరు కోట్ల మంది విమానయానం

- ఇండిగోకు మెజారిటీ మార్కెట్ వాటా



న్యూఢిల్లీ: దేశీయ విమాన ప్రయాణికుల్లో భారీ వృద్ధి చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది జనవరి నుంచి మే కాలంలో 36 శాతం పెరుగుదల నమోదయ్యింది. గడిచిన ఐదు నెలల్లో దేశీయ విమానాల్లో 6.36కోట్ల మంది ప్రయాణించారు. గతేడాది ఇదే సమయంలో 4.67కోట్ల మంది ప్రయాణికులు నమోదయ్యారు. ప్రస్తుత ఏడాది మేలోనూ 36 శాతం పెరుగుదలతో 1.32 కోట్ల మంది ప్రయాణించారని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) వెల్లడించింది. కరోనాకు ముందు 2019 మేలో 1.22 కోట్ల ప్రయాణికులు నమోదయ్యారు. మే నెలలో ఇండిగో అత్యధికంగా 61.3 శాతం మార్కెట్ వాటాను స్వాధీనం చేసుకుంది. గత నెలలో ఇండిగోలో 81.10 లక్షల ప్యాసింజర్లు ప్రయాణించారు. ఎయిరిండియాలో 12.44 లక్షల మంది ప్రయాణించడంతో ఆ సంస్థ మార్కెట్ వాటా 9.4 శాతంగా చోటు చేసుకుంది. విస్తారా 11.95 లక్షల మంది గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా 9 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. టాటా గ్రూపులో భాగమైన ఏయిర్ ఆసియా 7.9 శాతం మార్కెట్ వాటా, స్పైస్‌జెట్‌స 5.4 శాతం వాటాను కలిగి ఉంది. కాగా.. గత నెలలో 566 ఫిర్యాదులు నమోదయ్యాయి. గో ఫస్ట్ విమాన సేవలు రద్దు కావడంతో అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయని డిజిసిఎ వర్గాలు పేర్కొన్నాయి.

ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్స్ సిస్టం ప్రోగ్రామ్

- ఐఐటి మద్రాస్ బిఎస్ డిగ్రీ ఆఫర్



హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్ రంగంలో నిపుణులను తయారు చేయడానికి ఐఐటి మద్రాస్ నూతన కోర్సును ప్రారంభించింది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఎలక్ట్రానిక్ సిస్టమ్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బిఎస్)ను ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. గురువారం హైదరాబాద్‌లో ఐఐటి మద్రాస్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ రాధా కృష్ణ గంటి, ప్రొఫెసర్ అనిరుద్దిన్ మీడియాకు కోర్సు వివరాలను వెల్లడించారు. ఈ కోర్సునకు ఆన్‌లైన్‌లో జూన్ 25 వరకు దరఖాస్తులను అహ్వానిస్తున్నామన్నారు. ఇంటర్‌లో ఫిజిక్స్, గణితం సబ్జెక్టులు కలిగిన వారు అర్హులని తెలిపారు. నాలుగేళ్ల ఈ ఆన్‌లైన్ కోర్సులో ప్రాక్టికల్స్ కూడా ఉంటాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎలక్ట్రానిక్స్ రంగంలో విస్తృతావకాశాలు ఉన్నాయన్నారు. కోర్సులోని సెమిస్టర్ల ఆధారంగా ఫీజు రూ.80వేల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

హీరో మోటో కార్ప్ నిధుల మళ్లింపునపై విచారణ..!



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్ డొల్ల కంపెనీలను ఏర్పాటు చేసి నిధుల మళ్లింపునకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీనిపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ విచారణ చేపట్టింది. నిధుల తరలింపునకు సంబంధించి ఒక్క థర్డ్ పార్టీ వెండర్‌తో హీరో మోటో కార్ప్‌కు ఉన్న సంబంధాలపై విచారణ జరగనుందని సమాచారం. కాగా.. ఈ విచారణ అంశంపై తమకు ఎలాంటి సమాచారం లేదని హీరో మోటో పేర్కొంది. ఒకవేళ దర్యాప్తు సంస్థలు కోరితే తగిన సమాచారాన్ని అందిస్తామని ఆ కంపెనీ తెలిపింది. ఈ వార్తలతో గురువారం హీరో మోటో షేర్లు నష్టపోయాయి. బిఎస్ఇలో 2.99 శాతం నష్టంతో రూ.2,842.70 వద్ద ముగిసింది.

ఎంఇఐఎల్ ఐకామ్‌కు రక్షణ శాఖ కాంట్రాక్టు

- ఒప్పంద విలువ దాదాపు రూ.500 కోట్లు



హైదరాబాద్ : ఎంఇఐఎల్‌కు చెందిన ఐకామ్ టెలి లిమిటెడ్‌కు భారత రక్షణ శాఖ (ఎంఒడి) నుంచి భారీ కాంట్రాక్టు ఆర్డర్ దక్కింది. భారత సైన్యం కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎంఒడితో రూ.500 కోట్ల విలువ చేసే ఒప్పందాన్ని చేసుకున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది. స్వదేశీ రక్షణ పరికరాల తయారీని పెంపొందించడానికి, ఆత్మనిర్భర్ భారత్ దృక్పథాన్ని సాకారం చేసుకునేందుకు, తయారీలో ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడానికి రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం ఐకామ్ టెలి లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 5/7.5 టన్ రేడియో రిలే కమ్యూనికేషన్ పరికరాల కంటైనర్లకు సంబంధించిన 1,035 ఉత్పత్తులను సమకూర్చాల్సి ఉంటుందని తెలిపింది. ఈ కాంట్రాక్ట్ విలువ దాదాపు రూ.500 కోట్ల మేర ఉంటుందని వెల్లడించింది. ఈ కంటైనర్ల డెలివరీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 నుంచే ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. రేడియో రిలే కంటైనర్లు భారత సైన్యం మొబైల్ కమ్యూనికేషన్ డిటాచ్‌మెంట్‌ల దీర్ఘకాల ఆవశ్యకతను పరిష్కరిస్తాయి. కమ్యూనికేషన్ పరికరాలు విఫలమైన, నమ్మదగిన రీతిలో పనిచేయడానికి రక్షిత వాతావరణాన్ని అందించడానికి కంటైనర్లు ఉపయోగించబడతాయి. ఆ కంటైనర్‌లు ఆథీకృత ప్రత్యేక వాహనాలపై అమర్చబడతాయి. వాహనాలు కార్యాచరణ అవసరాలకు అనుగుణంగా తరలించబడతాయి. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఇంజనీరింగ్ దిగ్గజ సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) గ్రూపునకు చెందిన ఐకామ్ దేశీయ తయారీదారుల నుండి సేకరించిన అన్ని పరికరాలు, ఉప వ్యవస్థలతో కంటైనర్‌లను ఉత్పత్తి చేస్తుంది. తాజా ఒప్పందం రక్షణ పరికరాల స్వదేశీ తయారీకి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఐకామ్ పేర్కొంది.

బెంగాల్‌లో తృణమూల్ ఆగడాలు



'పంచాయతీ' నామినేషన్ల పర్వంలో హింస

- వామపక్ష కార్యకర్త హత్య
- నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న టీఎంసీ గూండాలు
- నిరసనగా రాష్ట్రవ్యాప్త ప్రదర్శనలు



కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. పంచాయతీ ఎన్నికలలో నామినేషన్లు దాఖలు చేయకుండా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను అడ్డుకుంటున్నారు. దాడులకు తెగబడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన గురువారం హింసాకాండ చెలరేగింది. ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని చోప్రాలో వామపక్షాలు, కాంగ్రెస్ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీపై తృణమూల్ కాంగ్రెస్ దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో వామపక్ష కార్యకర్త మన్సూర్ అలీ ప్రాణాలు కోల్పోయారు. కాంగ్రెస్, వామపక్షాలకు చెందిన పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. భంగోర్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) మధ్య జరిగిన ఘర్షణలో ఐఎస్ఎఫ్ కార్యకర్త ప్రాణాలు కోల్పోయారు.

చోప్రాలో కాంగ్రెస్, వామపక్ష కార్యకర్తలు నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి ర్యాలీగా వెళుతుండగా ప్రదర్శనపై హఠాత్తుగా కాల్పులు మొదలయ్యాయి. లాల్ బజార్, దాస్‌పరా నుండి నామినేషన్లు వేసేందుకు వెళుతుంటే తృణమూల్ మద్దతుదారులు అడుగడుగునా అడ్డు తగిలారని సీపీఐ (ఎం) కార్యకర్త ఒకరు తెలిపారు. స్థానిక తృణమూల్ ఎమ్మెల్యే నివాసం సమీపంలో కాల్పులు జరిగాయని ఆయన చెప్పారు. ఐదుగురిపై కాల్పులు జరిగాయని, వారిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. గాయపడిన వారిలో ఒకరు ఆ తర్వాత చనిపోయారని తెలిపారు. వాహనమేదీ అందుబాటులో లేకపోవడంతో ఆయనను మోసుకుంటూ ఆస్పత్రికి తరలించామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పోలీసుల ఉదాసీనతపై వామపక్ష కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటామంటూ తృణమూల్ కార్యకర్తలు ఉదయం నుండే తమను బెదిరించారని కాల్పుల ఘటనలో గాయపడిన సీపీఐ (ఎం) కార్యకర్త చెప్పారు. గతంలో కూడా వారు చాలా సార్లు ఇలాంటి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. కాగా కాల్పుల ఘటనలో ఇద్దరు వామపక్ష కార్యకర్తలు మరణించారని, 20 మందికి పైగా గాయపడ్డారని అనధికారిక వార్తలు తెలిపాయి.

ఉత్తర 24 పరగణాల జిల్లా బరాసత్, దక్షిణ 24 పరగణాల జిల్లా భన్‌గర్‌లో కూడా నామినేషన్లు దాఖలు చేయకుండా తృణమూల్ దుండగులు వామపక్ష కార్యకర్తలను అడ్డుకున్నారు. కాగా చాలా చోట్ల నామినేషన్లు దాఖలు చేయకుండా ప్రతిపక్ష అభ్యర్థులను నిరోధించారని వార్తలు వస్తున్నాయి. తృణమూల్ ఆగడాలు పెచ్చరిల్లుతున్నప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. నామినేషన్ల దాఖలుకు చివరి రెండు రోజులు పలుచోట్ల తృణమూల్ కార్యకర్తలు భయానక వాతావరణాన్ని సృష్టించారని, కర్రలతో స్వైరవిహారం చేస్తూ అడ్డంకులు సృష్టించారని వార్తలు వచ్చాయి.

కాగా చోప్రా ఘటనకు నిరసనగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో వామపక్షాలు ప్రదర్శనలు నిర్వహించాయి. ప్రదర్శన అనంతరం ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందించారు. హింస పెచ్చరిల్లుతున్నా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పట్టనట్లు వ్యవహరిస్తోందని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం విమర్శించారు. ఎన్నికల కమిషన్‌లో ఎలాంటి చలనం కన్పించడం లేదని, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ధ్వజమెత్తారు. తృణమూల్ గూండాలకు రాష్ట్ర పోలీసులు సహకరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాగా చోప్రా ఘటనను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కలకత్తా హైకోర్టు దృష్టికి తీసికెళ్లారు. ప్రతిపక్ష అభ్యర్థులు కోర్టులో నామినేషన్లు అందజేస్తే వారికి సహకరిస్తామని హైకోర్టు న్యాయమూర్తి రాజశేఖర్ మహంతా హామీ ఇచ్చారు. ప్రతిపక్ష అభ్యర్థులకు భద్రత కల్పించాలని రాష్ట్ర పోలీసులను ఆయన ఆదేశించారు.

షార్ట్‌కట్ పద్ధతులు వద్దు

ప్రమాదానికి రెండు నెలల ముందే

- అన్ని జోన్‌ల హెడ్‌లను హెచ్చరించిన రైల్వే బోర్డు



న్యూఢిల్లీ : ఒడిశాలోని బాలాసోర్ ఘోర రైలు ప్రమాదానికి ముందే ఉన్నతాధికారులను రైల్వే బోర్డు హెచ్చరించింది. సిగ్నలింగ్ సిబ్బంది ఉపయోగిస్తున్న షార్ట్‌కట్ పద్ధతులు వద్దని సూచించింది. ఆ పద్ధతులను తొలగించే విధంగా కార్మికులను ఆదేశించాలని అన్ని జోన్‌ల హెడ్‌లను బోర్డు అప్రమత్తం చేసింది. రైల్వేలోని వివిధ జోన్లలో చోటు చేసుకున్న ప్రమాదాలకు సంబంధించిన ఐదు అసురక్షిత ఘటనలను ఉదాహరణలుగా పేర్కొంటూ ఉన్నతాధికారులకు రాసిన లేఖలో రైల్వే బోర్డు వివరించింది. ఈ ఐదింటిలో రెండు పట్టాలు తప్పిన ఘటనలూ ఉన్నాయి. ఈ అంశాలను సేఫ్టీ మీటింగ్‌లలో సమీక్షించుకోవాలని అందరు జనరల్ మేనేజర్లను(జీఎం) బోర్డు ఆదేశించింది. షార్ట్‌కట్ పద్ధతులను పాటించొద్దని తరచూ ఆదేశిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం మెరుగుదల కనబడటం లేదని లేఖలో బోర్డు పేర్కొన్నది.

కాగా ఈ లేఖను బోర్డు ఏప్రిల్ 3న రాసింది. ఈనెల 2న బాలసోర్‌లో మూడు రైళ్లు ఢీ కొని దాదాపు 289 మంది చనిపోగా, 900 మందికి పైగా గాయాలపాలైన విషయం విదితమే. దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగానూ ఈ ప్రమాదం అనేక దేశ ప్రముఖులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘోర ప్రమాద ఘటనపై కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్), కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ లు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి.

సౌత్ ఈస్టర్న్ రైల్వే ఏజీఎం బదిలీ

చెన్నై : ఒడిశాలో 288 మంది మరణించిన ఘోర రైలు ప్రమాదం జరిగిన రెండు వారాల తరువాత గురువారం సౌత్ ఈస్టర్న్ రైల్వే ఆడిషనల్ జనరల్ మేనేజర్ (ఏజీఎం)ను అతుల్య సిన్హా బదిలీ చేశారు. సిన్హాను పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో ఉన్న చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ ప్రిన్సిపాల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ పదవికి బదిలీ చేశారు. ఇది పదవీ పరంగా ఉన్నతమైనప్పటికీ డౌన్‌గ్రేడ్‌గానే భావిస్తారు. సిన్హా బదిలీకి కారణం చెప్పకపోయినా, రాష్ట్రపతి ఆమోదంతోనే ఈ బదిలీ జరిగినట్లు రైల్వే బోర్డు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సౌత్ ఈస్టర్న్ రైల్వే నూతన ఏజీఎంగా ఈస్ట్రర్న్ రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ ఇంజనీర్ ఎకె దుబేను నియమించారు. ఈ నెల 2న ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదం జరిగిన తరువాత ఇదే పెద్ద బదిలీగా భావిస్తున్నారు.

రైలు కార్యకలాపాల భద్రతపై రాజీ లేదు

భద్రతా సదస్సుల్లో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భద్రతకు ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రైళ్లను సురక్షితంగా నడిపే విషయంలో రాజీపడకూడదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. విజయవాడ డివిజన్‌లోని ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీటీసీ)లో గురువారం నిర్వహించిన భద్రతా సదస్సులో ఆయన మాట్లాడారు. రైలు కార్యకలాపాల భద్రతకు సంబంధించిన అన్ని మార్గదర్శకాలు, నిబంధనలను తప్పకుండా పాటించాలని అన్నారు. సిబ్బంది సానుకూల దక్పథంతో ఉండాలని, భద్రతతో కూడిన రవాణానే రైల్వే ప్రధాన లక్ష్యంగా ఎల్లప్పుడూ దష్టి సారించాలని ఆయన చెప్పారు. ఫ్రంట్‌లైన్ సిబ్బంది రైల్వేకు కళ్ళు, చెవుల లాంటివారని, వారి మధ్య సరైన సమన్వయం అవసరమని అన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బందికి విధినిర్వహణలో లోతైన, క్షుణ్ణమైన జ్ఞానాన్ని అందించే ప్రక్రియలో భాగంగా ఆచరణాత్మక, ఉద్యోగ శిక్షణపై కూడా ఆయన ప్రసంగించారు. ఈ సదస్సులో విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ శివేంద్ర మోహన్, సీనియర్ రైల్వే అధికారులు, శాఖాధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాణిక్‌ఘర్ గూడ్స్ షెడ్ వద్ద కొత్తగా నిర్మించిన రైల్వే లైన్ నుండి మొదటి ఐరన్ ఓర్ గూడ్స్ రైలును జెండా ఊపి జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బినాగ్య, సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ ఏకే గుప్తా, ఇతర అధికారులు కూడా రైల్ నిలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుంటూరు సదస్సులో

అనంతరం గుంటూరు రైలుమహల్‌లో జరిగిన భద్రతా సదస్సులో కూడా ఆయన పాల్గొన్నారు. ఈ భద్రతా సదస్సు సందర్భంగా రైలు కార్యకలాపాల భద్రతను పెంపొందించడం కోసం దష్టి సారించే వివిధ రంగాలపై వివరణాత్మకంగా దశ్యామాధ్యమం ద్వారా జీఎం అరుణ్‌కుమార్ వివరించారు. ఆపరేటింగ్, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్, మెకానికల్ వంటి వివిధ విభాగాల భద్రతా అంశాలపై కూడా ఈ విభాగం ఉద్ఘాటించారు. దీంతోపాటు రాబోయే వర్షాకాలంలో చేపడుతున్న ముందస్తు జాగ్రత్త చర్యల గురించి కూడా వివరించారు. తరువాత ఇంటరాక్టివ్ సెషన్‌లో ఫ్రంట్‌లైన్ సిబ్బంది ఆలోచనలు, ప్రశ్నలు, సందేహాలను పరిష్కరించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో సెక్షన్ కంట్రోలర్లు, బ్రాంచ్ అధికారులతో విడివిడిగా సమావేశాలను నిర్వహించి ఏలాంటి సత్వరమార్గ పద్ధతులను అవలంబించొద్దని, అన్ని భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ ఎం.రామకష్ణన్, శాఖాధికారులు, సీనియర్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాసర త్రిపుల్‌ఐటీ ఘటనలపై ప్రభుత్వం స్పందించాలి

అది ఆత్మహత్యా, ప్రమాదమా అన్నది నిగ్గుతేల్చాలి

- ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బాసర త్రిపుల్‌ఐటీలో వరుస ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అమ్మాయి చని పోయిన ఘటన ప్రమాదమా లేక ఆత్మహత్యా అన్నది నిగ్గు తేల్చాలని కోరింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి సమీక్షను ప్రభుత్వం నిర్వహించాలని తెలిపింది. అక్కడ నిరసన తెలిపేందు కు వచ్చిన ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రం గా ఖండించింది. వారిని వెటనే విడు దల చేయాలని డిమాండ్ చేసింది.

ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడు దల చేశారు. నిర్మల్ జిల్లా బాసర త్రిపుల్‌ఐటీలో వరుసగా ఇద్దరు విద్యా ర్థినీలు చనిపోయారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు బాసటగా నిలవాలని డిమాండ్ చేశా రు. సమస్యలు పరిష్కారం చేయ కుండా తాత్సారం చేయడం వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని ఆందో ళన వ్యక్తం చేశారు.

విద్యార్థిని మరణం ప్రమాదవ శాత్తు జరిగిందా లేక ఆత్మ హత్య అనే అంశంపై విచారణ జరిపిం చాలని కోరారు. వసతులు సరిగ్గా లేకనే ఈ ఘటన జరిగిందని తెలి పారు. సరైన సౌకర్యాలు కల్పించని మూలంగా విద్యార్థుల ప్రాణాలను అధికారులు గాలికి వదిలేసి వ్యవరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఈ విశ్వవిద్యాలయం పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేట ని విమర్శించారు. పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని తెలిపారు. కావున తక్షణమే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన దీపికా కుటుంబాన్ని అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని కోరారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : ఏఐఎస్ఎఫ్

బాసర త్రిపుల్‌ఐటీలో వరుసగా జరుగుతున్న విద్యార్థినీల ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా అక్కడికి వెళ్లకుండా ముఖ్యమంత్రి, విద్యామంత్రి ఏం చేస్తున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆ ప్రాంగణంలోకి విద్యార్థి సంఘాలను, మేధావులను వెళ్లనీయకుండా అరెస్టు చేయడం, నిర్బంధాలు ప్రయోగించడం ఎంత వరకు సమంజసమని తెలిపారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఆత్మస్థైర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకోవాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ గురుకులాల్లో 9వేలకు పైగా పోస్టులు..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ గురుకులాల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల తేదీలను అధికారులు నిర్ణయించారు. ఒకట్రెండు రోజుల్లో పూర్తి షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) కన్వీనర్ మల్లయ్య భట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో బోధనా సిబ్బంది ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు సంబంధించి గురుకుల విద్యాలయాల సంస్థ ఈ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్ష తేదీలను ఖరారు చేసింది. ఆగష్టు 1నుంచి 23వ తేదీ వరకు గురుకుల నియామక పరీక్ష నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని తెలిపారు.

9వేల పైచిలుకు పోస్టులకు గాను గురుకుల నియామక బోర్డు 9నోటిఫికేషన్లను విడివిడిగా విడుదల చేయగా..2.63లక్షల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షల షెడ్యూల్‌ను ఒకటిరెండు రోజుల్లో వెల్లడించనున్నట్టు వారు తెలిపారు.

నూతన అధ్యాపకులకు వేతనం చెల్లింపు సమస్య పరిష్కారం

- ట్రెజరీ డైరెక్టర్‌కు ఇంటర్ విద్యా కమిషనర్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొత్తగా నియమించిన నూతన అధ్యాపకులకు సంబంధించిన వేతనం చెల్లింపు సమస్య పరిష్కారమైంది. డీటీవో, ఎస్టీవోల ద్వారా వారికి జీతాలివ్వాలంటూ ట్రెజరీ శాఖ డైరెక్టర్‌కు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, మల్టీజోన్ 1, 2 ఆర్జేడీ జయప్రదబాయి గురువారం ఆదేశాలు జారీ చేశారు. డీటీవోలో, ఎస్టీవోలో వేతన బిల్లుల చెల్లింపుల్లో వారు సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. వెంటనే డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ శాఖ నుంచి రాష్ట్రంలోని డీటీవో, ఎస్టీవోల కార్యాలయాలకు సమాచారం అందించి వారికి వేతనాలు త్వరగా ఇచ్చేటట్టు చూడాలని కోరారు. ఈ నిర్ణయం పట్ల జీసీఎల్ఏ-475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు.

అమరవీరుల స్మారక స్థూపం పెండింగ్ పనులను త్వరిగతిన పూర్తిచేయాలి

మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



అమరవీరుల స్మారక స్థూపం పెండింగ్ పనులను త్వరితగిన పూర్తిచేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి వి.ప్రశాంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 22న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న అమరవీరుల స్మారక స్థూపం వద్ద జరుగుతున్న పనులను ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లతో పాటు తాత్కాలిక రూట్ మ్యాప్‌పై మంత్రి ఉన్నతాధికారులతో చర్చించారు.

సచివాలయ ప్రాంగణంలో మాత్రమే అన్ని వాహనాలకు పార్కింగ్ ఉండేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఐదు వేల మందికి పైగా జానపద కళాకారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీటింగ్ ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళిక తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి శేషాద్రి, ఆర్అండ్‌బీ కార్యదర్శి శ్రీనివాసరాజు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్ రెడ్డి, సాంస్కతిక శాఖ సంచాలకులు హరికష్ణ, ఈఎన్‌సీ (ఆర్అండ్‌బీ) గణపతిరెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొ న్నారు.

ఏర్పాట్లను సమీక్షించిన సీఎస్ శాంతికుమారి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు రోజున నిర్వహించే అమరవీరుల స్మారక కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సచివాలయంలో గురువారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అమరవీరుల స్మారక కేంద్రం ప్రారంభోత్సవం, అనంతరం సభా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దీనికి ముందు అంబేద్కర్ విగ్రహం ఆవరణం నుండి అమరవీరుల స్మారక కేంద్రం వరకు దాదాపు ఐదు వేల మంది కళాకారులచే ర్యాలీ జరుగుతుందని తెలిపారు. దాదాపు గంటన్నర సేపు ఈ ర్యాలీ కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నందున వారికి సరిపడే పార్కింగ్, సీటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డయాస్, నిరంతర విద్యుత్, ఫ్లోరల్ డెకొరేషన్, తాగునీటి సౌకర్యాలతోపాటు వేదిక మొత్తం పండగ వాతావరణం వచ్చేలా అలంకరించాలని తెలిపారు.

కళాకారుల ర్యాలీ జరిగే ఐ మాక్స్ సర్కిల్ నుండి అమరుల స్మారక కేంద్రం వరకు రహదారిని అందం గా అలంకరించాలని తెలిపారు. ఇప్పటి వరకు నిర్వ హించిన కార్యక్రమాల మాదిరిగానే, దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమం కూడా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు కషి చేయాలని అధికారులను సీఎస్ కోరారు.

ఈ సమావేశంలో డీజీపీ అంజనీకుమార్, పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కుటుంబ సంక్షేమ, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ, డీజి ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, అడిషనల్ డీజీ స్వాతి లక్రా, వాటర్ బోర్డు ఎండీ దానకిషోర్, హార్టికల్చర్ డైరెక్టర్ హనుమంతరావు, ప్రోటోకాల్ డైరెక్టర్ అరవిందర్‌సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులతో సీఎస్ శాంతికుమారి సమావేశమయ్యారు. 22న జరిగే అమరవీరుల స్మారక కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నరేందర్ రావు, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు మమతా, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.